


# వుదయం




కరీంనగర్ | 21-01-2026 బుధవారం | సంపుటి : 14 | సంచిక : 45 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on




## సెన్సెక్స్ పతనం

**ఢిల్లీ :** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 1,066 పాయింట్లు, నిఫ్టీ 353 పాయింట్లు నష్టపోయింది. దీంతో ఒక్క రోజులోనే రూ.9 లక్షల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. మంగళవారం ఉదయం నుంచే ట్రేడింగ్ నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయం 83,207.38 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అంతకుముందు రోజు ముగింపుతో పోలిస్తే దాదాపు 40 పాయింట్ల నష్టంతో సెన్సెక్స్ ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగి.. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ ఒక దశలో 82,010.58 పాయింట్లను తాకింది. తర్వాత 1,065.71 పాయింట్లు నష్టపోయి 82,180.47 వద్ద ముగిసింది. సెన్సెక్స్ దాదాపు 1.28 శాతం నష్టపోయింది. అలాగే నిఫ్టీ కూడా 353 పాయింట్ల నష్టంతో 25,232.50 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్ డీఎఫ్సీ మాత్రమే లాభపడగా, మిగతా ప్రధాన షేర్లు నష్టపోయాయి.

### భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు.. ₹9 లక్షల కోట్లు ఆవిరి

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ప్రపంచ వాణిజ్యంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, విదేశీ మదుపర్ల అమ్మకాలు మన సూచీలపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఓ దశలో 1200 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ కూడా 25,200 దిగువకు చేరింది. తర్వాత కాస్త కోలుకున్నాయి. ఈ క్రమంలోనే సూచీలు రెండు నెలల కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. మదుపర్ల సంపద దాదాపు ఒక్కరోజులోనే రూ.9 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.9.46 లక్షల కోట్లు క్షీణించి రూ.455.7 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 83,207.38 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,246.18) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,010.58 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1065.71 పాయింట్ల నష్టంతో 82,180.47 వద్ద ముగిసింది. నిఫ్టీ 353 పాయింట్ల నష్టంతో 25,232.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.97గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఒక్క హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మినహా మిగిలిన స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. ఎటెర్నల్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, ఇండిగో, ట్రెంట్ ప్రధానంగా నష్టపోయాయి.

**కారణాలు ఇవీ..**

ఐటీ షేర్లలో అమ్మకాలు సూచీలపై తీవ్ర ప్రభావం చూపాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2.1 శాతం మేర పతనమైంది. విప్రో 3 శాతం, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ షేర్లు 7 శాతం మేర క్షీణించాయి. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల కారణంగా ఆయా కంపెనీలు బలహీన త్రైమాసిక ఫలితాలను ప్రకటించాయి. దీంతో ఐటీ కంపెనీల లాభాలపై ఆందోళన వ్యక్తమవుతున్న వేళ ఐటీ స్టాక్స్ భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

మిగతా 2లో

# తెలంగాణతో కరచాలనం

## హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటుకు ఆసక్తి చూపిన రాయల్ ఫిలిప్స్

దావోస్ ప్రపంచ ఆర్థిక వేదికపై రైజింగ్ తెలంగాణ • 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఆర్థిక వ్యవస్థ నిర్మాణమే మా ధ్యేయం : సిఎం రేవంత్‌రెడ్డి



**దావోస్ :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో తెలంగాణతో భాగస్వామ్యమయ్యేందుకు ప్రముఖ హెల్త్ టెక్ సంస్థ రాయల్ ఫిలిప్స్ ఆసక్తి వ్యక్తం చూపింది. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు అవకాశాలపై కూడా చర్చించేందుకు ముందుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక వేదిక–2026 వార్షిక సమావేశాల్లో భాగంగా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం మంగళవారం ఫిలిప్స్ గ్లోబల్ నాయకత్వంతో భేటీ అయ్యారు. రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ , గ్లోబల్ హెడ్ జాన్ విల్లెమ్– స్కీజ్ గ్రాండ్ మాట్లాడారు. ఏఐ రంగంలో తెలంగాణ చేపడుతున్న కార్యక్రమాలు తమను ఆకట్టుకున్నాయని చెప్పారు. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో తెలంగాణ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత సేవలపై ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 'తెలంగాణ నెక్స్ట్–జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026–2030' గురించి ప్రతినిధి బృందం వివరించింది. 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఆర్థిక వ్యవస్థ నిర్మించడమే ఈ విధాన లక్ష్యమని, మెడికల్ ఎలక్ట్రానిక్స్ సహా అనుబంధ రంగాలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఔషధ తయారీ, పరిశోధనాభివృద్ధి (ఆర్ అండ్ డీ) రంగాల్లో ప్రపంచ స్థాయి, స్థిరమైన పారిశ్రామిక క్లస్టర్‌ను తెలంగాణలో నిర్మిస్తున్నామని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్ మధ్యనున్న ప్రాంతంలో


మిగతా 2లో

సిఎం రేవంత్‌తో గూగుల్ ఎపి ఎసి ప్రెసిడెంట్ భేటీ 2

హైదరాబాద్‌లో యూనీ లీవర్ జిసిసి?

# ట్రాఫిక్ పోలీసుల దూకుడుకు కళ్లెం

## పెండింగు చలాన్ల వసూళ్ల పేరిట బండ్ల సీజ్ చెల్లదు



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** పెండింగ్ చలాన్ల సాకుతో వాహనాలు సీజ్ చేయడం, బలవంతపు వసూళ్లకు పాల్పడటం చట్టవిరుద్ధమని రాష్ట్ర హైకోర్టు స్పష్టం చేసింది. పెండింగ్ ట్రాఫిక్ చలాన్లు ఉన్నాయనే కారణంతో పోలీసులు వాహనాలను సీజ్ చేయడం, చలాన్ విధించిన వెంటనే అక్కడే జరిమానా కట్టాలని ఒత్తిడి చేయడం చట్టవిరుద్ధమని న్యాయస్థానం స్పష్టం చేసింది. వాహన తనిఖీలు నిర్వహించే సమయంలో ట్రాఫిక్ పోలీసులు కేవలం నిబంధనల ఉల్లంఘనపై కొత్త చలాన్లు విధించవచ్చని సూచించింది.



మిగతా 2లో

# నబీన్‌కు పట్టం

## బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్ • నితిన్ ఈజ్ మై బాస్ : ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, జనవరి 20 :** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా మంగళవారం నితిన్ నబీన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, పార్టీ ప్రజాస్వామిక ఎన్నికల ప్రక్రియను కొనియాడుతూ, ఇప్పుడు తాను కార్యకర్తనని, నితిన్ తనకు బాస్ అంటూ పేర్కొన్నారు. ఇప్పుడు బీజేపీ వారసత్వాన్ని నితిన్ ముందుకు తీసుకువెడతాడన్నారు. బీహార్‌కు చెందిన నితిన్ నబీన్ ఐదుసార్లు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కూడా. అతడి సంస్థాగత, పాలక అనుభవం రెండూ ఉన్నాయి. ప్రజలు నరేంద్ర మోడీ దేశ ప్రధాన మంత్రి అనుకుంటారు, కానీ పార్టీ విషయానికి వచ్చినప్పుడు నేను పార్టీ కార్యకర్తను, నితిన్ నబీన్ నా బాస్ అంటూ బీజేపీ కేంద్ర కార్యాల యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ అన్నారు. తన ఉపన్యాసంలో భాగంగా ప్రధాన మంత్రి కాషాయ పార్టీ మాజీ అధ్యక్షులందరినీ వారి అమూల్యమైన సేవలను గుర్తు చేసుకుంటూ అభినందించారు. పార్టీ అధ్యక్ష పదవికి ఎంపిక ప్రక్రియ గురించి మాట్లాడుతూ, బీజేపీ అధ్యక్షుడిని ప్రజాస్

మిగతా 2లో




# ప్రజాస్వామ్యానికి కార్పొరేట్ శక్తుల నుంచి సవాల్

## ఖమ్మంలో సీపీఐ జాతీయ సెమినార్‌లో డిప్యూటీ సీఎం భట్టి

**వుదయం, ఖమ్మం :** దేశంలోని కార్పొరేట్ , ఫాసిస్టు శక్తులు మతం అనే సెంటిమెంట్ పేరుతో ఆర్థిక, సామాజిక అంశాలను తప్పుదోవ పట్టించి దేశ ప్రజాస్వామ్యానికి సవాల్ విసురుతున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. సీపీఐ శత వసంతాల్లో భాగంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన జాతీయ సెమినార్ లో ఆయన ప్రసంగించారు. దేశాన్ని,రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్న భట్టి.. లేదంటే సగటుకు మనిషికి హక్కులు దక్కకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు హక్కును నాశనం చేస్తుందన్నారు., రాజ్యాంగంలో మార్పుల కోసం ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్, వామపక్ష పార్టీలు కలిసి ఈ దేశంలో సుదీర్ఘ రాజకీయ ప్రయాణం చేయాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి సవాల్ విసురుతున్న

మిగతా 2లో

గద్దర్ అవార్డులకు దరఖాస్తులు చేసుకోండి 12

మెట్రో రెండో దశను ఆమోదింప చేయండి
కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సిఎం రేవంత్ లేఖ 2

# సిట్.. గరం గరం

## జూబ్లీహిల్స్ పిఎస్‌లో హరీశ్ రావును ఏడుగంటల సేపు విచారించిన సిట్ అధికారులు

మునుగోడు ఎన్నికల సమయంలో ఫోన్ టాపింగ్ ఆరోపణలపై విచారణ


మీ బావమరిది భాగోతం బయటపెడితే నోటీసులు ఇప్పిస్తావా : సిఎంకు హరీశ్ రావు ప్రశ్న

## పోలీసులు, బిఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా మాజీ మంత్రి హరీష్‌రావును సిట్ అధికారుల బృందం మంగళవారం ఏడు గంటల పాటు విచారించింది. ఇందులో మునుగోడు ఉప ఎన్నికల సమయంలో శ్రవణ్‌రావుకు కొన్ని నంబర్లు ఇచ్చి ట్యాప్ చేయించారని హరీశ్ రావుపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శ్రవణ్‌రావుకు డైరెక్షన్స్ ఇవ్వడం వెనుక ఉన్నదెవరు? ఈ కేసులో నిందితులైన రాధాకిషన్‌రావు, ప్రభాకర్‌రావుతో హరీశ్‌రావుకు ఉన్న సంబంధాలు ఏంటి? ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు అసలు సూత్ర ధారులు ఎవరు? అనే అంశాలపై దర్యాప్తు బృందం ప్రశ్నించింది. ఈ కేసులో తొలిసారి సిట్ ఎదుట హాజరైన హరీశ్‌రావు నుంచి సిట్ అధికారులు కీలక విషయాలు రాబట్టే ప్రయత్నం చేసింది.


### న్యాయవ్యవస్థపై నాకు నమ్మకం ఉంది

విచారణ ముగిసిన అనంతరం తెలంగాణ భవన్‌కు చేరుకున్న హరీష్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఉద్యమ స్పూర్తితోనే తమ పార్టీ ఏర్పాటు అయిందన్నారు. తమకు ఉద్యమాలు కొత్త కాదని చెప్పారు. కాంగ్రెస్ నేతల మాదిరిరిగా తాము పారిపోలేదని విమర్శించారు. అక్రమ కేసులు సమైక్య రాష్ట్రంలో చాలా పెట్టారన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన నోటీసులను తాము గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఉదయం మీ బామ్మర్ది బాగోతం బయట పెడితే సాయంత్రం నాకు నోటీసులు ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డిపై పరోక్ష ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి... నీకు దమ్ముంటే నాకు నోటీసులు ఇవ్వడం కాదు... రాజకీయంగా కోట్లాడుదామని హరీశ్ రావు సవాల్ విసిరారు. నీ దోపిడీకి అడ్డు వస్తున్నామని చిల్లర రాజకీయాలు చేస్తున్నావంటూ ధ్వజమెత్తారు. ప్రజలు తిరగబడే



నేనే వంద ప్రశ్నలు అడిగా : హరీశ్

మిగతా 2లో



సినిమా టిక్కెట్ల పెంపుపై

# హైకోర్టు సీరియస్


● విడుదలకు ముందు ధరలు పెంచితే ఊరుకోం
● 90 రోజుల ముందే నిర్ణయం తీసుకోవాలి ● రాజాసాహెబ్ సినిమా రేట్లు భారీగా పెంచినందుకు ఆగ్రహం ● సివి ఆనంద్‌కు ధిక్కార నోటీస్

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** ఇకపై సినిమా విడుదలకు ఒకటి రెండు రోజుల ముందు టికెట్ ధరలు పెంచితే సహించబోమని హైకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఇకపై ఏ సినిమా రేట్ల పెంపు విషయాన్ని 90 రోజుల ముందే నిర్ణయం తీసుకోవాలని సూచించింది. సంక్రాంతి సందర్భంగా విడుదలైన రాజాసాబ్ సినిమాకు టికెట్ రేట్లను భారీగా పెంచడంతో సీరియస్ అయింది. మీకెన్నిసార్లు చెప్పాలంటూ ప్రభుత్వంపై మండిపడింది. సినిమా టిక్కెట్ల ధర పెంపుపై దాఖలైన పిటీషన్ పై హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఇప్పటికే పుష్ప–2 సినిమా టికెట్ల ధరల పెంపు సమయంలో

మిగతా 2లో

# అమెరికా కొత్త మ్యాప్

## గ్రీన్‌లాండ్, వెనెజులా, కెనెడాలను కలుపుకుని కొత్త మ్యాప్‌ను విడుదల చేసిన అధ్యక్షుడు ట్రంప్




**వాషింగ్టన్, జనవరి 30 :** కెనెడా, వెనెజులా, గ్రీన్‌లాండ్ యునైటెడ్ స్టేట్స్ లోని రాష్ట్రాలుగా చూపుతూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారం నాడు ఒక కొత్త మ్యాప్‌ను పోస్ట్ చేశారు. ఎఐ ద్వారా తయారు చేసిన మ్యాప్‌లా అనిపిస్తున్న ఆ చిత్రపటాన్ని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ప్లాట్‌పామ్‌పై పోస్ట్ చేశారు. ఆయన తన ఐరోపా మిత్రపక్షంతో గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడం గురించి చేస్తున్న వాగ్వివాదం నడుమ ఇది వెలువడడం విశేషం. కొద్ది నిమిషాల అనంతరమే, గ్రీన్‌లాండ్‌లో యుఎస్‌ఎ జెండాతో , గ్రీన్‌లాండ్ యుఎస్ భూభాగం, 2026లో స్థాపన అనే సందేశంతో ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, విదేశాంగ్ మంత్రి మార్కోరూబియోతో కూడిన మరొక ఫోటోను పోస్ట్ చేశారు. గత ఏడాది అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ కెనెడాను

మిగతా 2లో

# మనేకా ధిక్కారం




## వీధి కుక్కల కేసులో జడ్జిలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆమెపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ, జనవరి 20 :** వీధి కుక్కల విషయంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను విమర్శిస్తూ మాజీ కేంద్ర మంత్రి మనేకా గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు మంగళవారం విరుచుకుపడింది. ఆమె కోర్టు ధిక్కారానికి పాల్పడిందని పేర్కొంది. మాజీ కేంద్ర మంత్రి ఏ మాత్రం ఆలోచించకుండా ప్రతివారిపై అన్ని రకాల వ్యాఖ్యానాలు చేశారని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్ వి అంజారియాలతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. ఆమెపై ధిక్కార చర్య తీసుకోకపోవడం కోర్టు ఉదారత అని ధర్మాసనం పేర్కొంది. తన వ్యాఖ్యలను కోర్టు ఆలోచించాలని అన్నారు, కానీ మీ క్లైంట్ ఎటువంటి వ్యాఖ్యలు చేసిందో మీరు ఆమెనుఅడిగారా? మీరు ఆమె పాడ్‌కాస్ట్ విన్నారా? ఏ మాత్రం ఆలోచించకుండా ఆమె అందరి గురించీ అన్ని రకాల వ్యాఖ్యలను చేసింది. మీరు ఆమె బాడీ లాంగ్వేజ్‌ను గమనించారా? అని మనేకా గాంధీ తరఫున వాదించేందుకు వచ్చిన సీనియర్ న్యాయవాది రాజు

మిగతా 2లో

# మనేకా ధిక్కారం



మొదటి పేజీ తరువాయి..

రామచంద్రన్‌ను కోర్టు ప్రశ్నించింది. మాజీ కేంద్ర మంత్రిగా మేనకా గాంధీ కేటాయించిన ఎంత బడ్జెట్టు వీధి కుక్కల సమస్యను నిర్మూలించేందుకు తోడ్పడిందని జస్టిస్ మెహతా న్యాయవాదిని అడిగారు. కాగా, కోర్టు చేసిన వ్యాఖ్యలపై మాట్లాడేందుకు రామచంద్రన్ నిరాకరించారు. కేసు విచారణ జరుగుతున్నందున అది ధిక్కారమవుతుందని ఆయన అన్నారు. ఒక దశలో, తాను 26/11 నిందితుడు, తీవ్రవాది అజ్మల్ కసాబ్ తరపున వాదించానని, బడ్జెట్ కేటాయింపు అనేది విధానపరమైన విషయమని అన్నారు. అయితే, అజ్మల్ కసాబ్ కోర్టు ధిక్కారానికి పాల్పడలేదని, మీ క్లైంటు పాల్పడిందని జస్టిస్ నాథ్ వ్యాఖ్యానించారు. వీధి కుక్కలకు తిండిపెట్టేవారే బాధ్యులన్న మాటలను తాము వ్యంగ్యం అనలేదని, ఈ విచారణ జరుగుతున్న సమయంలో చర్చ సమయంలో అన్నదని ధర్మాసనం పేర్కొంది.

**వివాదం ఏమిటి?**

వీధి కుక్కలను బహిరంగ స్థలాల నుంచి తొలగించాలంటూ ఆదేశమిచ్చి దేశంలోని అత్యున్నత న్యాయస్థానం, జడ్జీలు అపకారం చేశారని జనవరి 14వ తేదీన మేనకాగాంధీ వ్యాఖ్యానించారు. ఇది దేశాన్ని విభజించిందని అన్నారు. కుక్కలపై బలవంతపు వైఖరికి వ్యతిరేకంగా వాదించారు. సమస్య కుక్కలు కాదని, వాటిని నియంత్రించడంలో పౌర వ్యవస్థలు కుప్పకూలడమని ఆమె అన్నారు. మునిసిపల్ స్టెరిలైజేషన్ కార్యక్రమాలు కేవలం కాగితంపైనే ఉన్నాయని, వీధులలో, ఆవరణలలో చెత్త అలా పడి ఉంటుందని, ఆసుపత్రులు ఆహారాన్ని, బయోమెడికల్ వృధాలను బహిరంగంగా పడేస్తున్నారని ఆరోపించారు. చెత్త, ఆహారం ఉన్న చోట కుక్కలు కూడితే, స్పందన అసలు కారణాన్ని పరిష్కరించడం కాక, సింప్టమ్‌కు శిక్ష విధించడంగా ఉందన్నారు. ప్రభుత్వ సంస్థల అసలు పరిస్థితిని పరిశీలించడానికి కోర్టు ప్రయత్నించవలసిందని అన్నారు. ఒక వ్యవస్థను ఒక అద్భుతాన్ని ప్రదర్శించమనడం పరిష్కారం కాదని, అది వైఫల్యాన్ని అంగీకరించడమని అన్నారు. జనవరి 13న, అత్యున్నత న్యాయస్థానం, కుక్క కరిచిన ఘటనలలో రాష్ట్రాలు భారీగా నష్టపరిహారం చెల్లించాలని కోరుతామని, అటువంటి కేసుల్లో కుక్కలకు ఆహారమిచ్చే వారిని బాధ్యులను చేస్తామని వ్యాఖ్యానించింది.

# తెలంగాణతో కలిసి పనిచేస్తాం

భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి

యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ

దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ



**దావోస్ :** భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి యూఏఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి హెచ్.ఈ. అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వేదిక –2026 సదస్సులో భాగంగా దావోస్‌లో యూఏఈ మంత్రి పీఎం రేవంత్ రెడ్డితో మంగళవారం భేటీ అయ్యారు. 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి రాష్ట్రంలో చేపట్టే భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ముఖ్యంగా భారత్ ఫ్యూచర్ సిటీపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ అభివృద్ధి అవకాశాలపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇది దేశంలోనే తొలి నెట్–జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. సుమారు 30 వేల ఎకరాల్లో విస్తరించే ఈ నగరంలో ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాస, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్ట్‌లో ఇప్పటికే మారుబేని, సెమ్ కార్ప్ వంటి అంతర్జాతీయ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని, ఇటీవలే రిలయన్స్ గ్రూప్ వంతారాతో ఫ్యూచర్ సిటీలో కొత్త జూ ఏర్పాటు కోసం అవగాహన ఒప్పందం కుదిరిందని సీఎం వెల్లడించారు. తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రాజెక్ట్ వేగవంతమయ్యేందుకు రెండు ప్రభుత్వాల అధికారులతో సంయుక్త టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్‌తో తెలంగాణ కలిసి పనిచేసి గ్రామీణ, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ తరఫున ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# అమెరికా కొత్త మ్యాప్

మొదటి పేజీ తరువాయి..

యుఎస్‌ఎలో 51వ రాష్ట్రంగా చేస్తానంటూ ఆఫర్ చేశారు. అయితే, కెనెడా ప్రభుత్వం దానిని తిరస్కరించడంతో, రెండు పొరుగుదేశాల మధ్య తీవ్రమైన వాణిజ్య యుద్ధం నెలకొంది. ఈ నెల మొదట్లో, వెనెజులాలో యుఎస్ ప్రత్యేక దళాలు ఒక ఆపరేషన్‌ను నిర్వహించి, అధ్యక్షుడు నికొలస్ మదురోను, అతడి భార్య కారకస్‌ను బందీలుగా పట్టుకొని, మాదక ద్రవ్యాల ఆరోపణలలో విచారణను ఎదుర్కొనేందుకు న్యూయార్క్ తీసుకువచ్చారు. అప్పటి నుంచీ, ట్రంప్ అమెరికానే వెనెజులాను నడుపుతుందని, ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలను యుఎస్ కంపెనీలే నియంత్రిస్తాయని పేర్కొంటున్నారు. అంతేకాదు, వాషింగ్టన్ చెప్పింది చేయాలని, లేదంటే పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని, తాత్కాలిక అధ్యక్షుడు డెల్సీ రోడ్రిగజ్‌ను ఆయన హెచ్చరించారు. అయితే, వెనెజులా విషయంలో ట్రంప్ ఇంత బహిరంగంగా మాట్లాడడం ఇదే తొలిసారి.

**ట్రంప్‌కు గ్రీన్‌లాండ్ ఎందుకు?**

ఆ ద్వీపంపై యునైటెడ్ స్టేట్స్‌కు స్థావరం ఉండటమే కాదు నాటో మిత్రపక్ష దేశమైన డెన్మార్క్‌తో భద్రతా ఒప్పందాలు ఉన్నప్పటికీ, విస్తృతంగా, ఖనిజాలతో సుసంపన్నమైన గ్రీన్‌లాండ్ జాతీయ భద్రతా రీత్యా యుఎస్‌ఎకు అవసరమని ట్రంప్ పదే పదే చెప్తూ వస్తున్నారు. కాగా, తనకు నోబెల్ బహుమతి ఇవ్వకుండా విస్మరించినందుకు తాను కేవలం శాంతి గురించే మాట్లాడాల్సిన అవసరం లేదనిపిస్తోందని అంటూ, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలన్న ప్రచారాన్ని ట్రంప్ ఉధృతం చేశారు. నార్వే ప్రధానమంత్రితో అసాధారణమైన మాటల యుద్ధంలో, ఆర్కిటిక్ ద్వీపంపై డెన్మార్క్ హక్కును ప్రశ్నించారు. దానిపై తనకు సంపూర్ణమైన, పరిపూర్ణమైన నియంత్రణ కావాలన్నారు. దాదాపు 8 యుద్ధాలకు పైగా నిలిపివేసిన తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వకూడదని మీ దేశం నిర్ణయించినందున, కేవలం శాంతి గురించే ఆలోచించాలన్న ఆబ్లిగేషన్ తనకు లేదంటూ, నార్వే ప్రధాని జోనాస్ గర్ స్టోర్‌కు ట్రంప్ లేఖ రాశారు. వీటితో పాటుగా, గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయాలన్న తన ప్రణాళికను వ్యతిరేకించే ఐరోపా మిత్రదేశాలపై భారీ నూతన సుంకాలను విధిస్తానంటూ ట్రంప్ బెదిరించడం, ఆయా దేశాల రాజధానుల్లో కలకలం చెలరేగి, సోమవారం ప్రారంభం కాగానే స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి.



# ట్రాఫిక్ పోలీసుల దూకుడుకు కళ్లెం

మొదటి పేజీ తరువాయి..

అంతే తప్ప, పాత బకాయిలు వసూలు చేయడానికి వాహనాన్ని స్వాధీనం చేసుకోవద్దని తేల్చిచెప్పింది. మోటరు వాహన చట్టం ప్రకారం పెండింగ్ చలాన్ల వసూలుకు నిర్దిష్ట పద్ధతులు పాటించాలేగాని.. నడిరోడ్డుపై వెహికిల్స్ ను ఆపి, వారిని ఇబ్బంది పెట్టడం సరికాదని అని జస్టిస్ కె.సుజన ధర్మాసనం అధికారులను ఆదేశించింది. పెండింగ్ చలాన్ల వసూలుకు పోలీసులు రికవరీ ఏజెంట్లలా వ్యవహరించకూడదని న్యాయస్థానం హితవు పలికింది. పాత బకాయిలు ఉన్నంత మాత్రాన వాహన స్వేచ్ఛా రాకపోకలకు ఆటంకం కలిగించరాదని స్పష్టం చేసింది. ట్రాఫిక్ పోలీసులు తమ పరిధి దాటి వ్యవహరించకూడదని, కేవలం చట్టం నిర్దేశించిన మేరకే నడుచుకోవాలని హెచ్చరించింది. ఆన్‌లైన్ చలాన్ల విధానం అమలులో ఉన్నందున, పెండింగ్ ఉంటే నోటీసులు పంపాలి లేదా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలి. అంతేకానీ సాధారణ తనిఖీల పేరుతో వాహనాలను ఆపి, పాత బాకీలు కడితేనే బండి ఇస్తామనడం సరికాదని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. వాహనదారులకు భారీ ఊరటనిచ్చేలా హైకోర్టు తీర్పు ఇచ్చింది. వాహన తనిఖీల సమయంలో పోలీసులు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలను అడిగే అధికారం కలిగి ఉంటారు. ఒకవేళ వాహనదారుడి వద్ద సరైన పత్రాలు లేకపోతే మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 207 ప్రకారం వాహనాన్ని సీజ్ చేసే అవకాశం పోలీసులకు ఉంది. అయితే కేవలం గతంలో విధించిన ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయన్న ఒకే ఒక్క కారణంతో బండిని లాక్కోవడం నిబంధనలకు విరుద్ధమని కోర్టు తెలిపింది. పెండింగ్ చలాన్ల వసూలు కోసం పోలీసులు చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించాలనీ ఇందుకు సంబంధించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయడం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించింది.

# సినిమా టిక్కెట్ల పెంపుపై హైకోర్టు సీరియస్

మొదటి పేజీ తరువాయి..

దాఖలైన పిటిషన్ పై ఇకపై ఏ సినిమా టికెట్ రేట్లనైనా పెంచవద్దని ఆదేశాలు జారీ చేశామని గుర్తు చేసింది. అనిల్ రావిపూడి – చిరంజీవి కాంబినేషన్లో వచ్చిన మనశంకర వరప్రసాద్ సినిమా టికెట్ ధరలను కూడా పెంచారని, ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకురాలేదని సదరు పిటిషనర్.. కోర్టుకు తెలిపారు. దీంతో న్యాయస్థానం రాష్ట్ర హోంశాఖ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న సీవీ ఆనంద్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. సినిమా టికెట్ల ధరల పెంపుపై సమాధానమివ్వాలని ఆదేశించింది.

# ప్రజాస్వామ్యానికి కార్పొరేట్ శక్తుల నుంచి సవాల్

మొదటి పేజీ తరువాయి..

కార్పొరేట్ శక్తులను, దేశంలో ఆర్థిక సామాజిక అంశాలను తప్పుదోవ పట్టిస్తున్న ఆశక్తులను ఐక్య పోరాటాల ద్వారా అడ్డుకట్ట వేద్దామని అన్ని రాజకీయ పార్టీలు, మేధావులకు పిలుపునిచ్చారు. కలిసి ముందుకు పోదామని వామపక్ష పార్టీలకు విన్నవించారు. దోపిడీ వర్గాలు, దోపిడీకి గురయ్యే వర్గాల మధ్య కాకుండా దేశంలో మారిన రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా వామపక్షాలు ముందుకు కదలాలన్నారు. వర్గ పోరాటం ద్వారానే సోషలిజం సాధ్యమని కార్ల్ మార్క్స్ చెప్పారన్నారు. వర్గ పోరు అనేది లేకుండా చేసి పార్లమెంటు వ్యవస్థ ప్రశ్నార్థకమైన నేపథ్యంలో కమ్యూనిస్టుల పాత్ర ఈ దేశంలో కీలకమన్నారు.

# బొగ్గు కుంభకోణంపై విచారణ జరపాలి

- సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి తో ఎంక్వైరీ జరపాలి
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజాయితీ.. చిత్తశుద్ధి ఉంటే బొగ్గు కుంభకోణంపై విచారణ జరిపించాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ జరిపించి... బొగ్గు టెండర్ల విషయంలో అవినీతి జరిగిందో లేదో నిగ్గు తేల్చాలన్నారు. ఒకవేళ జరిగితే ఏ విధంగా జరిగిందో బయటపెట్టాలన్నారు. మంగళవారం హైదరాబాద్ లో ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రధాన ప్రతిపక్షం హోదాలో ఉన్న బీఆర్ఎస్ నేతలను ఇబ్బందులకు గురి చేయాలనే ఉద్దేశ్యంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక.. రాష్ట్రంలో బలపడుతున్న ప్రతిపక్షాన్ని దెబ్బకొట్టేందుకు కేసులు నమోదు చేస్తూ నోటీసులతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగానే హరీష్ రావుకు నోటీసులు ఇచ్చారని చెప్పారు. ఏ ఎన్నికలు వచ్చినా నోటీసులు ఇచ్చి విచారణ పేరుతో వేధిస్తున్నారని అన్నారు. మొన్న సర్పంచ్ ఎన్నికల్లో తాకిన దెబ్బతోనే ఏదో డ్రామా ఆడాలని అనుకుంటున్నారని చెప్పారు. ఇలాంటి నోటీసులు ఎన్ని ఇచ్చినా ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు, చేసిన వాగ్దానాలు గాలికి వదిలేసి పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. బతుకమ్మ చీరలు మొన్న గ్రామాల్లో పంచితే ఇప్పుడు ఎన్నికలు ఉన్నాయని నగరంలో పంచుతున్నారని ఆరోపించారు. వాటాల్లో తేడాలు, విభేదాలతో రాష్ట్ర మంత్రులు ఒకరిపైమరొకరు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ కాంగ్రెస్ పాలనలో జరిగిన అవినీతిని బయటపెట్టుకున్నారన్నారు.

# యూనిలీవర్ పరిశీలన

హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు అవకాశాలపై

దావోస్‌లో సీఎం బృందంతో యూనిలీవర్ ఉన్నతాధికారుల భేటీ



**దావోస్ :** ప్రపంచ వ్యాప్తంగా వస్తు వినియోగరంగంలో అగ్రగామిగా ఉన్న యూనిలీవర్ సంస్థ, హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేసే అవకాశాలపై ఆసక్తి వ్యక్తం చేసింది. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా మంగళవారం దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం యూనిలీవర్ చీఫ్ సప్లై చైన్ అండ్ ఆపరేషన్స్ ఆఫీసర్ విల్లెమ్ ఉయిజెన్తో సమావేశమైంది. తెలంగాణలో జీసీసీ ఏర్పాటు అంశంపై విస్తృతంగా చర్చించింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు కేంద్రంగా హైదరాబాద్ వేగంగా మారుతుందన్నారు.. దీనిపై స్పందించిన విల్లెమ్ ఉయిజెన్ హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు అవకాశాలను తమ సంస్థ సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఇప్పటికే మెక్‌డొనాల్డ్స్, హైనెకెన్, కాస్టకో వంటి ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ (త్వరగా వినియోగ వస్తువుల) సంస్థల జీసీసీలు విజయవంతంగా పనిచేస్తున్నాయని చెప్పారు. తెలంగాణకు యూనిలీవర్ విలువైన భాగస్వామి అని, వేగవంతమైన అనుమతులు, లైసెన్సింగ్ ప్రక్రియలతో తెలంగాణ వ్యాపారాలకు అనుకూల రాష్ట్రంగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహా తెలంగాణ రైజింగ్ బృందం, తెలంగాణలోని పారిశ్రామిక పార్కుల్లో త్వరగా వినియోగ వస్తువుల (ఎఫ్‌ఎంసీజీ) తయారీ రంగంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని యూనిలీవర్‌ను ఆహ్వానించారు. వాతావరణ పరిరక్షణ, నీటి వినియోగంలో సానుకూలత, ప్లాస్టిక్ వినియోగ తగ్గింపు వంటి యూనిలీవర్ లక్ష్యాలను, తెలంగాణ చేపడుతున్న పునరుత్పాదక శక్తి, నీటి సంరక్షణ, సర్క్యులర్ ఎకానమీ కార్యక్రమాలతో అనుసంధానం చేసే అంశాలపైనా చర్చలు జరిగాయి

# తెలంగాణతో భాగస్వామ్యానికి గూగుల్ ఆసక్తి

- సీఎం రేవంత్‌రెడ్డితో గూగుల్ ఏపీఏసీ ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా సమావేశం
- ట్రాఫిక్, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్‌లు, వ్యవసాయం, క్లైమేట్ చేంజ్ రంగాల్లో సహకారం

**దావోస్ :** ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ వివిధ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. వ్యవసాయం, వాతావరణ మార్పు, పట్టణ కాలుష్య సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వా మ్యం పంచుకుంటామని తెలిపింది. ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్‌లలో భాగస్వామ్యం పంచుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో సీఎం రేవంత్ రెడ్డి గూగుల్ ఆసియా పసిఫిక్ ఏరియా (ఏపీఏసీ) ప్రెసిడెంట్ సంజయ్ గుప్తాతో సమావేశమయ్యారు. ప్రధానంగా వాతావరణంలో పెను మార్పులు, వ్యవసాయంపై దాని ప్రభావం, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న కాలుష్యం వంటి సమస్యల పరిష్కారాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి నమూనాను వివరించారు. కోర్ హైదరాబాద్ సిటీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే ప్రణాళికలను వివరించారు. ట్రాఫిక్ కంట్రోల్, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్ ఇన్నోవేషన్‌కు మరింత మద్దతు వంటి రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తొలి గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినందుకు గూగుల్ బృందానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ రంగంలో ఎరువుల అతిగా వినియోగంతో ఏర్పడుతున్న సమస్యలు, రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరంపై ప్రతినిధుల బృందం చర్చించింది. సమస్యల పరిష్కారానికి, సమస్యలు తలెత్తకుండా నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రేవంత్ స్పష్టం చేశారు. గూగుల్ ఏపీఏసీ ప్రెసిడెంట్ శ్రీ సంజయ్ గుప్తా మాట్లాడుతూ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్‌లు మరియు వాతావరణ మార్పు



అంశాల్లో తెలంగాణకు పూర్తి స్థాయిలో మద్దతు అందించేందుకు గూగుల్ సిద్ధంగా ఉందని తెలిపారు.

ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విస్తృత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, బీఎఫ్‌ఎస్‌ఐ స్కిల్లింగ్, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలాతో భాగస్వామ్యం, ఏఐ పాఠ్యాంశాల అమలును ప్రధానంగా ప్రస్తావించారు. ప్రభుత్వం పాఠశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా, టీ–ఫైబర్ ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ అందిస్తుందని వివరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో పాటు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# సిట్.. గరం గరం

మొదటి పేజీ తరువాయి..

రోజులు దగ్గర లోనే ఉన్నాయన్నారు. మాకు చట్టం మీద నమ్మకం గౌరవం ఉందని చెప్పిన టహరీశ్ రావు.. నువ్వు ఎక్కడకు పిలిచినా వస్తానన్నారు. ఈ రోజు రాత్రి మళ్లీ మరో లీక్ ఇస్తారని, దమ్ముంటే సిట్ అధికారులు తనను అడిగిన ప్రశ్నలు జవాబు లు అన్ని బయటపెట్టాలని హరీష్ రావు అన్నారు. ఈ నోటీసు లు తమను బయటపెట్టవని, నీపతనాన్ని వేగవంతం చేస్తాయన్నారు.

**నేనే వందల ప్రశ్నలు అడిగా..**

సిట్ అధికారులు తనను ప్రశ్నించడం కాదనీ తానే వారికి వందల ప్రశ్నలు వేశానని హరీశ్‌రావు చెప్పారు. అప్పటి డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్ లను విచారణకు పిలవాలని సూచించానన్నారు. శివధర్ రెడ్డి, మహేందర్ రెడ్డి లను విచారణకు పిలవాలి అని డిమాండ్ చేశానన్నారు. తమ పాలనలో జరిగిన ఫోన్ టాపింగ్ కు తనకేం సంబంధం అని సిట్ అధికారులను ప్రశ్నించానన్నారు. అప్పట్లో తాను హోం మంత్రి కాదనే విషయాన్ని గుర్తు చేశానన్నారు. బొగ్గు టెండర్ల అంశంపై సైట్ విజిట్ సర్టిఫికేట్ పేరుతో జరిగిన కుంభకోణాన్ని తాము బట్టబయలు చేశామని చెప్పారు. ప్రతి దానికి సిట్‌లు వేస్తున్న ప్రభుత్వం దానిపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిజాయితీపరుడివి అయితే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మంత్రులు, నాయకులందరూ టెండర్ల కోసం కొట్లాడుకుంటున్నారని అందుకే ఈ అవినీతి బాగోతం బయటపడింది అని హరీశ్‌రావు అన్నారు.

**మునుగోడు బైపోల్ చుట్టూ ప్రశ్నలు..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024 మార్చిలో ఎస్ఐబీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో ప్రస్తుతం హరీశ్‌రావును సిట్ విచారిస్తోంది. ఈ కేసులో ఫైనల్ చార్జిషీట్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ కేసులో అధికారులను ఇప్పటికే విచారించగా రాజకీయ నాయకుల పాత్ర ఏంటనేది మాత్రమే మిగిలి ఉంది. ఇందులో భాగంగా తాజాగా హరీశ్‌రావును సిట్ టీమ్ మంళవారం విచారించింది, అయితే మునుగోడు ఉప ఎన్నికల సమయంలో శ్రవణ్‌రావుకు కొన్ని నంబర్లు ఇచ్చి ట్యాప్ చేయించారనేది ప్రధానంగా హరీశ్‌రావుపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శ్రవణ్‌రావుకు డైరెక్షన్స్ ఇవ్వడం వెనుక ఉన్నదెవరు? ఈ కేసులో నిందితులైన రాధాకిషన్‌రావు, ప్రభాకర్‌రావుతో హరీశ్‌రావుకు ఉన్న సంబంధాలు ఏంటి? ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు అసలు సూత్రధారులు ఎవరు? అనే అంశాలపై దర్యాప్తు బృందం ప్రశ్నించింది.

**వేడెక్కిన రాజకీయం..**

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. ఈ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావుకు నోటీసులు జారీ చేయడంతో పరిస్థితి మారిపోయింది. మంగళవారం ఉదయం హరీశ్ రావు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు. ఆయనను సీపీ సజ్జనార్ నేతృత్వంలోని సిట్ అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నారు. హరీష్ రావుతో పాటు వెళ్లిన ఆయన న్యాయవాదులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. నోటీసులు ఇచ్చిన కేసులో హరీశ్ రావుకు ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని ఆయన తరపు న్యాయవాదులు స్పష్టం చేశారు. ఇది పూర్తిగా రాజకీయ ఉద్దేశాలతో సాగుతున్న ప్రక్రియ అంటూ బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. మరోవైపు, హరీష్ రావును దాదాపు 7 గంటలు విచారించిన సిట్.. మళ్లీ పిలుస్తామంటూ వదిలేసింది. ఇదిలావుంటే హరీష్ రావుపై గతంలో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసును రాష్ట్ర హైకోర్టు రద్దు చేసింది. ఆ కేసులో హరీశ్ రావు నేరుగా ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలు ఇచ్చారని, కుట్రలో భాగమయ్యారని చెప్పేందుకు సరైన ఆధారాలు లేవని కోర్టు అభిప్రాయపడింది. దీంతో దానిని కొనసాగించడం చట్టబద్ధం కాదని పేర్కొంటూ హైకోర్టు ఈ కేసును కొట్టివేసింది. హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, అక్కడ కూడా ప్రభుత్వానికి ఊరట లభించలేదు. సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో ఆ నిర్దిష్ట ఫోన్ ట్యాపింగ్ కేసు పూర్తిగా ముగిసినట్టయ్యింది. తాజాగా సిట్ మరోసారి విచారించింది.

**పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత..**

సిట్ అధికారులు హరీశ్ రావును విచారిస్తున్న సమయంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పరిస్థితి ముదిరి పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు.

# సెన్సెక్స్ పతనం

మొదటి పేజీ తరువాయి..

గ్రీన్‌లాండ్ విషయంలో తనకు సహకరించకుంటే టారిఫ్‌లు విధిస్తానని యూరోపియన్ యూనియన్ దేశాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో మళ్లీ టారిఫ్ వార్ భయాలు మార్కెట్లలో మొదలయ్యాయి. ఈ ప్రభావం మన మార్కెట్లపైనా పడింది. విదేశీ మదుపర్ల వరుస అమ్మకాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఎఫ్ఐఐలు సోమవారం కూడా రూ.3263 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు. మొత్తంగా మంగళవారం ఒక్క రోజే దాదాపు రూ.9 లక్షల కోట్లు ఇన్వెస్టర్లు నష్టపోయారు. అంతర్జాతీయ వాణిజ్య సరళి, టారిఫ్ల మోత, ఫారిన్ ఇన్వెస్టర్ల అమ్మకాలు, గ్లోబల్ పాలిటిక్స్ వంటివి సెన్సెక్స్ పతనానికి కారణాలుగా నిపుణులు చెబుతున్నారు.

# తెలంగాణతో కరచాలనం

మొదటి పేజీ తరువాయి..

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కొత్త లైఫ్ సైన్సెస్ విధానం, ఔషధ తయారీ వ్యూహాలు కలిసి తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు పునాది వేస్తాయని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు, బలమైన ఐటీ–లైఫ్ సైన్సెస్–హెల్త్ కేర్ టాలెంట్ బేస్, జీనోమ్ వ్యాలీ, 300 ఎకరాలకుపైగా విస్తరించిన మెడికల్ డివైసెస్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఉన్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ వైద్య పర్యాటకానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, ఇక్కడి ఆస్పత్రులు ఇప్పటికే క్రిటికల్ కేర్, అంబులెన్స్ సేవలు వంటి రంగాల్లో ఏఐను సమర్థవంతంగా వినియోగిస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఏఐకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏఐ సిటీని నిర్మిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. "ఇదే సరైన సమయం. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేయడానికి ఇది ఉత్తమ అవకాశమని" మంత్రి పేర్కొన్నారు. తెలంగాణకు వచ్చి.. జీనోమ్ వ్యాలీని సందర్శించాలని మంత్రి ఫిలిప్స్ నాయకత్వాన్ని ఆహ్వానించారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఇప్పటికే మెడ్ ట్రానిక్, ఒలంపస్, జీఈ వంటి అగ్రశ్రేణి సంస్థల ఎంబెడెడ్ ఇంజినీరింగ్, ఆర్ అండ్ డీ కేంద్రాలు ఉన్నాయన్నారు. రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ జాన్ విల్లెమ్– స్కీజ్ గ్రాండ్ మాట్లాడుతూ.. ఆరోగ్య రంగంలో తెలంగాణ చేపడుతున్న ఏఐ ఆధారిత మార్పు అత్యంత ప్రశంసనీయమని అన్నారు. తమ నెదర్లాండ్స్ ప్రధాన కార్యాలయాన్ని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సందర్శించాలని ఆయన ఈ సందర్భంగా ఆహ్వానించారు.

# నబిన్‌కు పట్టం

మొదటి పేజీ తరువాయి..

వామిక రీతిలో ఎన్నుకుంటారని ప్రధాని మోదీ అన్నారు. గత కొన్ని నెలలుగా, పార్టీలో అతి చిన్న యూనిట్ నుంచి జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే వరకూ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ బీజేపీ రాజ్యాంగంలోని ప్రతి అంశాన్ని, స్ఫూర్తిని మనసులో పెట్టుకొని కొనసాగుతోందని ప్రధానమంత్రి మోదీ అన్నారు. నేడు అంతిమంగా అది ముగిసిందని ఆయన అన్నారు. నబీన్‌ను కొనియాడుతూ, నూతన అధ్యక్షుడు పార్టీ వారసత్వాన్ని ముందుకు తీసుకువెడతాడని ప్రధాని అన్నారు.

రానున్న 25 సంవత్సరాలు చాలా ముఖ్యం. ఈ కాలంలోనే అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలి, అది జరిగి తీరుతుంది అన్నారు. ఈ కీలకమైన కాలంలో, మన నితిన్ నబీన్ జీ బీజేపీ వారసత్వాన్ని ముందుకు తీసుకువెడతారు. నేటి యువత భాషలో చెప్పాలంటే, నితిన్ జీ ఒక రకంగా మిల్లీనియల్ (1981–1996 మధ్యన పుట్టినవారు) అని ప్రధాని పేర్కొన్నారు.

# మీరు పెట్టిన అక్రమ కేసులు మర్చిపోయారా..?

హరీష్ రావుపై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఫైర్

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**


మాజీ మంత్రి హరీశ్ రావు.. తాను ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరైంది మర్చిపోయి పోరాటయోధుడిలా పోజులు ఇస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆరోపించారు. సిట్ విచారణకు హాజరై... ఏదో ఘనకార్యం చేసినట్టు భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారం ముసుగులో చేసిన అవినీతి, అక్రమ బండారం త్వరలోనే బయటపడుతుందన్నారు. మంగళవారం గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ పాలనలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వారి కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ చేయించి వారి వ్యక్తిగత సంభాషణ, పర్సనల్ విషయాలు విన్నారన్నారు. గత పాలనలో ఎంతోమంది ఫోన్లు ట్యాప్ చేశారని మీ ఇంటి ఆడబిడ్డ కవితనే చెప్పారని గుర్తు చేశారు. ఇంటి అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేశారంటే దానికి సమాధానం చెప్పలేదన్నారు. గత పదేళ్లలో ఎంతో మందిపై అక్రమ కేసులు పెట్టారన్నారు. మీ స్కాములు చూసే ప్రజలు ఓడించి ఇంటికి పంపిచారని అయిలయ్య మండిపడ్డారు. సీఎం రేవంత్ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు.


# మీ పలుకుడి ఉపయోగించండి

- మెట్రో రెండో దశను ఆమోదింపజేయండి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ లేఖ

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–II మంజూరు కోసం కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని పీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో జరిగిన సమావేశం మేరకు మెట్రో ఫేజ్–2 కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున చేయాల్సిన కార్యక్రమాలన్నీ చేపడుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–2 నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఇద్దరు అధికారులతో కూడిన ఒక సంయుక్త కమిటీలో చేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇద్దరు అధికారులను నామినేట్ చేసేందుకు వేచి చూస్తోందని కిషన్ రెడ్డి ఈ నెల 15న రాసిన లేఖలో పేర్కొన్న అంశాలను ఆయన ప్రస్తావించారు. దానికి సంబంధించిన వివరాలను సీఎం తన లేఖలో వివరించారు. కమిటీ కూర్పునకు సంబంధించిన వివరాలను ఇప్పటికే కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు తెలిపామన్నారు. మెట్రో రైల్ ఫేజ్ 2I మంజూరు కోసం నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉన్నామని చెప్పారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫేజ్ 2I ప్రాజెక్టును తన పలుకుబడిని ఉపయోగించి వీలైనంత తొందరగా ఆమోదింపజేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు.





# విచారణ, కమిషన్ల పేరుతో వేధింపులు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**



విచారణ, కమిషన్ల పేరుతో మా పార్టీ నేతలను వేధిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నా రు. రాజకీయ వేధింపుల్లో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్ రావుకు నోటీసులు ఇచ్చారన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు నోటీసులు ఇస్తారనే ప్రచారం జరుగుతుందని చెప్పిన ఆయన.. ఒకవేళ నోటీసులు ఇచ్చినా భయపడేది లేదన్నారు. ఏం చేస్తారో చేసుకోండని సవాల్ చేశారు. ఈ దేశంలో న్యాయం ఇంకా బతికే ఉందనీ తమకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు లొట్టపీసు కేసు అని దుయ్యబట్టారు. కాలం ఎప్పు డు ఒకే రకంగా ఉండదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఎమర్జెన్సీ అయితే మీరంతా ఇక్కడ ఉన్న వారా అంటూ ఓ అధికారి మాట్లాడుతున్నారని చెప్పారు. అలాంటి ఆలోచనతో ఉన్న అధికారులు తమ ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించారు. డైవర్షన్ పాలిటిక్స్ రేవంత్‌కి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. రేవంత్ బావమరిది సృజన్ రెడ్డికి కోల్ టెండర్లు దక్కేలా ప్రయత్నాలు జరిగాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ విషయాన్ని హరీశ్ రావు ఈ నెల 19న మాట్లాడగానే వెంటనే ఆయనకు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. సింగరేణిలో ఇంత జరుగుతుంటే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరగాలని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## దేవతల విగ్రహాల ఊరేగింపు

### ఊరేగిన రేణుక ఎల్లమ్మ, జములమ్మ, పరశురాముడు



**అలంపూర్, వుదయం ప్రతినిధి :** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీ కేంద్రంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ, జమ్ములమ్మ, పరశురాముడు విగ్రహాలను తొలి మంగళవారం పురస్కరించుకుని అమ్మవారి పుట్టినిల్లు నుండి అనగా నాగన్న గౌడ్ ఇంటి నుండి ఉదయం 8 గంటలకు భక్తులు దరూ ఎంతో భక్తిశ్రద్ధలతో చిన్నారుల ఆటపాటలతో అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం ఎంతో ఘనంగా ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు అమ్మవారి వేషధారణలో ఆటపాటతో ఎంతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగన్న గౌడ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మన్న, ఐజ పట్టణ పెద్దలు పాల్గొన్నారు.

## అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

### డీ ఆర్ డీ ఓ నరసింగరావు



**గద్వాల, వుదయం ప్రతినిధి :** జోగులాంబ గద్వాల జిల్లాలోని మహిళ రైతు ఉత్పత్తిదారుల కంపెనీలలో కాంట్రాక్టు పద్ధతిన పని చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని డీ ఆర్ డీ ఓ నరసింగరావు ఒక ప్రకటనలో తెలిపారు. బాల బ్రహ్మేశ్వర ఉమెన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ అలంపూర్ లో ముఖ్య కార్యనిర్వహణ అధికారి 01, అకౌంటెంట్ 01, జోగులాంబ ఉమెన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ, మల్దకల్ లో అకౌంటెంట్ 01 పోస్టుకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. ముఖ్య కార్యనిర్వహణ అధికారి పోస్టుకురూ. 15,000 జీతం చెల్లించబడనని, ఇందుకు బీఎస్సీ అగ్రికల్చర్/ మార్కెటింగ్ లేదా ఎంబీఏ మార్కెటింగ్, బి బి ఏ ఫైనాన్స్ ఒక విద్యా అర్హతలు ఉండాలన్నారు. అలాగే అకౌంటెంట్ పోస్ట్ కు రూ. 6,000/జీతం చెల్లించబడనని, బీకాం విద్యార్హత కలిగి ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 27వ తేదీ సాయంత్రం 5:00 గంటల లోపు జిల్లా కలెక్టర్ కార్యాలయములోని రూం నెంబర్ ఎఫ్29 లో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 8790990641, 8790990593 లకు సంరదించాలని తెలిపారు.

## అంబులెన్స్‌లోనే ప్రసవం

### డెలివరీ చేసిన 108 సిబ్బంది



**అలంపూర్ , వుదయం ప్రతినిధి :** జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం నసనూరు గ్రామానికి చెందిన మహేష్ భార్యకి పురిటినొప్పులు రావడంతో ఉదయం 4 గంటలకు 108 అంబులెన్స్ కి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్నవడ్డేపల్లి 108 అంబులెన్స్ సిబ్బంది, సకాలంలో స్పందించి గ్రామానికి చేరుకున్నారు. నసనూరు గ్రామానికి చేరుకున్నాక శిరీషకు రెండవ కాన్పు ప్రసవ వేదన చెందుతుంది. శిరీషను వెంటనే అంబులెన్స్ లోకి తీసుకొని వెళుతుండగా మార్గమధ్యంలో ఐజకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండగా శిరీషకు నొప్పులు ఎక్కువ కావడంతో, అంబులెన్సులో నవీన్ డెలివరీ చేయడం జరిగింది. పండంటి మగ పిల్లవానికి శిరీష జన్మనిచ్చింది. బాబు పుట్టి వెంటనే ఏడవడం జరిగింది. తల్లి, బిడ్డకి మెరుగైన వైద్యం కొరకు ఐజ ప్రాథమిక వైద్యశాలలో చేర్పించడం జరిగందని 108 సిబ్బంది నవీన్ కుమార్, కృష్ణ వర్మ తెలిపారు.

## జేఏసీ నేతల అరెస్టు



**ఊర్కొండ, వుదయం ప్రతినిధి :** ఈరోజు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఊరుకొండ పేట బ్రహ్మోత్సవాల ఉత్సవాలకు విచ్చేస్తున్న సందర్భంగా గత పది రోజులుగా రిలే నిరాహార దీక్ష చేపడుతున్న ఉరుకొండ మండల జేఏసీ నేతలను ఎమ్మెల్యే పర్యటన అడ్డుకునేందుకు ప్రయత్నించగా నేడు అర్ధరాత్రి అక్రమ నిర్బంధ చేసి అరెస్టు చేసి కల్వకుర్తి సర్కిల్ పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది. ఈ సందర్భంగా అర్ధరాత్రి అక్రమ అరెస్టులు చేయడమే ప్రభుత్వ యంత్రాంగం మరియు స్థానిక ఎమ్మెల్యే యొక్క దుర్మార్గపు చర్యను మేము తీవ్రంగా హెచ్చరిస్తున్నాం.

అరెస్టులను అడ్డుపెట్టుకొని ప్రజా స్వామ్యంలోనే ఉద్యమాలను ఉద్యమ నాయకులను ఆపే ఆసక్తి మీకు లేదని హెచ్చరిస్తున్నాం. అతి త్వరలో జడ్చర్లలో ఉన్న మీయొక్క ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కూడా ముట్టడించడానికి ఏమాత్రం వెనక్కి పొమ్మని సవాలు విసురుతున్న. అరెస్టులో జేఏసీ ఉద్యమ నాయకులు నిరంజన్ గౌడ్, శ్యామ్ సుందర్ రెడ్డి, చిన్న, దివాకర్ గౌడ్, అరవింద్ గౌడ్ ఉన్నారు.

## 23న సామూహిక అక్షరాభ్యాసము



**అలంపూర్, వుదయం ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం శ్రీ బీచుపల్లి క్షేత్రంలో గల శ్రీ కోదండ రామస్వామి దేవాలయం నందు శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో తేదీ23.01.2026 శుక్రవారం రోజు సామూహిక అక్షరాభ్యాసములో పాల్గొన్న చిన్నారులకు 1000/రూ అక్షరాల వెయ్యి రూపాయలు రుసుము చెల్లించవలెను. దేవస్థానం వారు పూజా సామాగ్రి అందజేయుదురు. ఇంటి నుండి పూజ సామాగ్రి తీసుకొచ్చిన వారికి 600/రూ ఆరువందల రూపాయలు టికెట్ చెల్లించవలెను. అలాగే దేవాలయంలోకి వచ్చిన భక్తులకు, అక్షరాభ్యాసమునకు వచ్చిన భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం వసతులు నిర్వహిస్తున్నట్లు దేవాలయం పాలక మండలి తెలియజేశారు.

## జూరాల బ్రిడ్జ్ పనుల పరిశీలన

### పరిశీలించిన మంత్రివర్యులు వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



**గద్వాల, వుదయం ప్రతినిధి :** గద్వాల నియోజకవర్గంలో గద్వాల మండల పరిధిలోని కొత్తపల్లి నుండి ఆత్మకూరు వైపుగా వెళ్లే జూరాల ప్రాజెక్టు హైలెవెల్ బ్రిడ్జ్ నిర్మాణం పనులను పరిశీలించడానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి కి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. జూరాల ప్రాజెక్ట్ హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం పనులను పరిశీలించి సంబంధిత అధికారులు కాంట్రాక్టర్ తో మాట్లాడటం త్వరగా పనులను పూర్తిచేసి ప్రజలకి అందుబాటులో తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర మంత్రివర్యులు వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గత సంవత్సరం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రివర్యులు జూరాల ప్రాజెక్టు సందర్శన పరిశీలనకు వచ్చిన సందర్భంలో ఈ ప్రాంత ప్రజలు గద్వాలకు ఆత్మకూరుకు అనుసంధానంగా జూరాల హై లెవెల్ బ్రిడ్జ్ నిర్మాణం ఏర్పాటు చేయాలన్నారు. వెంటనే మంత్రి దీని ఆమోదం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రాంతాలకు మధ్య అనుసంధానం ఉండడం వల్ల ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే రవాణా వ్యవస్థ దాని వల్ల ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పిన వెంటనే ఆర్థిక శాఖ మంత్రివర్యులు 121 కోట్లు రూపాయలు మంజూరు చేయడం జరిగింది. వెంటనే సీఎం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించడం చాలా సంతోషం అని హర్షం వ్యక్తం చేశారు. ఆత్మకూరు నుండి గద్వాలకు వెళ్లాలనుకుంటే పదినిమిషాల్లో గద్వాల్ లో చేరుకుంటారు. అదేవిధంగా గద్వాల నుండి హైదరాబాదు వెళ్లే వారికి 35 కిలోమీటర్ వరకు రవాణా సౌకర్యం తగ్గుతుందని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం తరుణంలోనే ఫోర్ లైన్ ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణం చేయాలని ఆలోచించడం జరిగింది. ఈ ఫోర్ లైన్ నిర్మాణం చేయడం వల్ల గద్వాల నుండి ఆత్మకూర్ మక్తల్, మంత్రాలయం, బళ్లారి వరకు వెళ్లడానికి సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణం కావడం వల్ల మేమున్న లేకపోయినా మా హయాంలో బ్రిడ్జీ నిర్మాణం కావడం జరిగిందని చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ప్రాజెక్టులో నీళ్లు నిలువ ఉంచడానికి చెక్ డాంలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. దీనికి నెమలి చెరువు నామకరణం చేయడం జరుగుతుందని తెలిపారు. జూరాల ప్రాజెక్టు హైలెవెల్ బ్రిడ్జ్ నిర్మాణం ఉమ్మడి పాలమూరు జిల్లాతోపాటు తెలంగాణ రాష్ట్రం కూడా అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుంది. గద్వాల ఆత్మకూర్ ప్రాంతం మన సౌకర్యంతో పెరగడం వల్ల వ్యాపారంలో కూడా పెరుగుతాయి. రైతులు కూడా అభివృద్ధి చెందుతారు. దీని వల్ల నియోజక వర్గాల్లో అభివృద్ధి చెందడంతో పాటు భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా మా ప్రాంత ప్రజలను తరఫున సీఎంకి, ఆర్థికశాఖ మంత్రివర్యులుకి, నీటి పారుదల శాఖ మంత్రి వర్యులుకి ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు.


ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల ప్రాంతం అభివృద్ధి చెందాలంటే గద్వాలకు అనుసంధానంగా ఆత్మకూరు, మక్తల్ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే ఈ రెండు ప్రాంతాలకు అనుసంధాలు ఉన్నప్పుడే మా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. మా ప్రాంతంలో కృష్ణానది ఒడ్డున ఉండడం వల్ల ఆ ప్రాంతాలు ఎలాంటి అభివృద్ధి చెందలేదు. కాబట్టి ఇప్పుడు మంత్రి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఈ జూరాల ప్రాజెక్ట్ హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేయడం వల్ల ఈ రెండు ప్రాంతాలకు అనుసంధానం ఏర్పడుతుంది. దీనివల్ల హైదరాబాద్ వంటి ఇతర ప్రాంతాలకు ఏ విధంగా అనుసంధానం ఉంటుందా ఆ ప్రాంతాలు ఏ విధంగా భవిష్యత్తులో మా ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుంది అని పేర్కొన్నారు. ఈ నిర్మాణం పనుల్లో భాగంగా ఫోర్ లైన్స్ రోడ్డు అనుసంధానతో ఏర్పాటు చేయడం వల్ల గద్వాల నుండి మంత్రాలయం, మంత్రాలయం నుండి బళ్లారి వరకు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాలకు అనుసంధానం ఏర్పాటు వల్ల ఈ ప్రాంతాలలోని ప్రజలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుంది. గద్వాల నుండి హైదరాబాద్ కు వెళ్లడానికి వారికి కూడా ఆత్మకూరు వైపుగా వెళితే దాదాపుగా 35 కిలోమీటర్లు దూరం తగ్గుతుంది. పది నిమిషాలలో ఆత్మకూరుకు చేరుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అదే విధంగా జూరాల ప్రాజెక్టులు లోయర్ జూరాల దగ్గరగా ఉండడంతో ఈ ప్రాంతపు చెక్ డ్యామ్ ఏర్పాటు చేస్తే 4&5 టీఎంసీల నీళ్లు నిలువ ఉంచడం వల్ల రైతులకు నీళ్లు ఉపయోగపడితే దీనివల్ల రైతులు కూడా అభివృద్ధి చెందడం జరుగుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి, సర్పంచ్ సుజాత నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ



**అందోల్ , వుదయం ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా జోగిపేట్ శ్రీరామ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆందోల్ జోగిపేట పట్టణ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను మంత్రి దామోదర్ రాజనర్సింహ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలోజోగిపేట-ఆందోల్ ప్రాంతానికి చెందిన 327 మహిళా సంఘాలు, సుమారు 3,400 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళా సంఘాలకు స్వంత భవనాలు, సమావేశాల కోసం అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు జోగిపేట, ఆందోల్ ప్రాంతాల్లో మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి రూ.4 కోట్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో మహిళా సంఘాల పాత్ర కీలకమని మంత్రి పేర్కొన్నారు. మహిళా సంఘాలకు దారి చూపించిన మహానేత డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మహిళా స్వయం సహాయక సంఘాల ఉద్యమానికి బీజం వేశారని గుర్తు చేశారు. ఆయన హయాంలో మండల సమాఖ్యలకు రూ.50 లక్షల నిధులు, పావలా వడ్డీ రుణాల పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. రుణాలు సమయానికి చెల్లించే సంస్కృతిని ఆయననే తీసుకొచ్చారని అన్నారు. అనంతరం 2013లో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి వడ్డీ లేని రుణాల పథకాన్ని కొనసాగించగా, 2023లో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ వడ్డీ లేని రుణాల పంపిణీ ప్రారంభించిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాలపై వడ్డీ భారాన్ని ప్రభుత్వం భరిస్తోందని, దాదాపు రూ.40 వేల కోట్ల రుణాలకు సంబంధించి రూ.74.26 లక్షల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశారు. అందోలు, ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటైతే స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలనే ఉద్దేశంతో ఆందోల్‌లో ఐదు ఎకరాల భూమిని ప్లాట్లుగా విభజించి పంపిణీ చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెప్పారు. అలాగే మహిళలకు నాణ్యతతో కూడిన చీరల పంపిణీ, సన్నబియ్యం సరఫరా, ఆర్టీసీ బస్సుల సౌకర్యాల మెరుగుదల వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పాండు, పిడి మెప్మా ఎస్ బి రామాచారి, జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, అగ్రికల్చరల్ ఏ డి ఏ రమాదేవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి ఫారుకు డిఎల్ఎఫ్ ప్రెసిడెంట్ ఆసియా సుల్తానా మున్సిపల్ కమిషనర్ రవీందర్, ప్రజా ప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు ఎస్ఎస్సి గ్రూప్ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## యోగ మెడిటేషన్ తప్పనిసరి



**అందోల్, వుదయం ప్రతినిధి:** మెదక్ జిల్లా అల్లాదుర్గం లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం హార్ట్ ఫుల్ నెస్ యోగ మెడిటేషన్ అవగాహన కార్యక్రమాన్ని కన్హ శాంతి వనం హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ట్రైనర్ నవీన్ కుమార్ సూచనలు సలహాలు అందించటం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున మానసిక ప్రశాంతత కొరకు యోగ మెడిటేషన్ ప్రతిరోజు ప్రాక్టీస్ చేసుకుంటూ చదువుకోవాలని సూచించారు. యోగా మెడిటేషన్ ఏకాగ్రతకు మానసిక ప్రశాంతతకు పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ యూ. తుకారం స్టూడెంట్స్ కౌన్సిలర్ సి నరసింహారెడ్డి అధ్యాపకులు శ్యామ్ రావు రవీందర్ శివకుమార్ దత్తు శంకర్ రవికుమార్ స్రవంతి ప్రవీణ్ కుమార్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

- పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య ను అందించడమే లక్ష్యం
- రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు చారగొండ వెంకటేష్



**వెల్దండ , వు దయం ప్రతినిధి:** రాష్ట్రంలో విద్యా వ్యవస్థ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమూల మార్పులు చేపట్టడానికి శ్రీకారం చుట్టారని ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని అన్నారు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు పాఠశాల లో నెలకొన్న సమస్యలను లెక్చరర్లు, విద్యార్థుల ను అడిగి తెలుసుకున్నారు జూనియర్ కళాశాల లో , మరియు హాస్టల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలో విద్యార్థుల సంఖ్య శాతాన్ని పెంచాలని రాబోయే రోజుల్లో ప్రైవేటుకు దీటుగా తెలంగాణ పబ్లిక్ స్కూలు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచనలు సలహాలు అందజేశారు ప్రిన్సిపల్,, లెక్చరర్లు విద్యార్థులు పాల్గొన్నారు


## నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

### బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆంజనేయ ఆలయం









**గద్వాల , వుదయం ప్రతినిధి :** భక్తుల కోరికలు, చింతలు తీర్చే కొంగు బంగారమైన ధరూర్ మండలంలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలకు తెలంగాణ వాసు లేకాక ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకుంటారు. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆలయ ధర్మకర్త సి.గిరి రావు, ఆలయ ఈఓ కవిత, ప్రధాన అర్చకులు భీంసేనా చారీ జోషి ఆధ్వర్యంలో అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**బ్రహ్మోత్సవాల వివరాలు**

స్వస్తిశ్రీ శాలివాహన శక 1945 శోభకృత్ నామ సం॥ర మాఘ శుద్ధ తదియలు మొదలు శుద్ధ దశమి వరకు శ్రీ అంజనేయ స్వామి వారి బ్రహ్మోత్సవములు 21నుండి జనవరి 28 తేది వరకు కొనసాగుతాయని దేవాలయ వ్యవస్థాపక వంశీయులు గిరి రావు, ఈఓ సి.కవిత తెలిపారు. 21న స్వామి వారి అంకురార్పణ ధ్వజారోహణం. 22న స్వామి వారి ఉపనయనం, తెప్పోత్సవం, పల్లకి సేవ, ప్రబొత్సవం, 23న శుక్రవారం రాత్రి 10 గంటలకు రథోత్సవం, 24న ప్రబోత్సవం, 25న అవభృత స్నానం, 26న బీష్మాష్టమి, 27న మధ్వనవమి, బుధవారం స్వామి వారి పల్లకి సేవ స్వస్తి వాచకం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

## ఊర్కొండ క్షేత్రం రాష్ట్రంలోనే ప్రసిద్ధి

### రథోత్సవంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రత్యేక పూజలు



**ఊర్కొండ, వుదయం ప్రతినిధి :** నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం. నేడు ఊర్కొండ పేటలోని శ్రీ శ్రీ శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు ఘనంగా నిర్వహించిన రథోత్సవ కార్యక్రమంలో జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి గారు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం రథోత్సవాన్ని దర్శించి, భక్తులతో కలిసి స్వామివారి నామస్మరణ చేశారు. శాసనసభ్యులు మాట్లాడుతూ, ఊర్కొండ క్షేత్రం రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక కేంద్రమని, ఇక్కడి సంప్రదాయాలు, ఉత్సవాలు తరతరాలుగా ప్రజల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి సహాయం

### ఎస్‌బిఐ చైర్మెన్ చల్లా శ్రీనివాస సెట్టి




**అలంపూర్ , వుదయం ప్రతినిధి:** అలంపూర్ నియోజక వర్గం మానవపాడు మండలం చెన్నిపాడు, పోతులపాడు గ్రామ వాసి ఎస్ బి ఐ చైర్మన్ చల్ల శ్రీనివాస్ శెట్టి, ఫౌండేషన్, భవిష్య భారత్, గ్రామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి స్వగ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కొరకు ప్రత్యేక ఫండ్ ద్వారా అభివృధి పనులను చేయించడం జరిగింది. ఈ సందర్భంగా చల్ల శ్రీనివాస్ శెట్టి చిన్న పోతులపాడు, పెద్ద పోతులపాడు, చెన్నిపాడు, గోకులపాడు, బొంకూరు గ్రామాలని దత్తత తీసుకుని అభివృద్ధి చేయడం జరిగింది. అందులో భాగంగాపోతులపాడు లో ఉచిత ఆర్మీ కోచింగ్ సెంటర్, స్టడీ హాల్, స్మార్ట్ క్లాస్ రూమ్, డైనింగ్ హాల్ రిపేర్, విద్యార్థులకు ఉచిత సైకిళ్లు, వాటర్ ప్లాంట్ లాంటి వసతులు అందించడం జరిగింది. కార్యక్రమానికి నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవితో పాటు ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్, అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ దొడ్డప్ప, వైస్ చైర్మెన్ కుమార్, గ్రంథాలయ చైర్మెన్ నీలి శ్రీనివాస్, బ్యాంకు ఉన్నతాధికారులు, ఫౌండేషన్ సభ్యులు, మండల అధ్యక్షులు జగన్ మోహన్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ఉచితం ఉపకరణాల దరఖాస్తులు ఆహ్వానం

### జిల్లా కలెక్టర్ బీ.యం సంతోష్



**గద్వాల , వుదయం ప్రతినిధి :** జిల్లాలోని దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంసిఆర్ చప్పల్స్, స్మార్ట్ కేన్స్, వాకింగ్ స్టిక్స్, క్రచెస్, హియరింగ్ ఎయిడ్‌లు, వీల్ చైర్లు, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్స్, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్స్ కోసం రూ.100 బాండ్ పేపర్‌పై నిరుద్యోగ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులు ఈ నెల 20వ తేదీ నుండి 30వ తేదీ వరకు https:///obmms. cgg.gov.in వెబ్ సైట్‌లో అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అప్లికేషన్ ఫామ్, సదరం సర్టిఫికేట్, ఆధార్ కార్డు, విద్యా ధ్రువీకరణ పత్రాలు, ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్ కార్డు తదితర పత్రాలను జోగులాంబ గద్వాల జిల్లాలోని ఐడీఓసీ కలెక్టరేట్‌లో ఉన్న మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, రూమ్ నంబర్ జి33లో జనవరి 31లోపు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం 7799866325 నంబర్‌ను సంప్రదించాలని అన్నారు.

## స్వయం ఉపాధి కల్పించుకొని యువత ఎదగాలి

### సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్



**వెల్దండ , వు దయం ప్రతినిధి :** యువత స్వయం ఉపాధి కల్పించుకొని ఆర్థికంగా ఎదగాలని సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ పేర్కొన్నారు మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాహుల్ కు చెందిన ఐరా హోటల్ ను ఆయన ప్రారంభించారు సందర్భంగా హోటల్ యజమాని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో కుందారం తండా సర్పంచ్ గన్యా నాయక్ ,గాన్గట్ తండా సర్పంచ్ లచ్చిరామ్ నాయక్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొయ్యల పుల్లయ్య తిరుపతి రెడ్డి మట్ట భరత్ గౌడ్ రావత్ పకిరా నాయక్ మూడవత్ రవి నాయక్ కొర్ర రవి నాయక్, కేతావత్ రమేష్ నాయక్, కేతావత్ సూర్య కుమార్, కొర్ర వినోద్ తదితరులు పాల్గొన్నారు.




"ఢిల్లీ అల్లర్ల కేసు (2020)లో అసలు సమస్య ఉమర్ ఖలీద్ గాని, షర్జీల్ ఇమామ్‌గాని కాదు, పేర్లను ప్రధానంగా చూపడం వల్ల దాని వెనుకగల ఒక ధోరణి కనుమరుగవుతున్నది. రాజ్యం అధికారాన్ని దుర్వినియోగం చేయడం, అందుకోసం క్రిమినల్ చట్టాన్ని ఆయుధంగా ఉపయోగించడం అనేది ముఖ్యం. ఇటువంటి చాలా కేసులున్నాయి. కశ్మీర్‌లో చాలామంది జర్నలిస్టులు, మానవ హక్కుల ఉద్యమకారులు జైళ్లలో మగ్గుతున్నారు. అసమ్మతిని అణిచివేయడానికి ఉగ్రవాద నిరోధక చట్టాలను ప్రయోగించడం ఒక్క ఢిల్లీ అల్లర్ల కేసులకే పరిమితం కాలేదు."

బృందా గ్రోవర్, సీనియర్ అడ్వకేట్

## వేమన పద్యం

విద్యలేనివాడు విద్వాంసుచేరువ
నుండగానే పండితుండుగాడు
కొలనిహంసలగకడ కొక్కెరలున్నట్లు
విశ్వదాభిరామ! వినురవేమ!



## సంపాదకీయం

# నితిన్ నబీన్ కర్తవ్యం

కేంద్రంలో, 20 రాష్ట్రాల్లో అధికారంలో కొనసాగుతున్న ఎన్ డి ఎ అధినేత బి జె పి ఎంతటి ప్రాధాన్యం గల పార్టీయో చెప్పవలసిన పనిలేదు. మొత్తం దేశాన్ని ఆ పార్టీ తన గుప్పెట్లో పెట్టుకొని అసాధారణమైన ఎదురులేని తనాన్ని అనుభవిస్తున్నది. ఈ దశలో ఆ పార్టీ సారధ్య బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్‌ను అభినందించాలి. పార్టీ కంటే పిన్న వయసుకుడిని పార్టీ అధ్యక్ష పదవి వరించించడం విశేషం. బీహార్ కు చెందిన నబీన్ ఈ పదవిని చేపట్టిన సమయం ప్రత్యేకంగా గమనించదగి నది. ప్రతిపక్ష అర్ జె డి, కాంగ్రెస్ కూటమి ఘనవిజయం సాధించి, బిజెపి, దాని మిత్ర పక్షాలు ఘోర పరాజయం పాలు కావడం ఖాయం అనుకొన్న ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలను తారు మారు చేసి బిజెపి, జె డి యు కూటమి తిరిగి దిగ్విజయం సాధించింది. అంతే కాదు ఏకు మేకయినట్టు తమకు కంటక ప్రాయంగా ఉన్న అర్ జె డి ని ఘోర పరాజయం పాలు చేయగలిగారు. ఈ నేపథ్యంలో నబీన్ ను బిజెపి అధ్యక్షుడు ని చేయడం సముచితంగా ఉంది. అయితే బి జె పి అధ్యక్ష స్థానంలోనివారు ఆ పార్టీ నడకను నడతను ప్రభావితం చేయగలిగేది బహు స్వల్పమేనని చెప్పక తప్పదు. పీఠం పెద్దదేగాని పని పరిమితమైనదే అనే అభిప్రాయం ఉన్నది. ఎందు కంటే ఆ పార్టీ రిమోట్ కంట్రోల్ దాని సైద్ధాంతిక గురువు, చోదకురాలు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (అర్ ఎస్ ఎస్ ) చేతిలో ఉంటుందన్నది జగమెరిగిన సత్యం. అమిత్ షా తర్వాత పార్టీ పగ్గాలు నడ్డా చేతికి మారడానికి చాలా కాలం పట్టింది. ఆయన అధ్యక్ష పదవిలో మెరుపులు కూడా లేవు. బలవంతులైన ప్రధాని మోడీ, హోమ్ మంత్రి అమిత్ షా ఉండగా పార్టీలో గాని ప్రభుత్వంలో గాని చక్రం తిప్పడానికి మరొకరికి ఇంక చోటెక్కడ ఉంటుంది? అయితే దేశాన్ని పరిపాలిస్తున్న పార్టీ అధ్యక్షుడుగా నితిన్ నబీన్ దాని చుక్కానిని సరైన దిశకు తిప్పడంలో కొంచెమైనా పాత్ర పోషించే అవకాశం ఉండక పోదు. తాను మత దృష్టి గల పార్టీ కాబట్టి డెబ్బయ్ ఏళ్లకు మించి ప్రజాస్వామ్య దారిలో నడుస్తున్న, సోషలిస్టు, సెక్యులర్ దేశ మనుగడకు నాయకత్వం వహించడం బిజెపికి అనుకొన్నంత సులభం కాదు. ఇప్పటికే కార్పొరేట్ శక్తులను సంతృప్తి పరచడానికి ప్రజాస్వామిక విధి విధానాలను బలి ఇవ్వడం, అదే పనిగా ప్రైవేట్ దారి పట్టడం, ప్రభుత్వం లో ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయక పోవడం, ప్రశ్నించే వారి నోరును బలప్రయోగంతో మూయించడం వంటివి యధేచ్ఛగా సాగుతున్నాయనే విమర్శ గట్టిగా వినిపిస్తున్నది. ఎన్ని పదవీ కాలాలు నిరంతరాయంగా పాలిస్తున్నారనేది కాదు, అన్ని వర్గాలకు సమాన అవకాశలను, గుర్తింపును హామీ ఇస్తున్న రాజ్యాంగ పాలనను ప్రజలకు ఏ మేరకు అందిస్తున్నారనేది కీలకమైన అంశం. బిజెపి ఈ వైపుగా ఆత్మ విమర్శ చేసుకునేలా చేయగల శక్తి నితిన్ నబీన్ కి లేదని అనుకోలేము. భిన్న మతవర్గాలున్న దేశంలో వారి మధ్య శాంతియుత సహజీవనాన్ని పెంపొందించడం కంటే మించిన మహదాశయం పాలకులకు ఉండకూడదు. అభివృద్ధి కృషిలో ముందుండవలసిన యువత మతతత్వంతో ఉగిపోయేలా చేయడం, విజ్ఞాన వీచికలు వీయకుండా అడ్డుకోవడం దేశానికి చెప్పనలవికాని కీడు చేస్తున్నది.

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## మహా జాతర మన మేడారం



పచ్చని అడవిలో కొలువైన సమ్మక్క సారక్క
కుంకుమ బరిణే లో గద్దెకు పయనం
కోయ పూజారులతో కొలువైన చిలకలగుట్ట
తల్లికి తడి బట్టలతో తానాలతో పూనకాలు!!

ధరణిలో సమ్మక్క సారక్కలు
కంక వనంలో సమ్మక్క సారక్క
మమ్ముకాపాడే సమ్మక్క సారక్క
కోయ ప్రాంతమందు సమ్మక్క సారక్క!!

సమ్మక్క సారక్క వీర వనితలు
త్యాగాల సిరులు సమ్మక్క సారక్క
కుంకుమ భరణిలో సమ్మక్క సారక్క పూజలు
సమ్మక్క సారక్క దీవెనలతో కొంగుబంగారం!!

తల్లికి నిలువెత్తు బంగారు బెల్లంతో భక్తుల మొక్కులు
అంబరమంటే సంబురం మన మేడారం
కోరిన కోరికలు తీర్చే సమ్మక్క సారక్కలు
భారతదేశం లో జరిగే అతి పెద్ద జాతరమేడారం!!

వన జాతర మన జాతర మేడారం
పచ్చని అడవిలో పవిత్ర జాతర మేడారం
బంగారం పెట్టి బాగుండాలని కోరే భక్తులు
నలుమూలల నుండి తరలివచ్చే భక్తులు
మహిమలున్న దేవతా మూర్తి సమ్మక్క
ములుగులో మూడు రోజుల పండుగ మన మేడారం జాతర!!



దేవులపల్లి రమేశ్
9963701294

# చమురు సంక్షోభంలో భారత్

ప్రపంచ వ్యవహారాల్లో చమురు ఎంత ప్రముఖ స్థానం వహిస్తుందో, దానితో సాగే ధరల ఒడుదుడుకులు రాజకీయాలపై చూపే ప్రభావాన్ని చూస్తే స్పష్టమవుతుంది. బ్రూనై, కతార్, అజర్బైజాన్ వంటి చిన్న దేశాలు కూడా తమ భూగర్భంలో దాచి ఉంచిన ఈ నల్లసంపద వల్ల ప్రపంచంలో గుర్తింపును పొందాయి. కానీ ఈ సంపద వారికి నిజమైన స్థిరత్వాన్ని ,శాంతిని కల్పించిందా అనేది ఓ పెద్ద ప్రశ్నగా మిగిలింది. మరోకవైపు, భారతదేశం వంటి వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు, చమురు అనేది అత్యవసరమైనది. కానీ ఎక్కువ శాతం దిగుమతి పైనే ఆధారం. ఈ ఇంధన కొరత మన ఆర్థిక విధాన రూపకర్తల ముందు నిరంతరం ఒక సవాలుగా నిలుస్తుంది. భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలో మూడవ అతిపెద్ద చమురు వినియోగదారు. ప్రతి రోజూ దాదాపుగా 50 లక్షల బ్యారెళ్లకు పైగా దిగుమతి అవసరం ఉంటుంది. ఇది మన మొత్తం వినియోగంలో 80 శాతం కంటే ఎక్కువ. మన ఆర్థిక వ్యవస్థ పెరుగుదల, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ మరియు రవాణా వ్యవస్థ విస్తరణకు అనుగుణంగా ఈ డిమాండ్ మరింత పెరగనున్నది. ఈ పరిస్థితి మన ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుంది. అంతర్జాతీయ చమురు ధరల హెచ్చుతగ్గులకు అనుగుణంగా... చాలా సున్నితంగా మన దేశం కూడా విధిగా నడుచుకోవాలి. ప్రతి డాలర్ ధర పెరుగుదల లేదా తగ్గుదల మన వాణిజ్య లోటు, రూపాయి విలువ మరియు ద్రవ్యోల్బణంపై నేరుగా ప్రభావాన్ని చూపుతుంది. 2026 ప్రారంభంలో, అంతర్జాతీయ చమురు మార్కెట్ మార్పుల సంకేతాలు కనిపిస్తున్నాయి. వెనిజులాలలోని రాజకీయ మార్పు, ఇరాన్ మరియు రష్యాలపై పరిమితులు సడలడం వంటి అంశాలు చమురు సరఫరాను పెంచి, ధరలను ఒత్తిడికి లోను చేయగలవు. కొందరు విశ్లేషకులు బ్యారెలుకు 55 డాలర్ల స్థాయికి ధరలు క్రిందకు పడిపోతాయాని అంచనా వేస్తున్నారు. అలా నిజంగా జరిగితే భారతదేశానికి ఒక పెద్ద ఆర్థిక ఊరటగా ఉంటుంది. ప్రస్తుతం మన దేశం ఒక బ్యారెలుకు, సుమారు 70 డాలర్లు చెల్లిస్తుంది. నిజంగా ఆయిల్ ధరలు కుప్పకూలినప్పుడు, ప్రతి బ్యారెలుకు కేవలం ఒక డాలర్ ధర తగ్గినా, రోజుకు 50 లక్షల బ్యారెళ్ల దిగుమతి భారం తగ్గుతుంది. సంవత్సరానికి లక్షల కోట్లు ఆదా అవుతాయి. ఈ పొదుపు స్థూల ఆర్థిక స్థిరత్వానికి, అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి, ద్రవ్యోల్బణ నియంత్రణకు దోహదపడుతుంది. కానీ, ఈ హఠాత్తు అవకాశాన్ని మనం శాశ్వతమైన పరిష్కారంగా భావించకూడదు. చమురు మార్కెట్లు ఎప్పుడూ అస్థిరంగానే ఉంటాయి. అలాగే అంతర్జాతీయ రాజకీయ ఉద్రుతాలతో మార్పు చెందుతూ ఉంటాయి. ఇటీవలి చరిత్ర చూస్తే, 2014లో బ్యారెలుకు 140 డాలర్లు నుండి 2016లో 30 డాలర్లకు కిందకు పడిపోయాయి, మనం సంతోషం పడే లోపే మళ్లీ ఒక్కసారిగా 100 డాలర్ల పైకి ఎగసిపడిన అనుభవాలు మనకు ఉన్నాయి. అందువల్ల, తాత్కాలిక ధరల తగ్గుదలను స్వాగతించనా, మనకంటూ ఒక దీర్ఘకాలిక వ్యూహం అవసరం. మన ఆధారపాటును తగ్గించడంపై దృష్టి పెట్టాలి. ఇక్కడే చమురు సంపద యొక్క విరుద్ధార్థం మనకు ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్పుతుంది. మధ్యప్రాచ్యం, వెనిజులా లేదా రష్యా వంటి దేశాల చరిత్రలను చూస్తే, ఈ "నల్లబంగారం" తరచూ రాజకీయ అస్థిరత, విలాసవంతమైన వ్యయం మరియు అంతర్జాతీయ వివాదాలకు దారి తీసింది. సంపద నిర్వహణలో సృజనాత్మకత, సమగ్ర సూత్రదృష్టి లేకపోవడం ఈ దేశాలను "చమురు శాపానికి" గురి చేసింది. భారత దేశం చమురు సంపదలో దరిద్రంగా ఉండటం, ఒక విధంగా, ఈ రకమైన రాజకీయ-ఆర్థిక చిక్కుల నుండి తప్పించుకున్నందుకు అదృష్టంగా కూడా భావించవచ్చు. ఇది మనల్ని వివేకం మరియు ఇనోవేషన్తో ఆర్థిక వ్యవస్థను నిర్మించే బాధ్యత వహించేలా చేసింది.



*2026 ప్రారంభంలో, అంతర్జాతీయ చమురు మార్కెట్ మార్పుల సంకేతాలు కనిపిస్తున్నాయి. వెనిజులాలలోని రాజకీయ మార్పు, ఇరాన్ మరియు రష్యాలపై పరిమితులు సడలడం వంటి అంశాలు చమురు సరఫరాను పెంచి, ధరలను ఒత్తిడికి లోను చేయగలవు. కొందరు విశ్లేషకులు బ్యారెలుకు 55 డాలర్ల స్థాయికి ధరలు క్రిందకు పడిపోతాయాని అంచనా వేస్తున్నారు. అలా నిజంగా జరిగితే భారతదేశానికి ఒక పెద్ద ఆర్థిక ఊరటగా ఉంటుంది. ప్రస్తుతం మన దేశం*

అందువల్ల, భారతదేశం యొక్క ప్రాథమిక లక్ష్యం చమురు ధరలలో తాత్కాలిక హెచ్చుతగ్గుల నుండి లాభం పొందడం మాత్రమే కాక, పునరుత్పాదక ఇంధన వనరుల వైపు వేగవంతమైన మార్పుకు ప్రాధాన్యత ఇవ్వడం కూడా అయి ఉండాలి. చైనా సౌర మరియు జలవిద్యుత్ శక్తి వైపు వేగంగా ముందుకు సాగడం గమనించదగ్గ అంశం. భారతదేశం సోలార్ మిషన్ వంటి చొరవలతో ఈ దిశలో పయనిస్తోంది, కానీ దీనికి మరింత వేగం మరియు వ్యూహాత్మక నిశ్చయం అవసరం ఉంది. చివరిగా, 2026లో చమురు ధరలు తగ్గే అవకాశం భారత ఆర్థిక వ్యవస్థకు ఒక అవసరమైన ఊపు నివ్వగలదు. ఈ పరిస్థితిని మనం ఒక వరంగా భావించి, మన ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవడానికి ఉపయోగించుకోవాలి.

అధిక దిగుమతి ఖర్చు వల్ల కలిగే ఆర్థిక భారాన్ని తగ్గించిన ఈ సమయంలో, సంచిత పొదుపును పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల పెట్టుబడి, విద్యుత్ వాహనాల ప్రోత్సాహం మరియు శక్తి సామర్థ్యత పెంపుదల వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలి. భవిష్యత్తు యొక్క స్థిరమైన మరియు స్వావలంబన ఆర్థిక వ్యవస్థను నిర్మించే దిశగా ఈ అవకాశాన్ని మార్చుకోవడంలోనే మన నిజమైన విజయం నిలుస్తుంది. చమురు శాపం నుండి బయటపడి, సౌరశక్తి వంటి నిర్మలమైన శక్తి వైపు మారడమే ఈ శతాబ్దపు అతిపెద్ద సవాలు మరియు అవకాశం కూడా.




డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496





# నినాదమై నిలిచిన పత్రిక

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అనేక మైలురాళ్లున్నాయి. ప్రతి మైలు రాయికి ఒక చరిత్ర ఉన్నది. ఇప్పుడు గమ్యాన్ని చేరుకున్న తర్వాతైన నడిచొచ్చిన దారిని యాద్జేసుకోవాలి. చరిత్రలో రికార్డు చేసుకోవాలి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం 1969లో ఉవ్వెత్తున లేచిన ఉద్యమం రాజకీయ నాయకుల ద్రోహం వల్ల విఫలమయింది. ఆంధ్రా పాలనలో తుపాకీ తూటాలకు ఆనాడు 369 మంది అమరులయ్యింద్రు. అయినా తెలంగాణ కల సాకారం కాలేదు. ఇట్లా విఫలమయిన దశలో, ముల్కీ నిబంధనలు రద్దు చేయడంతో తెలంగాణలో ప్రజలు మరొక్కసారి ఉద్యమబాటన పట్టింద్రు. ఆ దశలో ముచ్చర్ల సత్యనారాయణ 'జై తెలంగాణ' అనే పత్రికను స్థాపించి ఉద్యమానికి చేయూత నిచ్చాడు. నిజానికి ఆయన అసలు ఇంటిపేరు 'సంగంరెడ్డి'. అయితే తాను మొదటిసారిగా 1950వ దశకంలో వరంగల్ పక్కనున్న 'ముచ్చర్ల' నుంచి సర్పంచ్‌గా ఎన్నిక కావడంతో ఆనాటి నుంచి ఆయన 'ముచ్చర్ల సత్యనారాయణ'గా ప్రసిద్ధి. ఆయన తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ఆ పత్రికలో ప్రచురించి ప్రచారం చేసిండు. తద్వారా ఆంధ్రా ప్రభుత్వం కొంత జాగరూకతతో మెలిగింది. తెలంగాణ ప్రజలను చైతన్యవంతుల్ని చేసిండు. ఉద్యమాలకు సన్నద్ధం చేసిండు. 1972 డిసెంబర్‌లో హైదరాబాద్ కేంద్రంగా 'జై తెలంగాణ' వార పత్రిక ప్రారంభమయింది. దాదాపు రెండేండ్ల పాటు నడిచింది. పదునైన సంపాదకీయాల ద్వారా ప్రభుత్వాలను గడగడలాడించాడు సత్యనారాయణ. 1952 నాటి 'గైర్ ముల్కీ గోబ్యాక్' ఉద్యమం మొదలు 2014లో సాకారమైన తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వరకు పోరుబాట నడిచిన యోధుడు ముచ్చర్ల. ఎన్టీ రామారావు ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ముచ్చర్ల ముక్కుసూటి మనిషి. అందుకే ఎన్టీ రామారావు ఆధిపత్యకులానుకూల రాజకీయాల్ని తప్పుపట్టి నిలదీసిండు. 1972లో తెలంగాణ వాదులందరినీ ఒక్క తాటి మీదికి తీసుకొచ్చేందుకు ఉద్యమ స్థాయిలో ముచ్చర్ల కృషి చేసిండు. అందులో భాగంగా వివిధ ప్రభుత్వ ఉద్యోగ సంఘాలను ప్రోత్సహించాడు. ఆయా సంఘాల తెలంగాణ బాధ్యులతో పత్రికలో కథనాలు రాయించి, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాల్ని వెలుగులోకి తెచ్చిండు. పత్రిక పబ్లిషర్, ప్రింటర్, సంపాదకుడిగా సత్యనారాయణే ఉన్నాడు. పత్రిక నిర్వహణలో దేవులపల్లి ప్రభాకర రావు ఆయనకు తోడ్పడ్డాడు. అయితే జిల్లాల్లో ఎక్కువ ప్రాచుర్యం ఉన్న పత్రికను ప్యాకింగ్ చేయించడం మొదలు తానె దగ్గరుండి చూసుకునేవాడు. పేరుకే సంపాదకులు. ఆర్థిక వనరులు అన్నీ ఆయనే సమకూర్చుకునేవాడు. జై తెలంగాణ' పత్రికలో కాళోజి, నెకోరా (నెల్లుట్ల కోదండరామారావు?), చెరుకు సత్యనారాయణరెడ్డి, ఎస్.కె.అశోక్‌కుమార్, మోహన్, జి.వినోద్, యం.రాజేంద్రప్రసాద్, కె.ప్రభాకర్ తదితరుల



(జనవరి 21
ముచ్చర్ల జయంతి)

*1972 డిసెంబర్‌లో హైదరాబాద్ కేంద్రంగా 'జై తెలంగాణ' వార పత్రిక ప్రారంభమ యింది. దాదాపు రెం డేండ్ల పాటు నడిచింది. పదునైన సంపాదకీయాల ద్వారా ప్రభుత్వాలను గడగడలాడించాడు సత్యనారాయణ. 1952 నాటి 'గైర్ ముల్కీ గోబ్యాక్' ఉద్యమం మొదలు 2014లో సాకారమైన తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వరకు పోరుబాట నడిచిన యోధుడు ముచ్చర్ల.*

తెలంగాణ ఉద్యమ కవిత్వం, పాటలు క్రమం తప్పకుండా ప్రచురించేవారు. ఇందులో కొన్నింటిని '1969-73 తెలంగాణ ఉద్యమ కవిత్వం' సంకలనంలో అచ్చయ్యాయి. అంతేగాదు ఉపాధ్యాయ సంఘం నాయకుడు బి.శ్రీధర్, ఇంజనీరింగ్ సంఘం అధ్యక్షులు కె.అనంతరెడ్డి తదితరులతో పత్రికలో వ్యాసాలు రాయించి ఆ యా రంగాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను లెక్కగట్టిండు. పత్రికలో 'కాకతమ్మ కబుర్లు', 'నిజా నిజాలు', 'పరిశీలన', 'జిల్లాల నుంచి', 'మన వార్తలు', 'ప్రజల మాట' శీర్షికలో వార్తలు, కథనాలు ప్రచురించి ఆంధ్రా ప్రభుత్వం చేస్తున్న ఆగడాలను, అన్యాయాలను ప్రజల దృష్టికి తీసుకొచ్చేవాడు. పదునైన సంపాదకీయాలకు పత్రిక పేరుపడింది. 'కమ్యూనిస్టు చీడపురుగులు' అని ఉద్యమానికి వ్యతిరేకంగా ఉండటమే గాకుండా ప్రజాభీష్టాన్ని మన్నించని కమ్యూనిస్టు పార్టీలను చీల్చి చెండాడిండు. పత్రిక నడపడం అంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. పత్రిక మొదట ఐదువేల ప్రతులతో మొదలై వారానికి పదివేల ప్రతులు అమ్మే స్థాయికి వెళ్లింది. 20 పైసలు వెలగల పత్రిక నడపడానికి ప్రతి సంచికకు లక్షరూపాయలు ఖర్చువచ్చేది. 1972లో లక్ష రూపాయల ఖర్చు అంటే ఎంతటి కష్టసాధ్యమైన పనో అర్థం చేసుకోవాలి. ప్రతి సంచికను దినదిన గండంగా అప్పుచేసి నడిపించేవాడు. బహుజన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి పత్రికను నిర్భయంగా నడపడం ఆంధ్రా పాలకులకు కంటగింపుగా మారింది. కాసు బ్రహ్మానందరెడ్డి పత్రికను మూసేయించడానికి కుట్ర చేసిండు. అంతేగాదు ప్రింటింగ్ ప్రెస్‌మీద దాడి చేయించాడు. అచ్చయిన పత్రిక కాపీలన్నింటినీ ఆయన అనుచరులు ఎత్తుక పోయింద్రు. అయినా తెలంగాణ ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఏకైక లక్ష్యంగా ధైర్యంగా పత్రికను వెలువరించాడు. ఈ పత్రిక గురించి తన జీవిత కథ 'ధిక్కార కెరటం' లో ముచ్చర్ల ఇట్లా చెప్పుకున్నాడు. "తెలంగాణ ఉద్యమం అణచివేతకు గురైన తర్వాత ఆంధ్ర పాలకులు మరింత దుర్మార్గంగా తెలివిగా తెలంగాణను దోపిడీ చేయడం మొదలు పెట్టారు. జై ఆంధ్ర ఉద్యమం ఫలితంగా కాంగ్రెస్ పార్టీ ఆరుసూత్రాలపథకం ప్రకటించింది. ముల్కి నిబంధనలను రద్దు చేసి తెలంగాణకు మరింత అన్యాయం తలపెట్టింది. ఈ అన్యాయాన్ని వ్యతిరేకించిన తెలంగాణ వాదులకు 'జై తెలంగాణ' పత్రిక వేదికగా మారింది. అని పేర్కొన్నాడు. ఇప్పుడీ పత్రిక ప్రతులన్నీ సేకరించి అందులో రికార్డయిన చారిత్రక వ్యాసాలను, కవిత్వం, పాటలు, సంపాదకీయాలను పునర్ముద్రించినట్లయితే తెలంగాణ ఉద్యమం ఎన్ని మైళురాళ్లు దాటి వచ్చిందో తెలుస్తుంది.



డా. సంగిశెట్టి శ్రీనివాస్
9849220321

# ఈశాన్యంలో సూర్యోదయం

## త్రిపుర, మణిపూర్, మేఘాలయ రాష్ట్రాల అవతరణ దినోత్సవం

సువిశాల భారతం విభిన్న సంస్కృతులు, సాంప్రదాయాల సమ్మేళనం, భిన్నత్వంలో ఏకత్వమే భరతమాత విలక్షణత. భాషలు, యాసలు, కులమతాలు, జీవన విధానాలు, సామాజిక ఒడుదుడుకులు, సంస్కృతికి విలక్షణతలు వేరైనా ఒకే దేశంగా సగర్వంగా నిలబడిన ప్రపంచంలోనే అత్యంత పెద్ద ప్రజాస్వామిక దేశం నా సుందర హిందూస్థానం. బ్రిటీష్ వలస పాలన నుంచి 1947లో విముక్తమై, స్వతంత్ర భారతంగా ఊపిరి పీల్చుకున్న సమయంలో నాడు 565 రాజరిక రాష్ట్రాలు లేదా ప్రిన్స్‌లీ స్టేట్స్‌తో పాటు 14 రాష్ట్రాలు, 7 ప్రొవిన్సులు, 6 కేంద్ర పాలిట ప్రాంతాలు ఉండేవి. నేటి భారత దేశం 28 రాష్ట్రాలు, 8 కేంద్రకాల్తో ప్రాంతాలుగా తన మనుగడను కొనసాగిస్తున్నది. గత 79 ఏండ్లలో సమయానుకూలంగా, స్థానిక అవసరాలు, భాష ప్రాతిపదికలు, పాలన సౌలభ్యాలు, ప్రజాభిప్రాయాలను బట్టి ప్రిన్స్‌లీ స్టేట్స్, ప్రొవిన్సులను విలీనం చేసుకొని, మరో 14 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడం లేదా విస్తరించడం జరిగింది. ఇదే క్రమంలో 21 జనవరి 1972న ఈశాన్య ప్రాంతాలైన త్రిపుర, మణిపూర్, మేఘాలయాలను రాష్ట్రాలుగా ఏర్పాటు చేయడానికి "ఈశాన్య ప్రాంతాల పునర్వ్యవస్థీకరణ చట్టం, 1971" చేయడం, 27వ రాజ్యాంగ సవరణ చేయడంతో ఈ మూడు రాష్ట్రాలు ఆవిర్భవించాయి.

### మణిపూర్ గత చరిత్ర:

1947లో మహారాజా ఆఫ్ మణిపూర్ పాలనలో ఉన్న మణిపూర్, స్వతంత్రం రాగానే భారత్‌లో విలీనం కావడానికి అంగీకరించడం, 1948లో ... 1949లో భారత్‌లో విలీనం అయ్యింది. 1956లో కేంద్ర పాలిట ప్రాంతంగా గుర్తించబడి, 1972లో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయబడింది. ఇంఫాల్ రాజధానిగా 37.56 లక్షల జనాభా కలిగిన మణిపూర్ నేడు కొండ ప్రాంత కుకీలు, లోయ ప్రాంత మైథీల మధ్య విభేదాలతో ఉద్రిక్తతల నడుమ ఒకే రాష్ట్రంగా కొనసాగుతున్నది. తనకంటూ ఒక ప్రత్యేక సంస్కృతి వారసత్వ సంపదలతో మణిపురీ నాట్యం, విలక్షణ పండుగలతో విరాజిల్లుతున్నది.





### త్రిపుర గత చరిత్ర:

1947లో రాచరిక పాలనలో ఉన్న త్రిపుర ప్రాంతం కంచన్ ప్రభ రాణి చొరవతో 1949లో భారత్‌లో విలీనం అయ్యింది. ఒకప్పుడు మనీషా రాజవంశం పాలించిన త్రిపుర ప్రాంతం 1956లో కేంద్ర పాలిట ప్రాంతంగా, 1972లో రాష్ట్రంగా పునర్వ్యవస్థీకరించబడింది. ... త్రిపుర రాష్ట్ర జనాభా నేడు దాదాపు 43 లక్షలు ఉన్నది.

### మేఘాలయ గత చరిత్ర:

1947లో మేఘాలయా ప్రాంతం 'ఘోర - ఖాసీ'ల ఏలుబడిలో ఉన్నది. 1970లో ఈ ప్రాంతం అస్సామ్‌లో భాగంగా ఉన్నప్పటికీ 1972లో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి తన ప్రత్యేకతను నిలుపుకుంది. "మేఘాల నిలయం"గా పేరొందిన మేఘాలయా ప్రాంత సహజ ప్రకృతి అందాలు, ప్రత్యేక సాంస్కృతిక సంపదలతో తన విలక్షణతలు నిలుపుకుంటున్నది. 'స్కాట్‌లాండ్ ఆఫ్ ఈస్ట్'గా పిలువబడే షిల్లాంగ్ కేంద్రంగా పాలన కొనసాగుతున్న మేఘాలయాలో నేడు 39.2 లక్షల జనాభా ఉన్నది.

ఈశాన్య భారతంలో ప్రకృతి అందాలు, కొండలు కోనలు, లోయల సహజ సంపదలతో విరాజిల్లుతున్న త్రిపుర, మణిపూర్, మేఘాలయా రాష్ట్రాలు 21 జనవరి 2025న తమ తమ "రాష్ట్ర అవతరణ దినోత్సవాల"ను ఘనంగా జరుపుకొని ఆయా ప్రాంతాల అభివృద్ధికి మరోసారి ప్రజలు పునరంకితులు కావాలని కోరుకుందాం. ఈశాన్య భారత అందాలను ఇనుమడింపజేస్తున్న ఈ రాష్ట్రాల్లో శాంతి, సంపదలు రాజ్యమేలాలని ...



డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037



# జాతీయం-అంతర్జాతీయం



## నితిన్ నబీన్ నా బాస్..

### ప్రధాని మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు



భాజపా జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నితిన్ నబీన్‌ను ప్రశంసించారు. ఇప్పుడు నబీన్ తనకు బాస్ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీ సమక్షంలో కమల దళపతిగా నితిన్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. నబీన్ తనకు బాస్ అని, తాను సాధారణ పార్టీ కార్యకర్త అని వ్యాఖ్యానించారు. 'భాజపాలో సాధారణ కార్యకర్త కూడా జాతీయ అధ్యక్షుడు కాగలరు. భాజపాలో నిర్ణయాలు, ఎంపిక అన్నీ.. ప్రజాస్వామ్యయుతంగానే ఉంటాయి. దేశ సేవ, ప్రజాసేవ లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేస్తున్నారు. గతంలో ఆద్వాణీ, వెంకయ్యనాయుడు నేతృత్వంలో ఘన విజయాలు సాధించాం. అందరి కృషితోనే మూడుసార్లు అధికారంలోకి వచ్చేలా పార్టీ ఎదిగింది. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంది. భాజపా కార్యకర్తను అనిపించుకోవడమే నాకు గర్వకారణం. భాజపాలో ప్రత్యేకంగా పదవులు, బాధ్యతలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్క కార్యకర్త స్వయంగా బాధ్యతలు తీసుకోవాలి. బాధ్యతలు ఒకరి నుంచి ఒకరికి మారతాయి.. లక్ష్యం మారదు. నాయకత్వం మారినా.. మన గమ్యం మారదు. భాజపా చేతిలోనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలి' అని మోదీ అన్నారు.

## దేశం కోసం బుల్లెట్లు ఎదుర్కొన్నాం

### ఫారూక్ అబ్దుల్లా



దేశం కోసం తాము బుల్లెట్లను ఎదుర్కొన్నామని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా చెప్పారు. అవసరమైతే మరోసారి ఎదురు నిలబడతామన్నారు. జమ్మూకశ్మీర్‌ను మళ్లీ విభజించాలనే డిమాండ్లను తప్పుపట్టారు. వాటిని మూర్ఖత్వంగా పేర్కొన్నారు. భవిష్యత్తులో లద్దాఖ్ తిరిగి జమ్మూకశ్మీర్‌లో విలీనం కావొచ్చన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమం సందర్భంగా మీడియాతో మాట్లాడారు.

ఎన్‌సీ, పీడీపీలు జమ్మూకశ్మీర్‌లో రాళ్ల దాడులు, ఉగ్రవాదాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నాయని భాజపా చేసిన ఆరోపణలను ఫరూక్ అబ్దుల్లా ఖండించారు. "అలజడులు సృష్టించాలనుకుంటున్నది వారే.. మేం కాదు. దేశ సమగ్రతకు మేం బుల్లెట్లు ఎదుర్కొన్నాం. అవసరమైతే మరోసారి సిద్ధమే" అని అన్నారు. జమ్మూకశ్మీర్ నుంచి జమ్మూను విడదీసి రాష్ట్ర హోదా ఇవ్వాలంటూ వస్తున్న డిమాండ్లపై స్పందిస్తూ.. తమ పార్టీ ఎప్పుడూ అలాంటి ఆలోచనలు చేయలేదని తెలిపారు. గతంలో లద్దాఖ్‌ను విడగొట్టారని, దాని వల్ల ఏం ప్రయోజనం కలిగిందని ప్రశ్నించారు. ఏదో ఒక రోజు లద్దాఖ్ తిరిగి జమ్మూకశ్మీర్‌లో కలుస్తుందన్నారు. స్థానికంగా కొత్త జిల్లాల ఏర్పాటు అనవసరమని చెప్పారు. పాకిస్థాన్‌తో భారత్ చర్చలు జరపాలా? వద్దా? అనే అంశంపై స్పందిస్తూ.. మీడియాకు 'పాకిస్థాన్ ఫోబియా' ఉందని ఆరోపించారు. పొరుగు దేశాలను మార్చలేమని గతంలో మాజీ ప్రధాని వాజ్‌పేయీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు.

## పెరోల్ ఇస్తే పారిపోతాడు



ముంబయి పేలుళ్ల ఘటన (1993)లో కీలక పాత్రధారి అబూసలేంపై మహారాష్ట్ర ప్రభుత్వం కీలక వ్యాఖ్యలు చేసింది. తన సోదరుడి మరణం నేపథ్యంలో 14 రోజుల పెరోల్ కోరుతూ బాంబే హైకోర్టులో అబూ సలేం పిటిషన్ వేశాడు. దానిని వ్యతిరేకిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేసింది. ఆ గ్యాంగ్‌స్టర్‌కు పెరోల్ ఇస్తే పారిపోతాడని తెలిపింది. 1993లో పోర్చుగల్‌కు పారిపోయిన అంశాన్ని గుర్తు చేసింది. అవసరం అయితే రెండు రోజుల పెరోల్ ఇవ్వొచ్చని సూచించింది. అబూ సలేం ఒక అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్ అని, దశాబ్దాల పాటు నేర కార్యకలాపాలకు పాల్పడ్డాడని మహారాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. తన సోదరుడి కుటుంబం ఉంటున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని సరాయ్మీర్ ప్రాంతానికి వెళ్లాలని అతడు తన పిటిషన్‌లో కోరడంపై యూపీ పోలీసులు కూడా ప్రతికూలంగా స్పందించారు. అది మతపరంగా సున్నితమైన ప్రాంతం కావడంతో అక్కడికి వెళ్లడం ప్రమాదకరమన్నారు. పేలుళ్ల ఘటనకు పాల్పడిన అబూసలేం నకిలీ పాస్‌పోర్ట్‌తో పోర్చుగల్‌కు పారిపోయాడు. అక్కడ పోలీసులు అరెస్టు చేయడంతో అతని జాడ వెల్లడయింది. అనంతరం భారత అధికారుల అభ్యర్థన మేరకు అతడికి మరణ శిక్ష విధించరాదని, 25 ఏళ్లకు ఎక్కువ జైలు శిక్ష విధించవద్దనే షరతులతో అతడిని 2005లో భారత్‌కు అప్పగించారు. పేలుళ్లు, బెదిరింపులు, హత్య కేసుల్లో 2015లో అతడికి జీవిత ఖైదు పడింది. నాటి నుంచి మహారాష్ట్రలోని తలోజా సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు.

## అరుదైన ఆధ్యాత్మిక వివాహం



ఛత్తీస్‌గఢ్‌లో ఓ జంట శ్రీకృష్ణుడి సాక్షిగా ఒక్కటైంది. ధంతరీలో ఈ అరుదైన వివాహం జరిగింది. పట్టణంలోని జాలంపుర్ వార్డులో స్థానికుల ఆధ్వర్యంలో శ్రీమద్భాగవత జ్ఞానయజ్ఞ సప్తాహం ఇటీవల నిర్వహించారు. ఆ కథను ఆ ప్రాంతానికి చెందిన ప్రసిద్ధ కథకురాలు దేవి భూమిక వినిపించారు. కథ ఆరో రోజున రుక్మిణీ కల్యాణ ప్రసంగం జరుగుతున్న సమయంలో.. ఆ ఘట్టాన్ని మరింత విశిష్టంగా మార్చేందుకు కథా వేదికనే వివాహ మండపంలా అలంకరించారు. ఆ వేదిక మీదే వరుడు ప్రతీక్ దేవాంగన్, వధువు మాధురి దేవాంగన్ వివాహం చేసుకున్నారు. మండపంలో వధూవరులు ఏడడుగులు వేసి, సిందూర దానం పూర్తి చేశారు.

## యుఎస్‌పై ఆధారపడటాన్ని యూరోప్ సమీక్షించుకోవాల్సిందే



గ్రీన్‌లాండ్ వ్యవహారమై యునైటెడ్ స్టేట్స్‌కు, దాని ఐరోపా మిత్ర దేశాలకూ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా యుఎస్ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్ విషయంలో తన ప్రతిపాదనను తిరస్కరించిన ఐరోపా దేశాలపై భారీ సుంకాలు విధిస్తానంటూ బెదిరించిన నేపథ్యంలో నిన్నటి వరకూ ఒకే గూటి పక్షుల్లా వ్యవహరించినవారంతా వేరు పడిపోతున్నారు. ట్రంప్ వ్యాఖ్యలకు స్పందనగా యూరోపియన్ యూనియన్ నాయకులు, తిప్పికొట్టే చర్యలుగా యుఎస్ నుంచి వచ్చే దిగుమతులపై 93 బిలియన్ యూరోలు (107.7బిలియన్ అమెరికన్ డాలర్లు) సుంకాల ప్యాకేజీని విధించాలని యోచిస్తోంది. యుఎస్ ప్రభుత్వం దూకుడుగా చేస్తున్న ఈ భూకబ్జా అట్లాంటిక్ సముద్రానికి అటూ ఇటూ ఉన్న దేశాల మధ్య గల ఆర్థిక, సైనిక శక్తి అసమతుల్యానికి అద్దం పడుతోంది. ఈ వివాదానికి నడుమ ప్రాథమిక సూత్రమైన అంతర్జాతీయ చట్టం సార్వభౌమాధికారం, భౌగోళిక సమగ్రత పట్ల గౌరవం అనేది నలిగిపోతోంది. తన భౌగోళిక లక్ష్యాలకు యూరోప్ నుంచి ఆమోదం పొందాలన్న లక్ష్యంతోనే యుఎస్ ఈ సుంకాల బెదిరింపులు చేస్తోంది. అయితే, ఇది పై అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమే. గ్రీన్‌లాండ్ పై డెన్మార్క్ సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు ఐక్యంగా యత్నిస్తున్న యూరోప్ కూటమి, కలిసే ఉండటం, ఈ సూత్రానికి కట్టుబడి ఉన్నారనేందుకు ఒక ప్రమాణం. అమెరికా ఫస్ట్ అన్న ట్రంప్ నినాద నేపథ్యంలో యుఎస్‌కు మిత్రపక్షంగా ఉండటం వృథా అనే విషయాన్ని ఐరోపా నాయకులు తెలుసుకోవాలి. సుంకాలు, మార్కెట్ నిషేధాలు సహా తిప్పికొట్టే చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామనే సంకేతాన్ని ఇవ్వడం ద్వారా, యుఎస్ వత్తిడి పద్ధతులకు ప్రతిస్పందనగా ఆలస్యమైనా యూరోపియన్ యూనియన్ ఇవ్వడం అభినందించతగినదే. నెలకొన్ని పరిస్థితులు, ఈ ట్రాన్స్‌అట్లాంటిక్ సంబంధాల స్వభావాన్ని యూరోప్ సమీక్షించుకోవలసిన అవసరాన్ని, తమ భద్రతకు ఒక బలమైన అండగా యుఎస్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవలసిన అవసరాన్ని తప్పనిసరి చేస్తున్నాయి. వాణిజ్య వివాదాల నుంచి పర్యావరణ మార్పు, భద్రతలపై మారుతున్న వైఖరుల నడుమయుఎస్ ప్రయోజనాలు ఐరోపా స్థిరత్వంతో అంతర్గతంగా సమలేఖనం అవుతాయన్న భావనకు పదే పదే సవాళ్లు ఎదురవుతూనే ఉన్నాయి. యుఎస్ ఎగుమతులకు ఏడాదికి 500 బిలియన్ల విలువైన ఐరోపా అతిపెద్ద మార్కెట్టు అన్నహోదా కారణంగా, ఐరోపా నాయకులు మోకాళ్ల మీద పడటం కన్నా ఆ బలంతో బేరసారాలు సాగించాలి. ఈ సంక్లిష్టమైన పరిస్థితి నుంచి బయటపడే సమయంలో, ప్రపంచ వేదికపై తన ప్రయోజనాలు, పోషించాలనుకుంటున్న పాత్ర, తన ప్రయోజనాల పట్ల స్పష్టమైన అవగాహనతో యూరోప్ ఉండాలి. పరస్పర గౌరవం, సమానత్వ ప్రాతిపదికన యుఎస్‌తో తన సంబంధాలను తిరిగి అంచనా వేసుకునేందుకు యూరోప్‌కు ప్రస్తుత సంక్షోభం అవకాశమిస్తోంది. గ్రీన్‌లాండ్ పై తాజా వివాదం, యూరోప్ ప్రయోజనాలు యుఎస్ ప్రయోజనాలతో సమలేఖనం కావని సూచిస్తోంది. ఇటీవలే యుఎస్ ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెసెంట్ యూరోప్ బలహీనతను, అంతర్జాతీయ స్థిరత్వం గ్రీన్‌లాండ్‌పై యుఎస్ నియంత్రణ అవసరాన్ని గురించి మాట్లాడటం, యూరోప్ పట్ల యుఎస్‌కు ఉన్న అహంకారపూరిత వైఖరికి అద్దం పడుతోంది. ఈ వ్యాఖ్యలు భద్రత నుంచి ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యంకు సంబంధించి యుఎస్ వైఖరిని అనుసరించాలనే వైఖరితో ఉన్న యూరోప్‌లో ఉన్న వారందరికీ మేలుకొలుపుగా ఉండాలి.


అటువంటి ప్రకటనలు ఐరోపా సార్వభౌమత్వాలను అవమానించడమే కాక, ప్రపంచ వేదికపై శక్తిమంతమైన, స్వతంత్ర శక్తిగా ఉండే ఆ ఖండ సంభావ్యతను విస్మరిస్తున్నాయి. ఐరోపా దేశాలు తాము ఇటువంటి పరిస్థితికి రావడానికి కారణమైన గత కొన్ని ఏళ్లుగా తాము అనుసరిస్తున్న విదేశాంగ విధానం, ఆర్థిక అభివృద్ధి వ్యూహాలను సమీక్షించుకోవాలి.

ఇతర దేశాల భూభాగాలను బహిరంగంగా స్వాధీనం చేసుకోవడానికి యుఎస్ ప్రభుత్వం ఇతర దేశాల భద్రతను తాము కాపాడుతున్నామనే సాకు చెప్తే, ఈ దూకుడుతో కూడిన యుఎస్ ఇస్తామంటున్న భద్రతకు, ఐరోపా దేశాలు తమను తాము దూకుడు, భద్రతా ముప్పుల నుంచి కాపాడుకోవడానికి సాయపడుతున్నామనే మాటలకు తేడా ఏముంది?

గ్రీన్‌లాండ్‌పై ప్రస్తుత వివాదం అన్నది యూరోప్‌కు ఒక కీలక మలుపుగా ఉండనుంది. తన వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని పెంచుకొని, తమ భాగస్వామ్యాలను విస్తరింప చేసుకుని, ప్రపంచ వేదికపై తన పాత్రను స్థిరం చేసుకోవాలనే పిలుపు ఇది. అలా చేయడం ద్వారా, యూరోప్ తన భవిష్యత్తును ఒక జగడాలమారి నిర్ణయించకుండా, తమ సామూహిక ప్రయోజనాల ద్వారా రూపొందించుకోగలుగుతుంది.

## ఆమె వల్ల బంధాలు ధ్వంసం

### భార్య అపర్ణా యాదవ్‌పై ములాయం చిన్నకుమారుడు ప్రతీక్ విమర్శలు



**లఖ్‌నవూ:** సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్, ఆయన రెండో భార్య సాధన కుమారుడు ప్రతీక్, కోడలు అపర్ణా యాదవ్ మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయి. అపర్ణ వల్ల తమ కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు దెబ్బతిన్నాయంటూ ప్రతీక్ తీవ్ర ఆరోపణలు సంధించారు. కీర్తి, పరపతి సాధించాలనే వ్యక్తిగత స్వార్థంతో తమ కుటుంబాన్ని ఆమె ధ్వంసం చేశారంటూ ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో పోస్ట్ చేశారు. 2017లో లఖ్‌నవూ కంటోన్మెంట్ స్థానం నుంచి సమాజ్‌వాదీ తరఫున ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన ఆమె ఓడిపోయారు. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున ప్రచారం చేసిన అపర్ణా యాదవ్ ప్రస్తుతం ఆ రాష్ట్ర మహిళా కమిషన్ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. స్వార్థపరురాలైన అపర్ణా యాదవ్‌తో విడాకులు తీసుకోనున్నట్లు ప్రతీక్ యాదవ్ మరో పోస్టులో పేర్కొన్నారు. ఈ బంధాన్ని వీలైనంత త్వరగా ముగించాలని అనుకుంటున్నట్లు తెలిపారు. అపర్ణా యాదవ్ వ్యక్తిగత సహాయకుడు హిమాన్షు వ్యాఖ్యలతో ఈ వివాదం కీలక మలుపు తిరిగింది. ఆయన 'ఈటీవీ భారత్'తో మాట్లాడుతూ... 'ప్రతీక్ యాదవ్ అకౌంట్ హ్యాక్ అయ్యింది. ఎవరో దుండగులు కావాలనే తప్పుడు పోస్టులు పెట్టారు. భార్యాభర్తల మధ్య అలాంటి గొడవలేమీ లేవు' అని ఆయన వివరణ ఇచ్చారు. ఈ వ్యవహారంపై అపర్ణా యాదవ్ స్పందన కోసం ప్రయత్నించగా ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ అని వస్తోంది. ఆమె సన్నిహితులు, సహచరులు కూడా ఈ విషయంపై మాట్లాడేందుకు నిరాకరించారు.

## దావోస్‌లో డొనాల్డ్ ట్రంప్ విందు

### ఏడుగురు భారతీయ సీఈఓలకు ఆహ్వానం

దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో ఆరేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొంటున్నారు. ఈ క్రమంలోనే ఆయన అక్కడ స్పెషల్ డిన్నర్‌ను ఏర్పాటు చేయడం సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది. ఈ ప్రతిష్ఠాత్మక విందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న దిగ్గజ పారిశ్రామికవేత్తలతో పాటు, భారతదేశానికి చెందిన ఏడుగురు ప్రముఖ సీఈఓలకు ఆహ్వానం అందింది. కాగా, ఈసారి వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో డొనాల్డ్ ట్రంప్ స్వయంగా పాల్గొనబోతున్నారు. ఈ సందర్భంగా వివిధ దేశాల వ్యాపారవేత్తలతో ఆయన సమావేశం కాబోతున్నారు. ఈ క్రమంలోనే ట్రంప్ పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత కంపెనీల ప్రాముఖ్యత పెరుగుతున్న నేపథ్యంలో ఏడుగురు భారతీయ దిగ్గజాలకు ఈ విందులో చోటు లభించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ స్పెషల్ డిన్నర్‌లో అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక సంబంధాల బలోపేతంపై చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

## పోలీసు ఉన్నతాధికారి రాసలీలల వీడియోల కలకలం



- కర్ణాటకలో దుమారం
- క్రమశిక్షణ చర్యలకు సీఎం సిద్ధరామయ్య ఆదేశం

కొన్ని నెలల్లో పదవీ విరమణ పొందాల్సిన కర్ణాటక రాష్ట్ర డీజీపీ స్థాయి అధికారి డాక్టర్ రామచంద్రరావు మహిళలతో అత్యంత సన్నిహితంగా మెలిగిన వీడియోలు కలకలం రేపుతున్నాయి.

సుమారు 40 సెకన్ల నిడివితో ఉన్న ఈ వీడియోలు సోమవారం వైరల్ అయ్యాయి. తన అధికారిక కార్యాలయంలో పోలీసు దుస్తుల్లోనే పలువురు మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (డీసీఆర్‌ఈ) అధిపతిగా విధులు నిర్వహిస్తున్న రామచంద్రరావు..ప్రచారంలో ఉన్న వీడియోలపై వివరణ ఇచ్చేందుకు హుటాహుటిన హోంమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ నివాసానికి వెళ్లారు. మంత్రిని కలిసేందుకు అవకాశం దక్కలేదని సమాచారం. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ 'ఈ వీడియోలలో ఉన్నది నేను కాదు. ఎవరో కుట్రపన్ని ఏఐతో తయారు చేసి బయటపెట్టారు. ఎనిమిదేళ్ల కిందట రికార్డు చేసినవిగా కనిపిస్తున్నాయి. వీటిని విడుదల చేసిన వారిపై ఫిర్యాదు చేసేందుకు న్యాయవాదులతో చర్చిస్తున్నా. ఈ వీడియోల గురించి నాకు ఏమీ తెలియదు. దీనిపై విచారణ చేపట్టాలని హోంమంత్రికి మనవి చేసేందుకు వెళ్లా' అని తెలిపారు. ఈ వీడియోల గురించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందిస్తూ.. అధికారిపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచిస్తానన్నారు. దోషిగా రుజువైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**మరికొన్ని ఆరోపణలు..**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 1993 బ్యాచ్ ఐపీఎస్ అధికారి రామచంద్రరావు వివాదాల్లో చిక్కుకోవటం ఇదే తొలిసారి కాదు. గతేడాది దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బంగారు బిస్కెట్ల స్మగ్లింగ్ కేసులో దోషి, సినీనటి రన్యారావు సవతి తండ్రి ఈయన. రామచంద్రరావు సహకారంతోనే రన్యారావు స్మగ్లింగ్ చేసేవారని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయనను సెలవుపై ఉండాలని సర్కారు ఆదేశించింది. ఈ కేసులో క్లీన్‌చిట్ రావడంతో గత ఏడాది ఆగస్టులో ఆయన సేవలను ప్రభుత్వం పునరుద్ధరించింది. రామచంద్రరావు సదరన్ రేంజ్ ఐజీపీగా ఉన్న సమయంలో మైసూరు దక్షిణ పోలీసులు ఓ ప్రైవేటు బస్సును సోదా చేసి రూ.20 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణ సందర్భంగా నిందితులు తాము తరలించిన మొత్తం రూ.2.27 కోట్లు కాగా పోలీసులే మిగతా సొమ్మును దాచేసినట్లు వెల్లడించారు. ఈ విషయంలో రామచంద్రరావు పాత్రపై నేటికీ ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి.

## పాక్‌లో భారతీయుడి మృతి

మూడేళ్ల క్రితమే శిక్ష పూర్తయినా పాకిస్థాన్ జైల్లోనే మగ్గిపోయి ఓ భారతీయ మత్స్యకారుడు మృతి చెందాడు. గుజరాత్‌కు చెందిన ఓ జాలరి 2022లో చేపల వేటకు వెళ్లి.. అనుకోకుండా పాక్ జలాల్లోకి ప్రవేశించాడు. దీంతో అక్కడి అధికారులు కరాచీలోని మలీర్ జైల్లో బంధించారు. అతడి జాతీయత ధ్రువీకరణ పూర్తికావడంతోపాటు అదే ఏడాది శిక్ష కూడా ముగిసింది. అయినప్పటికీ.. విడుదల చేయలేదు. ఈ నెల 16న అతడు జైల్లో మృతి చెందినట్లు సామాజిక కార్యకర్త జతిన్ దేశాయ్ వెల్లడించారు. పోరుబందర్ బోట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జీవన్ జుంగీ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. మృతుడి పేరును గోప్యంగా ఉంచారు. గిర్ సోమనాథ్ జిల్లాలోని ఉనా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నట్లు చెప్పారు. "ఇరుదేశాల మధ్య 2008 నాటి ఒప్పందం ప్రకారం.. పట్టుబడిన మత్స్యకారుల శిక్షాకాలం, జాతీయత ధ్రువీకరణ పూర్తయిన నెలరోజుల్లోగా వారిని తిరిగి పంపించాలి. కానీ, ఇది జరగడం లేదు. పట్టుబడిన భారతీయులు పాక్ జైళ్లలో మగ్గిపోతూనే ఉన్నారు" అని దేశాయ్ ఆవేదన వ్యక్తంచేశారు.

## జంటలకు ఉమ్మడి పన్ను?





**న్యూఢిల్లీ :** బడ్జెట్ వస్తోందంటే దేశంలో మధ్య తరగతి ఆశ, నిరాశల మధ్య ఊగిసలాడుతుంటుంది. ఈసారి ప్రభుత్వం తమకేం ప్రయోజనాలు కల్పిస్తోందో, ఏం మొట్టికాయలు వేస్తుందో అనే ఉత్కంఠతో ఉంటారు. ప్రయోజనాల మాటేమిటో కానీ, వివాహిత జంటలకు ఉమ్మడి పన్ను విధిస్తారన్న ఊహాగానాలు షికార్లు చేస్తున్నాయి. ఈ తాయిలం వల్ల కుటుంబాలకు చాలా ప్రయోజనం చేకూరుతుందన్నది విధానకర్తల విశ్వాసం. ఒకవేళ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ సూచనను అంగీకరించి, ప్రకటిస్తే కోట్లాది వివాహిత జంటలకు ఇది ప్రయోజనకరమవుతుంది. జంటల పన్ను అంటే, ఇద్దరి ఆదాయాన్ని అంచనా వేసి ఒకటే ఆదాయపు పన్ను రిటర్న్‌ను దాఖలు చేయవచ్చు. ఉదాహరణకు, రూ. 6 లక్షల వరకూ పన్ను ఉండదు, రూ.6 నుంచి రూ. 14 లక్షల వరకూ 5శాతం పన్ను పడుతుంది.

ప్రభుత్వ వర్గాల ప్రకారం, ఈ వ్యవస్థ పన్నులు దాఖలు చేయడాన్ని సులభతరం చేసి, అనుసరించడం తేలిక చేస్తుంది. అది కాగితపు పనినితగ్గించి, తమ పన్ను వ్యవహారాలను నిర్వహించుకోవడం జంటలకు తేలిక చేస్తుంది. అంతేకాదు, కుటుంబాలలో ఒకే వ్యక్తి సంపాదిస్తుంటే, మినహాయింపు పరిమితి, ప్రభావవంతమైన పన్ను చెల్లింపు మరింత అనుకూలం కావచ్చు.

ఈ భావన అటు జంటలో ఒకరే సంపాదిస్తున్నా, ఇద్దరూ సంపాదిస్తున్న కుటుంబాలకు లబ్ధి చేకూరుస్తుంది. వారి పన్నులో ప్రాథమిక మినహాయింపులు పెరిగి, ప్రామాణికమైన తగ్గింపులు ఉంటాయి. అలాగే, హోం లోన్, ఎడ్యుకేషన్ లోన్ వడ్డీపై తగ్గింపును అనుమతిస్తుంది. ప్రస్తుతం, రూ. 50 లక్షల ఆదాయానికి పైన ఉంటే సర్‌చార్జి విధిస్తున్నారు. జంట పన్ను విధానం కింద దీనిని రూ. 75 లక్షలవరకూ పెంచవచ్చు. అయితే, ఈ ప్రత్యామ్నాయం స్వచ్ఛందం, ఇది ఆదాయం మధ్య తరహాగా ఉన్న వారికి ప్రధానంగా ప్రయోజనకరం. ఎక్కువ ఆదాయం బ్రాకెట్లలో ఉన్నవారికి అది అంత లాభదాయకం కాకపోవచ్చు. ఎందుకంటే, ఉమ్మడి ఆదాయం పన్ను శ్లాబులను పెంచుతుంది. కవేళ ఈ సూచనను అంగీకరించి, అనుమతిస్తే, ఇది భారతీయ పన్ను వ్యవస్థ ఆధునీకరణ, భారీ ప్రక్షాళన అవుతుంది. ప్రస్తుతం, పన్ను వ్యవహారాలలో వివాహితులకు, అవివాహితులకు మధ్య తేడా లేదు. జంటలకు వేర్వేరు పాన్ కార్డులు ఉంటాయి, ఒకవేళ ఒక భాగస్వామికి ఆదాయం లేకపోతే, వారి మినహాయింపు నిరుపయోగం అవుతుంది. ఈ ప్రతిపాదనను ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ సూచించింది. ఇది ఇప్పటికే జర్మనీ, యునైటెడ్ స్టేట్స్ సహా పలు దేశాలలో ప్రాచుర్యంలో ఉంది.


## భారత్‌తో వాణిజ్య ఒప్పందం

### మదర్ ఆఫ్ ఆల్ డీల్స్: ఈయూ చీఫ్



భారత్‌ఐరోపా యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఆ డీల్ దాదాపు ఖరారయ్యే దశలో ఉంది. దీనిని ఉద్దేశించి యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లెయెన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ ఒప్పందం దిశగా ఇంకా చేయాల్సిన పని ఉంది. మనం చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దిశగా పయనిస్తున్నాం. కొందరు దీనిని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా పిలుస్తారు. దీనివల్ల కోట్లాదిమంది ప్రజలకు వస్తువులు, సేవలు ఎగుమతిదిగుమతి చేసుకొనే సౌలభ్యం కలుగుతుంది. ఇది ప్రపంచ జీడీపీలో 25శాతానికి సమానం" అని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ఉర్సులా వెల్లడించారు. వచ్చే వారం ఆమె భారత్‌లో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. గ్రీన్‌లాండ్ విషయంలో తమ పెద్దన్న అమెరికాతో ఐరోపా దేశాలకు విభేదాలు తలెత్తాయి. నాటో మిత్రదేశాలని కూడా చూడకుండా ట్రంప్ సుంకాలు విధించారు. గ్రీన్‌లాండ్ విషయంలో తమకు మద్దతు తెలపని 7 దేశాలు ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్, నెదర్లాండ్స్, బ్రిటన్ (ఈయూ సభ్యదేశం కాదు) పై ట్రంప్ 10 శాతం అదనపు సుంకాలను ప్రకటించారు. ఇవి ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. అప్పటికీ దిగిరాకపోతే జూన్ నుంచి ఆ సుంకాలను 25శాతానికి పెంచుతామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఉర్సులా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## మోదీ మెచ్చిన పండు ఇది!



ప్రధాని మోదీ సూచించిన ఓ పండు గురించి నెట్‌లో తెగ వెతికేస్తున్నారట. ఆ పండు పేరు సీ బక్‌థార్న్ కాగా.. హిమాలయ సానువుల్లో ముఖ్యంగా లద్దాఖ్ ప్రాంతంలో ఎక్కువగా పండుతుండడంతో దీన్ని లేహ్‌బెర్రి అని కూడా పిలుస్తారు. ప్రధాని మోదీ ఓ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ.. యువత రోజువారీ ఆహారంలో సీ బక్‌థార్న్‌ను భాగం చేసుకోవాలని సూచించడంతో దీని ప్రత్యేకతలపై అందరిలో ఆసక్తి నెలకొంది.

సీ బక్‌థార్న్... ఇదో రకం నారింజ రంగు బెర్రీ. మిరాకిల్ ఫ్రూట్ లేదా లేహ్ బెర్రీగా పిలిచే దీని శాస్త్రీయనామం హిప్పోఫే రామ్నాయిడ్స్‌ఎల్. ఇందులో ఫ్లేవనాయిడ్లు, విటమిన్లు, టెర్పినాయిడ్లు, పాలీశాకరైడ్లు, అమైనో ఆమ్లాలు... వంటి ఔషధ, పోషకాలెన్నో పుష్కలం. ఈ బెర్రీల్లో 3, 6, 7, 9 ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలూ లభిస్తాయి. అందుకే దీన్ని సూపర్ ఫ్రూట్ అంటున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ లద్దాఖ్ ప్రాంతంలో ఈ పండ్ల సాగునీ, వాటి ఉత్పత్తుల తయారీనీ ప్రోత్సహిస్తోంది.

చిన్నపాటి ముళ్లపొదలా పెరిగే ఈ మొక్క 40 నుంచి +40 డిగ్రీల సెంటీగ్రేడు ఉష్ణోగ్రతని తట్టుకుని పెరుగుతుంది. క్రీ.పూ. నుంచీ దీన్ని చైనా సంప్రదాయ వైద్యంలో వాడినట్లు తెలుస్తోంది. ప్రాచీన టిబెటన్ సాహిత్యంలోనూ దీని ప్రస్తావన ఉంది. పండు రూపంలోనే కాదు, ఈ మొక్క భాగాలన్నీ ఔషధ భరితమే. అందుకే పూర్వం నుంచీ దీన్ని అనేక వ్యాధుల నివారణలో వాడేవారట. బీపీని నియంత్రించడంతో పాటు జలుబు, జ్వరాల్నీ తగ్గిస్తుందనీ ట్యూమర్లనీ మూత్రపిండాల్లో రాళ్లనీ అడ్డుకుంటుందనీ అంతర్జాతీయ ఔషధ పరిశోధనలూ స్పష్టం చేస్తున్నాయి. 200కి పైగా బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉండటంతో అనేక రకాల హృదయ సంబంధిత వ్యాధుల నివారణకీ సాయపడుతుందీ పండు. ఇందులోని శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి, రోగనిరోధకశక్తిని పెంచుతాయి. అల్సర్లను నివారించి జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. ఒమేగా ఆమ్లాలు నాడీ సమస్యల్ని తగ్గించి జ్ఞాపకశక్తిని పెంచుతాయి. నారింజతో పోల్చితే సీ బక్‌థార్న్‌లో సివిటమిన్ 12 రెట్లు ఎక్కువ. ఎ, ఇ, కె, బికాంప్లెక్స్ విటమిన్లూ సమృద్ధిగా ఉంటాయి. చర్మం పొడిబారకుండా చేసే ఒమేగా 7 ఫ్యాటీ ఆమ్లం ఉండే అతి కొద్ది వనరుల్లో ఈ పండొకటి. అందుకే ఈ బెర్రీని చర్మ సంరక్షణ క్రీములు, నూనెల్లోనూ వాడుతున్నారు. దీని ప్రయోజనాలు తెలిసి పాశ్చాత్యులూ హెర్బల్ టీ, జామ్, జ్యూస్, సలాడ్, స్మూతీ... ఇలా నచ్చిన పద్ధతిలో తింటున్నారట. కాబట్టి ఎండు, తాజా, పొడి ఏ రూపంలో దొరికినా తప్పక తీసుకోండి మరి!

# ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి

◆ ఫిర్యాదులు చేస్తే అధికారులు పట్టించుకోవడంలేదు
◆ తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర నాయకుడు ఎస్పీకే సాగర్



**వుదయం, జయశంకర్ భూపాలపల్లి:**
జిల్లాలో ఉన్న సమస్యలపై ఫిర్యాదులు చేస్తే అధికారులు పట్టించుకోవడం లేదని, పైగా వ్యవస్థల్లో శత్రువుల అవుతున్నామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర నాయకుడు ఎస్పీకే సాగర్ పేర్కొన్నారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా స్థాయి అధికారులు సమస్యలపై సమావేశాలు నిర్వహించారు. కానీ అవన్నీ కాగితాలకు పరిమితం అవుతున్నాయే తప్ప ఆచరణ నోచుకోవడంలేదన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు వారి చాంబర్ కూడా దాటడం లేదని.. కిందిస్థాయి అధికారులు వారి మాటను అసలు పట్టించుకునే స్థితిలో లేరని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ప్రైవేట్ హస్పిటల్ అనుమతులు లేకుండా నడుస్తున్నాయని పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా.. అనుమతుల్లేని ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవడంలేదని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడే వారు ఫిర్యాదు చేయడం వల్ల వ్యవస్థలకు శత్రువులుగా మారుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు అనుమతులు లేని ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# క్రీడాకారులకు జెర్సీలు పంపిణీ



**వుదయం, జయశంకర్ భూపాలపల్లి :**
అన్నారం వారియర్స్ క్రికెట్ టీమ్ సభ్యులకు కాళేశ్వరం గ్రామ పంచాయతీ 8వ వార్డు సభ్యురాలు పెద్ది లక్ష్మీ జెర్సీలు అందజేశారు. మంగళవారం క్రీడాకారులకు జెర్సీలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చెమ్మాల సుధీర్ ఉన్నారు.

# ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి



◆ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి
◆ జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకుల సమావేశం

**జయశంకర్ భూపాలపల్లి , వుదయం:**
ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు సంఘం నిరంతరం కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి తెలిపారు. జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాలు, సంఘ కార్యకలాపాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో సంఘ కార్యదర్శి సునీల్, అసోసియేట్ అధ్యక్షుడు మహమ్మద్ సంధాని, కార్యవర్గ సభ్యులు రాజేందర్, సంతోష్ కుమార్, ఇందిర, స్వాతి, మల్లేశ్వరి, సమ్మయ్య, శ్రీనివాస్, బాలు నాయక్, భరత్ ఆనంద్, శ్రీజ, తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. రాబోయే రోజుల్లో చేపట్టనున్న కార్యక్రమాలు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై కూడా సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నట్లు వారు తెలిపారు.

# వాసవీ మాత ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



**నర్సంపేట, వుదయం :**
వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ సందర్భంగా ఆలయంలో ఉదయం 7:30 లకు పవిత్ర నది జల కలశములు గోక్షీర 108 కలశములతో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణం నందు కలశపూజ ప్రారంభించారు. మంగళవారం నర్సంపేట పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయం నందు ఆలయ కమిటీ అధ్యక్షుడు చకిలం కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి గర్నెపెల్లి శ్రీనివాస్, కోశాధికారి మద్దనపల్లి ఉపేందర్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. అనంతరం భక్తులచే అమ్మవారికి కలశాభిషేకంను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ వాస్తవ్యులు శనిగవరపు శ్రీరామ్ చరణ్ అవధాని, వాసవి మాత ఆలయ ప్రధాన అర్చకుడు ద్రోణ నరసింహ మూర్తిల ఆధ్వర్యంలో ఘనంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అందరికీ హోమ విభూదిని, తీర్థ ప్రసాదాలను కార్యక్రమం అంతరం అన్న ప్రసాదాన్ని భక్తులకు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యవర్గం, మండల కమిటీ అధ్యక్షుడు సింగిరికొండ మాధవ శంకర్ గుప్తా, పట్టణ కమిటీ అధ్యక్షులు వంగేటి గోవర్ధన్ గుప్తా, యువజన సంఘం అధ్యక్షులు శ్రీరామ్ కిరణ్ గుప్తా, మహిళా సంఘం అధ్యక్షురాలు శింగిరికొండ రజిని గుప్తా, కమిటీ సభ్యులు సలహాదారులు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి దూరంగా అడవి బిడ్డలు

◆ కాపురం పునరావాస కాలనీలో కానరాని మౌలిక వసతులు
◆ కాగితాల్లో సౌకర్యాలు... క్షేత్రస్థాయిలో దుర్భర జీవితం

**వుదయం, మల్హర్రావు:**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్రావు మండలం తాడిచర్ల గ్రామ పరిధిలోని కాపురం పునరావాస కాలనీలో ఆదివాసీల జీవితం అనేక సమస్యల మధ్య కొనసాగుతోంది. ప్రభుత్వ రికార్డుల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు పేర్కొనబడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నట్లు స్థానికులు వాపోతున్నారు.తరలింపు ప్రక్రియ పూర్తయినా, అక్కడ నివసిస్తున్న ఆదివాసీలకు అవసరమైన కనీస వసతులు అందకపోవడంతో పునరావాసం కేవలం పేరుకే పరిమితమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**మురుగులోనే జీవనం... ఆరోగ్యంపై ముప్పు**
కాపురం పునరావాస కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు, ఇంటి మురుగు నీరు ఇళ్ల మధ్యే నిలిచిపోతోంది. వీధులన్నీ అపరిశుభ్రంగా మారి



చెరువులను తలపిస్తున్నాయి. చిన్న పిల్లలు మురికి నీటిలోనే తిరగాల్సిన పరిస్థితి నెలకొనగా, మహిళలు, వృద్ధులు బురద, దుర్గంధం మధ్య నడవలేని దుస్థితిలో ఉన్నారు. ఈ కారణంగా చర్మ వ్యాధులు, మలేరియా, డెంగ్యూ వంటి అంటువ్యాధుల ముప్పు పెరుగుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వెక్కిరిస్తున్న 'కాగితాల' అభివృద్ధి**
జెన్కో (GENCO) నివేదికల ప్రకారం పునరావాస కాలనీలో అన్ని సౌకర్యాలు



కల్పించినట్లు ఉన్నా, వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని ఈ గ్రామాన్ని పరిశీలిస్తే స్పష్టంగా తెలుస్తోంది. తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడం, పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలడం, అంతర్గత రోడ్లు అధ్వాన్న స్థితిలో ఉండటంతో నడవడమే కష్టంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితిని చూసినవారు ముక్కున వేలేసుకుంటున్నారు.

**నిధుల వినియోగంపై అనుమానాలు**
పునరావాసం అంటే కేవలం ఇళ్ల నిర్మాణమే కాకుండా, ప్రజలు గౌరవంగా జీవించే వాతావరణం కల్పించాల్సిన బాధ్యత జెన్కో అధికారులపై ఉందని గ్రామస్తులు అంటున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితులు పునరావాస నిధుల వినియోగంపై అనేక అనుమానాలకు తావిస్తున్నాయి.

**పునరావాస నిధులు పూర్తిగా వినియోగించారా?**
క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకుండానే నివేదికలు సిద్ధం చేశారా? తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై చర్యలు ఎప్పుడు? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

**జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి**
ఈ దారుణ పరిస్థితిపై జిల్లా కలెక్టర్ తక్షణమే ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. జెన్కో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, డ్రైనేజీ, తాగునీటి, పారిశుద్ధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# ఉచిత శిక్షణలను సద్వినియోగం చేసుకోండి

◆ కరపత్రాన్ని ఆవిష్కరించిన
◆ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**వుదయం, జయశంకర్ భూపాలపల్లి :**
రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, బ్యాంకింగ్, రైల్వే, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఉద్యోగాల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఉచిత శిక్షణ కార్యక్రమ కరపత్రాన్ని మంగళవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ స్టడీ సర్కిల్, వరంగల్ నందు 20.02.2026 నుంచి 19.07.2026 వరకు (5 నెలలు) శిక్షణ కార్యక్రమం ఉంటుదని తెలిపారు. ఈ ఉచిత శిక్షణకు సంబంధించి ప్రవేశాల కోసం ప్రిలిమినరీ ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, వార్షిక ఆదాయం 3 లక్షలకు మించకూడదని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు www.tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా 30.01.2026 లోపు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 08.02.2026 న ఎంపిక పరీక్ష నిర్వహించ బడుతుందని తెలిపారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు ఎస్సీ స్టడీ సర్కిల్, వరంగల్‌లో ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ అందించబడుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ విలువైన అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి ఈ ఇందిర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల స్వైర విహారం



కుక్కల దాడిలో గాయపడిన ఇమ్రాన్, అద్విత్

◆ నలుగురిపై దాడి

**లక్షెట్టిపేట, వుదయం:**
మున్సిపాలిటీలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, పట్టించుకోకపోవడంతో రోజురోజుకు వాటి బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. మంగళవారం పట్టణంలోని 14వ వార్డులో ఇమ్రాన్, అద్విత్, అన్విలా, మరొకరిపై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచాయి. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇమ్రాన్ ని మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించినట్లు ఆసుపత్రి సూపర్డెంట్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. పగలు, రాత్రివేళల్లో రోడ్లపైకి గుంపుగుంపులుగా వచ్చి రోడ్లపై నుంచి వెళ్ళే వారిపై దాడులు చేస్తుండడంతో కుక్కలు కనబడితే చాలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం వల్లే వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడద ఎక్కువ అవుతుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వీధి కుక్కల బెడద నుంచి తమను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

# పిల్లలను చదువుకోనివ్వాలి



◆ విద్యాశాఖ అధికారులు
◆ విద్య ప్రాముఖ్యతపై విద్యార్థుల తల్లితండ్రులకు కౌన్సెలింగ్

**జయశంకర్ భూపాలపల్లి,వుదయం :**
బడి ఈడు బాలలను పనుల్లో పెట్టకుండా చదువుకోనివ్వాలని విద్యాశాఖ అధికారులు కోరారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహాదేవపూర్ మండల కేంద్రంలో పర్యటించారు. మండల కేంద్రంలోనీ జిల్లా పరిషత్ పాఠశాల 20 మంది విద్యార్థులు పాఠశాలకు రాకుండా బయటే ఉంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. చిన్నారుల ముఖంలో చిరునవ్వు తేవాలన్న సంకల్పంతోనే ముందుకు వెళుతున్నామని అన్నారు. విద్య ప్రాముఖ్యతను వారికి వివరించారు. కార్యక్రమంలో కొయ్యూరు, ఎస్ఐ 2 రజన్ కుమార్, కాటారం ఏఎస్ఐ సుధీర్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్పందనతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 13 గ్రామాల్లో రీసర్వే చేపడుతాం



◆ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి, వుదయం :**
జిల్లాలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ రీ సర్వేపై అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఐడీఓసీ నుంచి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూ సర్వే చట్టం సెక్షన్ 5 (1), 6(1) కింద గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసి, జిల్లాలో మొదట దశగా మొత్తం 13 గ్రామాలను రీ సర్వే చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఈ గ్రామాల్లో గ్రామ నక్షాలు (గ్రామ పటాలు) లేకపోవడం లేదా అస్పష్టంగా ఉండడం వల్ల రైతుల పొలాల హద్దులను ఖచ్చితంగా నిర్ణయించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనివల్ల గట్టు (సరిహద్దు) వివాదాలు తరచుగా ఉత్పన్నమవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. రీ సర్వే ద్వారా రైతులకు పలు ప్రయోజనాలు చేకూరనున్నాయని ఆయన వివరించారు. ఈ ప్రక్రియలో పొలాల గట్టు హద్దులు, రోడ్లు, చెరువులు, కాలువలు, గ్రామ కంటం భూములు తదితరాలను ఖచ్చితంగా గుర్తించి, శాస్త్రీయ పద్ధతిలో హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే ప్రతి రైతు భూమికి సంబంధించిన అక్షాంశాలు (లాటిట్యూడ్), రేఖాంశాలతో కూడిన ఖచ్చితమైన భూ పటాలను అందజేయడం జరుగుతుందని చెప్పారు. దీని ద్వారా భూ వివాదాలు పూర్తిగా నివారించబడతాయని, భూ లావాదేవీలు సులభతరం అవుతాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు



◆ పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి వివేక్

**చెన్నూర్ /రామకృష్ణాపూర్, వుదయం:**
క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బిఆర్ఎస్ నాయకులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న మునిసిపాలిటీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అధికార కాంగ్రెస్ పార్టీలోకి మరిన్ని చేరికలు జరిగేలా కనబడుతుంది. ఒకటో వార్డుకు చెందిన బిఆర్ఎస్ నాయకులు తీగల రమేష్, రాస సంపత్, పులి శ్రీనివాస్, గోమాస కుమారస్వామి, ప్రభాకర్, బిజూన్ వ్యాపార సంఘ అధ్యక్షులు ఆడెపు కృష్ణ లు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వీరందరికీ మంత్రి ఆయన స్వగృహంలో పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని తెలిపారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, అధికార ప్రతినిధి వొడ్నాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య, మహంకాళి శ్రీనివాస్, పార్వతి విజయ, బత్తిని రవి, పందిన కృష్ణ, గాజుల శంకర్, ముక్తి శ్రీనివాస్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ అనూష కుమార్‌కు సన్మానం



◆ శుభాకాంక్షలు తెలిపిన బక్క రాజు

**వుదయం, ఖానాపురం :**
మండలంలోని రంగాపురం గ్రామ నూతన సర్పంచ్ పింది అనూషకుమార్‌ను గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం అధ్యక్షుడు బక్క రాజు ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో యాదవ్ సంఘం ఉపాధ్యక్షుడు దూదుల యాకయ్య, కార్యదర్శి మెరుగు రాజు, కోశాధికారి కాసరబోయిన ఐలయ్య, సంఘం సభ్యులు వేల్పుల ఐలయ్య, సోమయ్య, రాజులు, కుమార్, నర్సయ్య, సంపత్, దూదయ్య, కొమురయ్య, రవి, రాజు, రఘుపతి, మల్లేష్, సాంబలక్ష్మి, యాకలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తుగా మామిడి పూత



**సిద్దిపేట ,వుదయం :**
సిద్దిపేట జిల్లా పుల్లూరు గ్రామ పరిసరాల్లో మామిడి తోటలు ముందే పూతతో విరబూస్తుండటం రైతుల్లో కొత్త ఆశలను నింపుతోంది. గత నాలుగైదు ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మామిడి చెట్లకు సుమారు 25 రోజుల ముందుగానే పూత రావడం విశేషం. ప్రతి మామిడి చెట్టు పూతతో నిండిపోవడంతో తోటలు చూడముచ్చటగా మారాయి. ముఖ్యంగా పుల్లూరు గ్రామ రోడ్డు ప్రక్కన ఉన్న మామిడి చెట్లు సంపూర్ణ పూతతో విరబూసి ప్రయాణికుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో దిగుబడులు మెరుగ్గా ఉంటాయన్న ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.గత కొన్నేళ్లుగా వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, పురుగుల దాడుల వల్ల మామిడి దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే ఈ ఏడాది ముందస్తు పూత రావడం, చెట్ల ప్రావీణ్యం స్పష్టంగా కనిపించడంతో మంచి దిగుబడులు వస్తాయన్న నమ్మకంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వాతావరణం సహకరిస్తే ఈ ఏడాది మామిడి పంట రైతులకు లాభదాయకంగా మారుతుందన్న ఆశ గ్రామంలో నెలకొంది.

# బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా తక్కలపల్లి



**వుదయం, ఖానాపురం :**
బీఆర్ఎస్ నర్సంపేట నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా తక్కలపల్లి తక్కలపల్లి రవీందర్ రావుని నియామకం అయ్యారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల రామారావు ఆదేశాల మేరకు తక్కలపల్లి తక్కలపల్లి రవీందర్ రావుని నియమించినట్లు బీఆర్ఎస్ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తనను నియోజకవర్గ ఇన్‌చార్జిన నియమించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, సహకరించిన పెద్ది సుదర్శన్ రెడ్డికి, పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తూ.. పార్టీ అభివృద్ధికి పాటుపడుతానన్నారు.

# సూరారం పాఠశాలకు 'ఆర్వో ప్లాంట్' విరాళం



**హైదరాబాద్ ,వుదయం :**
గ్రామీణ ప్రాంత పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు కొంత ఆసరాగా ఉండాలనే ఉద్దేశంతో తన సొంత గ్రామం తను చదువుకున్న పాఠశాల అయిన మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం సూరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ మేనేజర్ లక్ష్మీ రామచందర్ తన తల్లిదండ్రులు శామమ్మ _నరహరి జ్ఞాపకార్థం. ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ను పాఠశాలకు అందజేసి ఈరోజుప్రారంభించారు..అనంతరం పాఠశాలలో చదువుకుంటున్న 152 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందచేశారు... భవిష్యత్తులో గ్రామ అభివృద్ధికి తన సహకారం అందిస్తానని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ మేనేజర్ లక్ష్మీ రామచందర్ పేర్కొన్నాడు.పాఠశాలలో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినందుకు లక్ష్మీ రామచందర్ కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిలుక నగరాజు, ఉప సర్పంచ్ మల్లేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, గ్రామ ప్రజలు మరియు విద్యార్థులు.



# నిర్మాణ పనులు పూర్తి చేయండి



◆ లబ్ధిదారులను ఆదుకోవాలని సీఎంకు వినతి

**జయశంకర్ భూపాలపల్లి ,వుదయం:**
అసంపూర్తిగా మధ్యలోనే ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ నిర్మాణ పనులను పూర్తి చేసి లబ్ధిదారులను ఆదుకోవాలని జిల్లా పరిధిలోని మొగుళ్ళపల్లి మండలానికి చెందిన భూమయ్య కోరారు. హైదరాబాద్‌లో ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు మంగళవారం భూమయ్య పేర్కొన్నారు. మొగుళ్ళపల్లి మండలంలోని మేదరమెట్ల గ్రామంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 50 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు అయ్యాయన్నారు. అందులో 40 ఇండ్లు స్లాబులు, 10 ఇండ్లు బెస్‌మెంట్ లెవల్ వరకు పనులు నిలిపివేశారని వినతి పత్రంలో తెలిపారు. ఇండ్లు మంజూరై నిర్మాణ పనులు పూర్తి కాక వారు లబ్ధిదారులు ఎప్పుడు పూర్తి అయితాయని ఎదురుచూస్తున్నారని వినతి పత్రంలో వివరించారు. ఆగిపోయిన నిర్మాణ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని వినతి పత్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు.

# మధిర లడక బజారులో ఇందిరమ్మ చీరల పంపిణీ



**మధిర,వుదయం:**
మధిర పట్టణంలోని లడక బజార్ 16,17,18 డివిజన్లో తెలంగాణలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమంగా చేపట్టిన ఇందిరమ్మ చీర పంపిణీ కార్యక్రమం లో భాగంగా డివిజన్ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు, షేక్ జహంగీర్,మైలవరపు చక్రి ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ పథకం ద్వారా ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని పేదలకు ఉచితంగా చీరలు అందజేస్తున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆడబిడ్డలకు సారె పెట్టి, మహిళలను గౌరవిస్తున్నారని మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ మైలవరపు లక్ష్మీ స్వాతి,కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ రహీం,బహటం వనజా,డివిజన్ కమిటీ అధ్యక్షురాలు అద్దంకి మంజీరా,వనపర్తి కళావతి, ఖాసింబి తదితరులు పాల్గొన్నారు.

# వాసవిక్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు,చీరలు పంపిణీ



**మధిర,వుదయం:**
శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం మధిర నందు గ్రేటర్ మధిర వాసవి క్లబ్ అధ్యక్షులు దాచేపల్లి ముత్యాలు,వనిత వాసవి క్లబ్ మధిర అధ్యక్షురాలు దోసపాటి కళ్యాణి ఆధ్వర్యంలో దుప్పట్లు చీరల పంపిణీ కార్యక్రమం జరిగినది.ఈ రెండు క్లబ్లు బాధ్యులు నిరుపేదలకు ఉపయోగపడే చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడం పట్ల అభినందించారు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జులు ఇరుకుళ్ళ సురేష్,కేతేపల్లి సతీష్, వేములపల్లి ప్రసాద్ రావు, ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ గుండా లక్ష్మి సింధూరి, రీజనల్ చైర్మన్ కేతేపల్లి పావని,యూత్ వాసవి క్లబ్ మధిర అధ్యక్షులు పల్లబోతు భార్గవ్, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం చైర్మన్ పల్లపోతు ప్రసాదరావు,చెన్నూరు ఛాలెంజర్స్ క్లబ్ అధ్యక్షులు కార్యదర్శులు నాగలక్ష్మి ,కోశాధికారి వెచ్చ ఝాన్సీ,మాజీ డిప్యూటీ గవర్నర్ కుంచం కృష్ణారావు,నందిగామ పురుషోత్తం రావు,చల్లాసత్యనారాయణ, మహంకాళి వెంకటశ్రీనివాసరావు,చలవాది చిన్న కృష్ణమూర్తి ఆర్టీసీ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక ఎదుగుదలే ప్రభుత్వ లక్ష్యం




- వడ్డీ లేని రుణాలు రూ.58 లక్షల చెక్కుల పంపిణీ
- రూ.20 కోట్లతో సుల్తానాబాద్ అభివృద్ధి
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

**వుదయం, పెద్దపల్లి :**
మహిళల ఆర్థిక ఎదుగుదలే ప్రభుత్వ లక్ష్యం అని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మంగళవారం ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా సుల్తానాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే చీరలను పంపిణీ చేశారు. అలాగే వడ్డీ లేని రుణాల రూ.58,86,470 లక్షల రూపాయల విలువ గల చెక్కుల పంపిణీ చేశారు. అంతకుముందుగా మున్సిపల్ కమిషనర్ మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం 9 సంవత్సరాల పాలనలో అభివృద్ధిని గాలికొదిలేసిందని ఆయన విమర్శించారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మహిళల సంక్షేమం కోసం వడ్డీ లేని రుణాలు అందించి వారిని ఉన్నత స్థితికి తీసుకువచ్చేలా కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన అని, అందుకు ప్రతి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమంలో మహిళలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళల పేరు మీదనే ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు, ఐకేపీ కేంద్రాల నిర్వాహణ, మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటుతో ప్రభుత్వం మహిళలకు అండగా ఉన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలోనే సంక్షేమ కార్యక్రమాలలో దూసుకుపోయామని తెలిపారు. మరో మూడు సంవత్సరాలు కాలం ఉందని.. మరో ఐదు సంవత్సరాలు కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని ప్రజలందరూ ఆశీర్వదించి రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా అండగా వ్యవహరించాలన్నారు. అభివృద్ధి పరంగా తన వద్దని ప్రశ్నించి అభివృద్ధిని కోరడం ప్రజల వంతని అభివృద్ధి పరిచేందుకే ముందుంటానని అన్నారు. బీఆర్ఎస్ కల్లబొల్లి మాటలు నమ్మిమోసపోవద్దని రానున్న మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేసి విజయ కేతనం ఎగురవేయాలని సూచించారు. అనంతరం వడ్డీ లేని రుణాలు 58 లక్షల 86,470 చెక్కును మహిళా గ్రూప్ సభ్యులకు అందించారు. 146 గ్రూపుల కు తిరిగి వచ్చిన [illegible] 202325 వరకు మహిళా శక్తి 528 సంఘ సభ్యులకు అందించారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలకు చీరల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాష్‌రావు, తాసిల్దార్ బషీరుద్దీన్, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, పార్టీ శ్రేణులు శ్రీగిరి శ్రీనివాస్, చిలుకు సమత కృష్ణ, వేగోళం అబ్బయ్యగౌడ్, ఊట్ల వరప్రసాద్, అంతటి పుష్పలత, మహ్మద్ నిసార్ రఫీక్, అమీర్ శెట్టి రాజలింగం ముత్యాల రవీందర్ గంగె శ్రీనివాస్ కుమార్ కిషోర్ న్యాతరి శ్యాం సుందర్ సిద్ధ తిరుపతి గాదాసు రవీందర్ చింతల రాజు దున్నపోతుల రాజయ్య తొర్రికొండ ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## వారమైనా రైతులకు అందని యూరియా



బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు జాటోత్ రమేష్.

**వుదయం, ఖానాపురం :**
మండలంలోని కొత్తూరు గ్రామానికి యూరియాలోడు వచ్చి వారం రోజులు అవుతున్న గోదాంలోనే యూరియా బస్తాలు పెట్టి అధికారులు రైతులకు టోకెన్లు ఇవ్వకుండా యూరియాను రైతుల మొక్కజొన్న పంటలకు పంపిణీ చేయకుండా యూరియా బస్తాలను గోదాంలోనే నిలువ పెట్టడం ఆంతర్యం ఏమిటని వ్యవసాయ శాఖ అధికారులను ప్రశ్నిస్తున్నట్లు గ్రామ రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు జాటోత్ రమేష్ తెలిపారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి కొత్తూరు గ్రామంలోని గోదాంలో నిలువ ఉన్న యూరియా బస్తాలను వెంటనే రైతులకు టోకెన్ల ద్వారా గాని నేరుగా గాని పంపిణీ చేయాలని బిఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని గోదాంలో నిల్వ ఉన్న యూరియా బస్తాల విషయంలో మండల వ్యవసాయ శాఖ అధికారి భోగ శ్రీనివాస్ ను వివరణ కోరగా గోదాంలో యూరియా బస్తాలు నిల్వ ఉన్న మాట వాస్తవం అని తెలుపుతూ, ఒకటి రెండు రోజుల్లో మళ్లీ పూర్తిస్థాయిలో అన్ని గ్రామాలకు యూరియా స్టాకు వస్తుందని తదుపరి జిల్లా కలెక్టర్ మీటింగ్ అనంతరం అన్ని గ్రామాల రైతుల పంట పొలాలకు సరిపోను యూరియాను రైతులకు టోకెన్ల ద్వారా అందజేస్తామని ఏవో తెలిపారు.

## కాంగ్రెస్ నాయకులకు సన్మానం

**వుదయం, జయశంకర్ భూపాలపల్లి :**
మహాదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులను మంగళవారం కాళేశ్వరంలోని ఆలయంలో సన్మానించారు. కాళేశ్వరంలోని కన్యక పరమేశ్వరి ఆలయంలో పూజారి మహాదేవపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అక్బర్ ఖాన్‌ను మహాదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు అస్రార్ ఖురేషి, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు కదార్ల నాగరాజులను అమ్మవారి కండవాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



## భక్తిశ్రద్ధలతో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం

**దమ్మపేట,వుదయం :**
దమ్మపేట మండల కేంద్రంలోని శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆలయంలో, ఆర్య వైశ్య సంఘం మరియు వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు .ఈ నేపథ్యంలో ఆలయ ప్రాంగణన్ని సర్వంగా సుందరం గా అలంకరించారుఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుండి వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పంచామృత అభిషేకలు నిర్వహించగా, అనంతరం ప్రత్యేక పూజలు, హారతులతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.అనంతరం ఉదయం 8 గంటలకు నుంచి ఆలయ ప్రాంగణంలో 102 మంది మహిళలతో



సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.వాసవి మాత మూల విరాట్ కు పోకూరి వెంకట సుబ్బారావు జ్ఞాపకర్థం కుమారులు పోకూరి కృష్ణ ప్రసాద్, మల్లికార్జున గుప్తా లు లక్ష రూపాయల విలువైన వెండి కిరీటం మరియు వెండి వస్తువులు ఆలయ కమిటీ కీ అందజేశారుఅనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ నారాయణ సేవ అన్న దాన కార్యక్రమం నిర్వహించారుఈ కార్యక్రమంలో మండల మరియు టౌన్ అధ్యక్షులు పసుమర్తి రామ్ బద్రం, దారా ప్రసాద్, పైడి వెంకటేశ్వరరావు, దారా యుగంధర్, దారా మల్లికార్జున రావు, లక్ష్మి నారాయణ,ప్రదీప్, పోసి, వినోద్, సురేష్, కొలిశెట్టి ప్రదీప్ జగదీష్, పుల్లారావు, సాయిరాం, వెంకటేశ్వరరావు, దారా తాత రావు, తదితరులు పాల్గొన్నారు

## రైతుల వెతలు తీర్చండి
## దమ్మపేట తాసిల్దార్‌కు దారా వినతి



**దమ్మపేట,వుదయం :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం దమ్మపేట కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన తాసిల్దార్ రామ్ నరేష్ ను అంతర్జాతీయ కోఆర్డినేటర్ మరియు మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు ఈ సందర్భంగా దారా మల్లికార్జునరావు మాట్లాడుతూ గత కొంతకాలంగా దమ్మపేటకు తాసిల్దారు లేకపోవడంతో మండలంలోని రైతుల అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారని త్వరలో రైతుల సమస్యలన్నీ పరిష్కరించాలని ఆయన కోరినట్లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో దమ్మపేట మండల మున్నూరు కాపు ప్రెసిడెంట్ చిన్న శెట్టి సత్యనారాయణ, గ్రామ పెద్దలు అత్యం వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## మైనారిటీ గురుకులాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,వుదయం:**
జిల్లాలోని మైనారిటీ గురుకుల విద్యా సంస్థలలో ప్రవేశాల కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో గురుకుల విద్య సంస్థల లో ప్రవేశాలకు సంబంధించిన గోడ ప్రతులను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైనారిటీ గురుకుల విద్యా సంస్థలలో 5వ తరగతి నుండి ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు ప్రవేశాల కొరకు మైనారిటీ విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు ఆన్ లైన్ లో tgmreistelangana.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు పొందవచ్చని, వివరాల కొరకు కంట్రోల్ రూమ్ నం.7331170790 లో సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలోని మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు ఎండి. తాహేరుద్దీన్, అకాడమీ సమన్వయకర్త రిజ్వాన్, మంచిర్యాల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ మందపెల్లి సంధ్య, చెన్నూర్ పాఠశాల ప్రిన్సిపల్ గోపి, కళాశాల ప్రిన్సిపల్ సమ్మయ్య, బెల్లంపల్లి ప్రిన్సిపల్ నీలు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 23న ఇన్నోవేషన్ పంచాయత్

- తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ సి.ఈ.ఓ. మెరాజ్ ఫహీం

**మంచిర్యాల,వుదయం:**
రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలు, అంకురాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్న తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఈ నెల 23న కరీంనగర్ లో ఇన్నోవేషన్ పంచాయతీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ సి.ఈ.ఓ. మెరాజ్ ఫహీం ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులను ఉద్దేశించి ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు కరీంనగర్ పట్టణంలోని ఐ.టి. టవర్ లో నిర్వహించడం జరుగుతుందని, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల, భూపాలపల్లి, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల నుండి ఆవిష్కర్తలను, వ్యవస్థాపకులను ఈ కార్యక్రమం ద్వారా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఆవిష్కర్తలకు, వారికి అవసరమైన తోడ్పాటుకు మధ్య ఉన్న భౌగోళిక దూరాన్ని తగ్గించడానికి ఈ వేదిక రూపొందించడం జరిగిందని, తమ ఆలోచన, ఆవిష్కరణ / పారిశ్రామిక ప్రయాణం గురించి సందేహాలు ఉన్న ఏ వ్యక్తికైనా, రాష్ట్రంలోని వ్యవస్థాపక నిపుణుల నుండి వ్యక్తిగత, మార్గదర్శకత్వం, సలహాలు పొందేందుకు ఇది ఒక గొప్ప అవకాశం అని తెలిపారు. రాష్ట్ర రాజధాని వెలుపల ఉన్న వ్యవస్థాపకులు, ఆవిష్కర్తలకు వనరులు సమానంగా అందుబాటులో ఉండేలా, తక్షణ, స్పష్టమైన సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. నిపుణులతో నేరుగా చర్చించి, వ్యాపారం / సాంకేతిక సవాళ్లను అక్కడికక్కడే పరిష్కరించడానికి మార్గదర్శకత్వం, ఆలోచన ధ్రువీకరణ, నమూనా అభివృద్ధి, వ్యాపారాన్ని విస్తరించే ప్రక్రియపై సలహాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ఇంక్యుబేషన్ సహాయాన్ని నేరుగా పొందడానికి కనెక్షన్లను సులభతరం చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆవిష్కర్తలు, ఔత్సాహిక వ్యవస్థాపకులు కార్యక్రమంలో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా జ్యోతి క్యాలెండర్ ఆవిష్కరణ



**జైపూర్,వుదయం :**
జైపూర్ మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా జ్యోతి దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లడంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రజా జ్యోతి దినపత్రిక ప్రజల గొంతుకగా నిలుస్తూ, సమాజ హితానికి సంబంధించిన అంశాలను నిష్పక్షపాతంగా ప్రజలకు చేరవేస్తోందని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ప్రజా జ్యోతి దినపత్రిక మరింత అభివృద్ధి చెంది ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కరుణాకర్, సాయిబాబా, సుభాష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్యం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**మధిర,వుదయం:**
షుగర్ వ్యాధిగ్రస్తులకు లండన్ నుంచి ప్రత్యేక వైద్యులు వచ్చి ఉచితంగా వైద్య సహాయం చేయడం గొప్ప అవకాశం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.మంగళవారం మధిర పట్టణంలో యూ కె స్వచ్ఛంద సంస్థ, కృష్ణంరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కృష్ణంరాజు పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.షుగర్ వ్యాధిగ్రస్తులకు కాళ్లకు సంబంధించిన వ్యాధి సోకిన విషయం కూడా ఆ రోగులకు తెలియదని పరీక్షలు చేయిస్తేనే తెలుస్తుందని,ఉచిత మెడికల్ క్యాంపు ద్వారా షుగర్ వ్యాధిగ్రస్తులు ముందే జాగ్రత్త పడే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రముఖ కథానాయకుడు కృష్ణంరాజు జన్మదినం సందర్భంగా ఉమ్మడి రాష్ట్రంలో వారి కుటుంబ సభ్యులు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. కృష్ణంరాజు కుమార్తె ప్రసీద చిన్ననాటి నుంచి సేవాభావంతో తన నాన్నగారి పేరిట సేవలు అందిస్తున్న ఆమెను అభినందిస్తున్నట్లు, దీవిస్తున్నట్లు తెలిపారు. సినీ నటుడు కృష్ణంరాజు కుటుంబంతో తమ కుటుంబానికి మంచి స్నేహబంధం ఉందని కృష్ణరాజు కూతురు ప్రసీద తన కుమారుడు సూర్య విక్రమాదిత్య స్నేహితులు,ఆ స్నేహభావంతో మధిర నియోజకవర్గంలో పేదల కోసం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని కోరగా వారు వెంటనే అంగీకరించి ఇక్కడికి వచ్చి సేవలు అందించడం అభినందనీయం అన్నారు.ఈ నియోజకవర్గంలో పేదల సంఖ్య ఎక్కువగా ఉంది వారికి వైద్య సహాయం భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి విషయాలను ఈ క్యాంపు ద్వారా తెలియజేయడం ఆనందదాయకంఅన్నారు. యునైటెడ్ కింగ్డమ్ లో ప్రసిద్ధ డాక్టర్ అయిన వేణు లండన్ నుంచి ఇక్కడికి వచ్చి సేవలందించడం గొప్ప విషయం అన్నారు. లండన్ వెళ్లి వేణు వద్దా చికిత్స చేయించుకోవాలంటే పెద్ద మొత్తంలో ఖర్చు,సమయం పడుతుంది కానీ వారు నేరుగా మధిరకు వచ్చి ఎటువంటి ఖర్చు లేకుండా సేవలు అందిస్తున్నారు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ,అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని,సూర్య విక్రమాదిత్య,కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి,కృష్ణంరాజు కూతురు ప్రసీద, వాసిరెడ్డి రామనాథం తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఎల్ఈడీ వితరణ చేసిన మాజీ సర్పంచు



**నిజాంసాగర్, వుదయం:**
మహమ్మద్‌నగర్ మండలంలో మగ్దూంపూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఆ గ్రామ మాజీ సర్పంచు విద్యార్థులకు మంగళవారం ఎలఈడీ టీవీని వితరణ చేశారు. మాజీ సర్పంచు భీమన్‌పల్లి లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజనార్దం, వారి చదువుకు మరింత ఉపయోగపడేలా టీవీని అందించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేష్, ఉపాధ్యాయులు ప్రేమాజీ, షఫీ, సంతోష్ కుమార్, సాయిలు గ్రామ పెద్దలు సిద్ధ గౌడ్ రవి పాల్గొనగా పాఠశాల యజమాన్యం మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# నేడు ధర్మపురికి మంత్రులు భట్టి,తుమ్మల రాక

- సభ ఏర్పాట్లు పరిశీలించిన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- రూ.250 కోట్ల అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపనలు




**ధర్మపురి,వుదయం :**
చారిత్రక పుణ్యక్షేత్రం ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికకు శ్రీకారం చుట్టింది.నియోజకవర్గ ముఖచిత్రాన్ని మార్చేలా సుమారు రూ.250 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి,సంక్షేమ పనులకు నేడు శంకుస్థాపనలు జరగనున్నాయి.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు,సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరుకానున్నా రు.ఈ సందర్భంగా సభా వేదిక, హెలీ ప్యాడ్, భద్రత, సౌకర్యాల ఏర్పాట్లను సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ మంగళవారం స్వయంగా పరిశీలించారు. సభా వేదిక, భద్రత, తాగునీరు, పారిశుద్ధ్యం, రాకపోకల సౌకర్యాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. సభను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రూ.200 కోట్లతో 'యంగ్ ఇండియా' ఇంటిగ్రేటెడ్ స్కూల్ నేరేళ్ల శివార్లలో 25 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి విద్యా కేంద్రం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యం తో భవన నిర్మాణానికి డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నారు.ఈ పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి డిగ్రీ వరకు ఒకే ప్రాంగణంలో విద్య, వసతి కల్పించనున్నారు.మున్సి పాలిటీ అభివృద్ధికి రూ.33 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, భూమిపూజలు,ధర్మపురి పట్టణ అభివృద్ధిలో భాగంగా గతంలో మంజూరైన రూ.17 కోట్లతో పూర్తయిన పనుల ప్రారంభోత్సవం, అలాగే కొత్తగా రూ.16 కోట్ల టీఎఫ్ఐడీ నిధులతో చేపట్టే పనులకు భూమిపూజ జరగనుం ది.గోదావరి నది కాలుష్యం కాకుం డా రూ.17 కోట్లతో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి అంకురార్పణ చేయనున్నారు. రూ.10 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం, వివిధ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాలు ధర్మారంలో ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయనున్నారు.మిగిలిన మూడు ధర్మపురి రెవెన్యూ డివిజన్, బస్ డిపో, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు రాబోయే రోజుల్లో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దివ్యంగులకు పాఠశాల,ఇంటర్ కళాశాల,డిగ్రీ కళాశాల ఏర్పాటు కు ముఖ్య మంత్రి అనుమతి కోరడం జరిగిందని తెలిపారు.రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి,ధర్మపురి దేవస్థాన పునర్నిర్మాణం,బ్రాహ్మణ అగ్రహారం అభివృద్ధి మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని, అందులో తనకు సభ్యత్వం కల్పించారని మంత్రి అడ్లూరి తెలిపారు.మార్చి లోపు కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా మౌలిక వసతుల కోసం సీఎం భారీ నిధులు కేటాయించనున్నట్లు వెల్లడించారు.రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థుల చదువుపైనే ఆధారపడి ఉంది. అందుకే సమీకృత పాఠశా లలను నిర్మిస్తున్నాం అని తెలిపారు.తనకు ఈ క్యాబినెట్ ద్వారా అవకాశం కల్పించిన సీఎం కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. నియోజక వర్గ ప్రజలు భారీగా తరలివచ్చి నేటి సభను విజయవంతం చేయాలి.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్,ఆర్డీఓ మధుసూదన్, తహశీల్దార్ శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు,దేవ స్థానం ఈవో శ్రీనివాస్,సీఐ రాం నరసింహారెడ్డి,ఎస్సై మహేష్,అన్ని శాఖల అధికారులు నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ క్రికెట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక!



**హనుమకొండ టౌన్, వుదయం :**
హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు డి. శ్యామల, ఝాన్సీలు సౌత్ జోన్ మహిళా ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు.ఈ పోటీలు ఫిబ్రవరి 2 తేదీ నుండి మద్రాస్‌లోని అన్నా యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సౌత్ జోన్ స్థాయిలో నిర్వహించే ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో కళాశాల విద్యార్థినులు పాల్గొనడం గర్వకారణమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.టి.బి.టి. ప్రసాద్, డాక్టర్ పుల్లా రమేష్, డాక్టర్ సుచరిత, డాక్టర్ సంజీవ్‌తో పాటు కళాశాల అధ్యాపకులు విద్యార్థినులను అభినందించి, పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి కళాశాలకు, విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం



**నిజాంసాగర్,వుదయం:**
మహిళల ఆర్థిక, సామాజిక అభివద్దే కాంగ్రెస్ ధ్యేయమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు స్పష్టం చేశారు. మంగళవారం బిచ్కుంద మున్సిపల్ పరిధిలోని కందర్‌పల్లి గ్రామంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థిక సామాజిక అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే కుటుంబం, సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్, స్థానిక మండల నాయకులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించారు

- ఆర్డీఓ శ్రీనివాస్

**లక్షెట్టిపేట, వుదయం:**
మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస్ అన్నారు.మంగళవారం మున్సిపల్ కార్యాలయ లో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ...మహిళల ఆర్థిక సామాజిక అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితే కుటుంబం, సమాజం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పథకం అమలులో మహిళల కు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్లా నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్ కుమార్, నాయకులు సురేష్ నాయక్, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# అవగాహన, రోడ్డు భద్రత నిబంధనల పాటించుటతోనే రోడ్డు ప్రమాదాలకు చెక్ : కరీంనగర్ సీపీ గౌష్ ఆలం

**కరీంనగర్, జనవరి 20, (వుదయం ప్రతినిధి):**



రోడ్డు ప్రమాదాల నివారణ కేవలం పోలీసుల చర్యలతోనే సాధ్యం కాదని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండి, వాటిని బాధ్యతాయుతంగా పాటించినప్పుడే ప్రమాద రహిత సమాజం సాధ్యమవుతుందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన 'అరైవ్ – అలైవ్' అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీపీ ప్రసంగిస్తూ కీలక అంశాలను వెల్లడించారు. గత ఏడాది కమిషనరేట్ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల వల్ల 200 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని సీపీ అన్నారు. ఇందులో ఎక్కువ శాతం ప్రమాదాలు సీట్ బెల్టు ధరించకపోవడం, హెల్మెట్ లేకపోవడం, అతివేగం మరియు మద్యం సేవించి వాహనం నడపడం వంటి మానవ తప్పిదాల వల్లే జరిగాయని తెలిపారు. ప్రమాదాల్లో మరణించిన వారిలో 85 శాతం మంది పురుషులు ఉండటం గమనార్హమని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక నిఘా: కరీంనగర్ నుండి హైదరాబాద్, వరంగల్, జగిత్యాల, సిరిసిల్ల, చొప్పదండి వెళ్లే ప్రధాన రహదారుల్లో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న 'బ్లాక్ స్పాట్లను' గుర్తించామని సీపీ తెలిపారు. అక్కడ ప్రత్యేక నిఘాతో పాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర డీజీపీ ప్రారంభించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని, పరిసరాలను గమనిస్తూ వాహనం నడిపే 'డిఫెన్సివ్ డ్రైవింగ్' పద్ధతిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ తన విద్యార్థి దశలో ఎదుర్కొన్న అనుభవాలను ఉదాహరణగా చెబుతూ రోడ్డు భద్రత ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరితో రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, డిటివో శ్రీకాంత్ చక్రవర్తి, ఏసీపీలు వెంకటస్వామి, యాదగిరి స్వామి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరా స్వామి, డాక్టర్ సాయిదీప్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నీలం సంపత్, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, వివిధ కళాశాలల విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## క్లస్టర్ స్థాయి సీఎం కప్ క్రీడలకు కార్యాచరణ

**(వుదయం) జనవరి 20 చిగురు మామిడి:**



మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ క్రీడల నిర్వహణకు సంబంధించి గ్రామ, మండల స్థాయి పోటీల కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో క్రీడల నిర్వహణపై విస్తృతంగా చర్చించారు.గ్రామ స్థాయిలో పురుషులు, మహిళలకు కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, కోకో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సీఎం కప్ వెబ్‌సైట్ లింక్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.నమోదు చేసుకున్న క్రీడాకారులకు ఈ నెల 21, 22 తేదీల్లో క్లస్టర్ స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్లస్టర్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి మండల స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో మండల విద్యాధికారి పావని, సూపరింటెండెంట్ ఎన్. ఖాజా మొయినుద్దీన్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, మండల కార్యదర్శి కే. సమ్మయ్య, పీడీలు, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# హరీశ్ రావుపై కక్ష సాధింపు చర్యలు మానాలి

## హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

**హుస్నాబాద్ (వుదయం) జనవరి 20**



హుస్నాబాద్, మాజీ మంత్రి హరీశ్ రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కక్ష సాధింపు చర్యలను తక్షణమే మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. అన్వర్ పాషా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై గొంతెత్తుతున్న బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం అక్రమ కేసులతో వేధిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ, ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇటువంటి కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ నాయకుల గొంతు నొక్కేందుకు రేవంత్ సర్కార్ ప్రయత్నిస్తోందని వారు విమర్శించారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని ధ్వజమెత్తారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటూనే వాస్తవాలు మాట్లాడే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజకీయ కక్ష సాధింపులు విడనాడి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిఆర్ఎస్ పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికారప్రతినిధి సుద్దాల చంద్రయ్య, సీనియర్ నాయకులు బీలు నాయక్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, బూర వెంకన్న గౌడ్, చిత్తారి శ్రీనివాస్, వాల నవీన్, గందే చిరంజీవి, కుడితాటి భాస్కర్, యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, పిట్టల జ్యోతి బాస్, బొల్లి శ్రీనివాస్, పూదరి రవీందర్ గౌడ్, కందుకూరి సతీష్, జేరిపోతుల సునీత తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్స్ ను తిరిగి అప్పగింత



**జయశంకర్ భూపాలపల్లి జనవరి 20(వుదయం జిల్లా ప్రతినిధి):**

పోగొట్టుకున్న మొబైల్స్ ను తిరిగి బాధితులకు అప్పగించినట్లు మహాదేవపూర్ ఎస్సై కే పవన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు మహదేవపూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన కాగితపు కిరణ్, అనే యువకుడు తన ఒప్పో కంపెనీ మొబైల్ ఫోన్ ను, ఎడపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రాజమౌళి అనే వ్యక్తి తన రెడీమి మొబైల్ ను పోగొట్టుకున్నారు. మహదేవపూర్ పోలీస్ స్టేషన్ లో వారు దరఖాస్తు చెయ్యగా, పోలీసు సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ లను గుర్తించి, బాధితులకు అప్పగించినట్లు తెలిపారు.

# జాతీయ విలువిద్య పోటీల్లో సిద్దిపేట ఆణిముత్యం

## కాంస్య పతకం సాధించిన రష్మిత రెడ్డిని అభినందించిన పోలీస్ కమిషనర్

**సిద్దిపేట, జనవరి 20 (వుదయం ప్రతినిధి)**



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో జరిగిన 45వ జూనియర్ జాతీయ విలువిద్య (ఆర్చరీ) పోటీల్లో సిద్దిపేట జిల్లాకు చెందిన క్రీడాకారిణి చిరుకోటి రష్మిత రెడ్డి అద్భుత ప్రతిభ కనబరిచింది. తెలంగాణ జూనియర్ బాలికల జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన ఆమె, తన అమోఘమైన నైపుణ్యంతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. సిద్దిపేట జిల్లా హోంగార్డుల సంఘం అధ్యక్షుడు నరేందర్ రెడ్డి కుమార్తె అయిన రష్మిత రెడ్డి, ఈ పోటీల్లో 621 పాయింట్లు సాధించి రాష్ట్ర కీర్తిని జాతీయ స్థాయిలో చాటిచెప్పింది. ఈ సందర్భంగా మంగళవారంసిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ క్రీడాకారిణిని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రానికి గౌరవం తీసుకువచ్చిన రష్మిత రెడ్డితో పాటు, ఆమెకు మెరుగైన శిక్షణ అందించిన కోచ్ డాక్టర్ రవిశంకర్ కృషిని కమిషనర్ కొనియాడారు. భవిష్యత్తులో రష్మిత మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు.

# సురక్షిత ప్రయాణం.. కుటుంబానికి ధీమా

## నర్మెట్టలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ వివేక్

**నంగునూరు, జనవరి 20 (వుదయం ప్రతినిధి)**



రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారానే ప్రతి వాహనదారుడు సురక్షితంగా ఇంటికి చేరుకుంటారని రాజగోపాల్ పేట్ ఎస్ఐ వివేక్ అన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా సాగుతున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రాణాల కంటే ఏదీ ముఖ్యం కాదని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తమ సొంత రక్షణ కోసమే పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల మీ ప్రాణాలతో పాటు ఇతరుల కుటుంబాలను కూడా రోడ్డున పడేసిన వారవుతారని హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అతివేగంగా ప్రయాణించడం మరియు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వీటిని అరికట్టాలని సూచించారు.చిన్న వయస్సు ఉన్న పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని ఎస్ఐ హితవు పలికారు. ఒకవేళ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రమాద రహిత సిద్దిపేట జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బందితో పాటు వాహనదారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్ లో ఉద్యోగ అవకాశాలు

EMRI గ్రీన్ హెల్త్ సర్వీసెస్‌లో EMT పోస్టులకు ఇంటర్వ్యూలుపెద్దపల్లి జనవరి 20(వుదయం ప్రతినిధి) EMRI గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో 108 అంబులెన్స్ సేవల్లో పనిచేయుటకు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.ఈ ఇంటర్వ్యూలు జనవరి 22, 2026 న ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 2:00 గంటల వరకు నిర్వహించనున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు. ఉండవలసిన అర్హతలు B.Sc (BZC / లైఫ్ సైన్సెస్)B.Sc నర్సింగ్B-ఫార్మసీ ANM / GNMMLT / DMLTవయో పరిమితి :EMT అభ్యర్థులకు 20 నుండి 30 సంవత్సరాలు ఇంటర్వ్యూ స్థలం : మాత శిశు కేంద్రం – పెద్దపల్లిసూపరింటెండెంట్ మీటింగ్ హాల్(2వ అంతస్తు), పెద్దపల్లిఅర్హులైన అభ్యర్థులు తమ విద్యా అర్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ సెట్‌తో నేరుగా హాజరుకావాలని సూచించారు.వివరాలకు సంప్రదించండి :కుమారస్వామి (EME) 91542 48645

# బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికపై హుస్నాబాద్‌లో సంబురాలు

**హుస్నాబాద్ (వుదయం) జనవరి 20**



హుస్నాబాద్, భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా యువ నేత నితిన్ నబిన్ ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ శ్రేణులు మంగళవారం ఘనంగా సంబురాలు నిర్వహించాయి. పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా వెలుగొందుతున్న బీజేపీలో సంస్థాగత ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగడం గర్వకారణమన్నారు.కేవలం 45 ఏళ్ల వయసున్న యువకుడికి జాతీయ పగ్గాలను అప్పగించడం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ అధిష్టానం యువతకు పెద్దపీట వేశారని కొనియాడారు. ఈ మార్పు రాబోయే కాలంలో యువతను పార్టీ వైపు మరింతగా ఆకట్టుకునేందుకు శుభపరిణామమని పేర్కొన్నారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ప్రజలందరికీ రక్షణ, సురక్షితమైన జీవనం లభిస్తోందని ఆయన తెలిపారు. రాబోయే హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి మద్దతు తెలపాలని, కేంద్ర నిధులతో పట్టణాల అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు వేల్పుల నాగార్జున్, బోడిగే వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పోలోజు రాజేందర్ చారీ, కార్యదర్శి బొప్పిశెట్టి సాయిరామ్, కోశాధికారి బుర్ర రాజు పాల్గొన్నారు.
అలాగే కిసాన్ సంఘ్ నియోజకవర్గ ఇన్చార్జి కవ్వ వేణు గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు బొనగిరి రవి, కాయిత అరుణ్ రెడ్డి, కాదాసు నర్సయ్య, ఆశాడపు శ్రీనివాస్, మహిళా మోర్చా నాయకురాలు లకవత్ శారద,ఇల్లెందుల తిరుపతి, కాంసాని లక్ష్మణ్, పోగుల శేఖర్, దొంతరబోయిన సాంబరాజు, బొనగిరి రాజేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.


## వేతనాలు ఇప్పించాలని ఎమ్మెల్యే నాయిని కి వినతి

**హనుమకొండ, జనవరి 20 (వుదయం ప్రతినిధి)**

:హనుమకొండ జిల్లా ఎన్జీవోస్ కాలనీ వాటర్ ట్యాంక్ దగ్గర మంగళవారం రోజున వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అభివృద్ధి పనులకు కొరకై విచ్చేసిన సందర్భంలో స్థానిక వడ్డేపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.మల్లిక వారి ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్.మల్లిక మాట్లాడుతూ... ఎన్.హెచ్.ఎం.లో 78 క్యాడర్స్ లో పని చేస్తున్న తెలంగాణ రాష్ట్రంలో సుమారు 17,541 ఉద్యోగులందరికీ 5నెలల నుండి వేతనాలుఅనగా సెప్టెంబర్, అక్టోబర్,నవంబర్, డిసెంబర్, జనవరి వేతనాలు రాక ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వేతనాలు వస్తేనేకదా ఇంటికిరాయి, ఈ.ఎమ్.లు, పాలబిల్లు, కూరగాయలు, నిత్యవసర వస్తువులు కొనలేక, కట్టలేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. తక్షణమే వేతనాలు విడుదల చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిను ఆమె కోరారు. ఈ సందర్భంగావరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు రావలసిన 5 నెలల వేతనాలు అధికారులను అడిగి తెలుసుకుని ఒక వారం రోజుల్లోపు ఇప్పిస్తానని ఉద్యోగులకు హామీ ఇచ్చారు.

# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..

**జగిత్యాల జనవరి 20 (వుదయం ప్రతినిధి)**




తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వయోవృద్ధుల సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా స్థానిక టిఆర్ నగర్‌లో 1.25 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ వయోవృద్ధుల సదనాన్ని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ వయోవృద్ధులు వికలాంగులు ట్రాన్స్ జెండర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ లతో కలిసి ప్రారంభించారు బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రణం డే కేర్ సెంటర్ ను ప్రారంభించారు ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ వయోవృద్ధుల హక్కులను బాధ్యతలను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యం వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సదనం ప్రణం డే కేర్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు కన్న తల్లిదండ్రులను విస్మరించే లేదా నిర్లక్ష్యం చేసే పిల్లలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు వృద్ధాశ్రమానికి ప్రహరీ గోడ నిర్మాణం కోసం 30 లక్షల రూపాయలు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కోరగా సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ టిఆర్ నగర్‌లో అత్యాధునిక వసతులతో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. వయోవృద్ధులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) బి రాజ గౌడ్ ఆర్డీఓ మధు సూదన్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఇన్చార్జి డిడబ్ల్యూఓ కె రాజ్ కుమార్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకుందాం..

## సిద్దిపేటలో రహదారి భద్రతపై అవగాహన..

## వాహనదారులతో ప్రతిజ్ఞ

**సిద్దిపేట: జనవరి 20 (వుదయం ప్రతినిధి)**



ప్రతి వాహనదారుడు రహదారి నిబంధనలను తన విధిగా పాటించి ప్రమాద రహిత తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సిద్దిపేట ట్రాఫిక్ ఉప నిరీక్షకులు (ఎస్ఐ) గోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు చేపట్టిన 'అరైవ్ అలైవ్' (సురక్షిత ప్రయాణం) కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని విపంచి కూడలివద్ద భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది వాహనదారులతో కలిసి నినాదాలతో కూడిన ఫలకాలను ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ గోపాల్రెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. మత్తులో వాహనంనడుపుతూ మొదటిసారి పట్టుబడితే పదివేల రూపాయల జరిమానా విధిస్తామని, రెండోసారి పట్టుబడితే ఖచ్చితంగా జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. ఇటీవల జరి గిన రోడ్డు ప్రమాదాల్లో మెజారిటీ ఘట నలు మద్యం సేవించి నడపడం వల్లే జరిగాయని గణాంకాలు చెబుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా తల పాగా (హెల్మెట్) ధరించాలని, కార్లు నడిపే వారు సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు. మీ అజాగ్రత్త వల్ల మీ కుటుంబాలురోడ్డున పడకుండా చూసు కోవాల్సిన బాధ్యత మీపైనే ఉందని గుర్తు చేశారు. అనంతరం వాహనదారులందరితో కలిసి రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఉమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు

**పెద్దపల్లి జనవరి 20 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ తో కలిసి రోడ్డు ప్రమాదాల నియంత్రణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ ప్రమాదాల నియంత్రణ కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రోడ్డు పై వాహనాల వేగాన్ని తగ్గించేందుకు అవసరమైన మేర స్ప్రింక్లర్స్ , స్పీడ్ బ్రేకర్ లు ఏర్పాటు చేయాలని అన్నారు. రోడ్డు పై పశువులు విడిచిపెట్టే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ 10 వేల రూపాయల జరిమానా విధించాలని, పశువులను గోశాలలకు తరలించాలని అన్నారు. జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధాన రోడ్లపై మధ్యలో ఆర్టీసీ బస్సులు ఆపకుండా సంబంధిత బస్ స్టాప్ ల వద్ద మాత్రమే ఆపేలా చూడాలని అన్నారు. హెచ్.కే.ఆర్ సిబ్బంది మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పెద్దపల్లి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన మేర రొడ్డు విస్తరణ కు చర్యలు తీసుకోవాలని అన్నారు. డివైడర్ లను పరిశీలించి అక్కడ ప్రమాదాల జర్గకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రోడ్ల పై కేజీ వీల్స్ తో ప్రయాణించే ట్రాక్టర్లు, ఇతర వాహనాల పై ట్రాఫిక్ పోలీస్ అధికారులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తూ భారీ జరిమానాలు విధించాలని, జరిమానా విధించిన తర్వాత కూడా కేజీ వీల్స్ వాడుతున్న వాహనాలను సీజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కేజీ వీల్స్ వాడుతున్న వాహనాలకు జారీ చేసిన జరిమానాలను పూర్తి స్థాయిలో వసూలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. గత సంవత్సరం జరిగిన ప్రమాదాల పై రిపోర్ట్ ఆధారంగా పట్టణ ప్రాంతాలలో రోడ్డు స్ట్రిప్స్ , రేడియం స్టిక్కరింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. టౌన్ లో ట్రాఫిక్ నియంత్రణ కోసం యూ టర్న్ ల పై సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల పై విస్తృతప్రచారంకల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. హిట్ అండ్ కేసుల బాధితులకు నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదనలు త్వరగా పంపాలని కలెక్టర్ పోలీస్ అధికారులకు సూచించారు.

# మున్సిపల్ కార్మికుల ఆకలి కేకలు.. మూణ్నెళ్ల జీతాలు ఏవి?

**గజ్వేల్: జనవరి 20 (వుదయం ప్రతినిధి)**



పట్టణాన్ని శుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యం కోసం శ్రమిస్తున్న మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు అందకపోవడాన్ని నిరసిస్తూ, మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.పస్తులుంటున్న కార్మిక కుటుంబాలుఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఆపడం అమానుషమని అన్నారు. సాంకేతిక కారణాల పేరుతో వేతనాలు చెల్లించకుండా కాలయాపన చేయడం వల్ల పండగ పూట కూడా కార్మిక కుటుంబాలు పస్తులుండాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని మురికివాడలు, మురికి కాలువలను శుభ్రం చేసే కార్మికుల పట్ల అధికారులు చులకన భావం వీడాలని హితవు పలి కారు.ప్రధాన డిమాండ్లు బకాయి పడిన మూడు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలి. కార్మికులందరికీ ఈఎస్ఐ (ESI), పీఎఫ్ (PF) సౌకర్యాలు కల్పించాలి. 'సమాన పనికి సమాన వేతనం' అమలు చేయడంతో పాటు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలి.విధుల బహిష్కరణ హెచ్చరిక:జీతాల సమస్యను వెంటనే పరిష్కరించకపోతే మున్సిపల్ కార్మికులందరూ విధులను బహిష్కరించి జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఎల్లయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరి, కనకయ్య, కనకరాజు, సురేందర్, చంద్రం,బాలస్వామి,సాయిలు, స్వామి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి వెన్నెముక: కొమ్ము విజయ్‌కుమార్

## పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## జగదేవ్‌పూర్‌లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడికి ఘనస్వాగతం

**జగదేవ్‌పూర్, జనవరి 20 (వుదయం ప్రతినిధి)**



కష్టపడి పనిచేసే కార్యకర్తలు ఉన్నప్పుడే ఏ రాజకీయ పార్టీ అయినా మనుగడ సాగిస్తుందని, కార్యకర్త లేనిదే పార్టీ లేదని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ము విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన భువనగిరి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో జగదేవ్‌పూర్ వద్ద ఆగి స్థానిక కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదల పక్షాన ఉంటుందని, పార్టీ కోసం నిరంతరం శ్రమించే ప్రతి కార్యకర్తను ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుకుంటుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజారంజక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గడపకూ చేరవేయాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందని పిలుపునిచ్చారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రతన్, పైస స్వామి, రమేష్, సాయిలు, బాల పోచయ్య, విజయకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 23న జాబ్ మేళా నిర్వహణ..

## జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్

**పెద్దపల్లి, జనవరి -20 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలోని నిరుద్యోగ యువకులకు కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు జనవరి 23 శుక్రవారం రోజున రూమ్ నెంబర్ 233 నూతన కలెక్టర్ భవన సముదాయంలో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో మొత్తం 67 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, సేల్స్ ఎగ్జిక్యూటివ్ 60, ఫీల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్స్ 4, హెచ్ఆర్ 2, ఆఫీస్ బాయ్ 1 పోస్ట్ లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సేల్స్ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లమా, ఫీల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఉద్యోగాలకు అగ్రికల్చర్ బీఎస్సీ, హెచ్ఆర్ ఉద్యోగాలకు ఎంబీఏ ,ఆఫీస్ బాయ్ పోస్ట్ లకు పదవ తరగతి, విద్య అర్హతలు కలిగిన వారు అర్హులు ఆసక్తి ఉన్నవారు జనవరి 23న ఉదయం 11 గంటల కు సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో Room No.233 నూతన కలెక్టర్ భవన సముదాయంలో, పెద్దకాల్వల పెద్దపల్లి మొదటి అంతస్థులో వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9908674056, 8985336947, 8121262441 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి రాజశేఖర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# బక్రి చెప్యాల జెడ్పీ హైస్కూల్‌లో సాంఘిక శాస్త్ర ప్రయోగశాల అభివృద్ధి



**వుదయం, సిద్దిపేట ప్రతినిధి, జనవరి 20:**

సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు సామాజిక చైతన్యం ఎక్కువగా ఉంటుందని సిద్ధిపేట జిల్లా సిద్ధిపేట అర్బన్ మండలం బక్రి చెప్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దారం నాగేందర్ రెడ్డి అన్నారు. బక్రి చెప్యాల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంఘిక శాస్త్ర ప్రయోగ శాలకు విశ్రాంత ఉపాధ్యాయుడు కోదూరి సుధాకర్ మంగళవారం వంద మంది జాతీయ నాయకుల చిత్ర పటాలను అందించారు. ఈ సందర్భంగా బక్రి చెప్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దారం నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ కోదూరు సుధాకర్ ఉద్యోగ విరమణ చేసినప్పటికీ వివిధ సామాజిక సమస్యలపై స్పందిస్తున్నారని తెలిపారు. విశ్రాంత ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమం కొరకు కోదూరు సుధాకర్ కృషి చేస్తున్నారని చెప్పారు. తమ పాఠశాలలోని సాంఘిక శాస్త్ర ప్రయోగశాల కోసం వంద మంది జాతీయ నాయకుల చిత్ర పటాలను సుధాకర్ అందివ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.విశ్రాంత ఉపాధ్యాయుడు కోదూరి సుధాకర్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడానికి ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైందన్నారు. విద్యార్థులు సామాజిక అంశాల పట్ల స్పందించే తత్వాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. సమకాలీన అంశాలపై సమగ్ర సమాచారాన్ని అందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా రూపొందించి సమాజాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. బక్రి చెప్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పూర్ణ చందర్ రావు మాట్లాడుతూ నేటి కాలంలో సాంఘిక శాస్త్రం ఆవశ్యకత గణనీయంగా పెరిగిందన్నారు. సాంఘిక శాస్త్ర బోధన ద్వారా సామరస్య, సహన పూరిత, ఆదర్శ సమాజ స్థాపన సాధ్యమవుతుందని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేటు విద్యా సంస్థల్లో సాంఘిక శాస్త్ర బోధనను నిర్లక్ష్యం చేయడం వల్ల సమాజంలో సామాజిక స్పృహ తగ్గుతోందని అభిప్రాయపడ్డారు. పాఠశాలకు ఆదర్శ నాయకుల చిత్ర పటాలను అందించిన విశ్రాంత ఉపాధ్యాయుడు కోదూరి సుధాకర్ ను ఈ సందర్భంగా సన్మానించారు.

# పురపాలక ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలి:

## రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణి కుముదిని

**కరీంనగర్, జనవరి 20, (వుదయం ప్రతినిధి):**



పురపాలక ఎన్నికల నిర్వహణకు జిల్లాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసి సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణి కుముదిని అన్నారు.మున్సిపల్ ఎన్నికల సన్నద్ధత పై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణి కుముదిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్ తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ త్వరలో కమిషన్ విడుదల చేస్తుందని, షెడ్యూల్ రాగానే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, పురపాలక ఎన్నికల నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ పరిశీలన, పోలింగ్ నిర్వహణ కౌంటింగ్ కు అవసరమైన అన్ని ఏర్పాట్లు ప్రణాళిక బద్ధంగా సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద చురుగ్గా ఉండే భద్రత సిబ్బంది నియమించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ సౌకర్యం ఉండాలని, ప్రతి పోలింగ్ కేంద్రం బయట సిసి కేమేరా తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి సోషల్ ఎలిమెంట్స్ ను బైండోవర్ చేయాలన్నారు. ఎన్నికల ప్రచార పరిశీలన, కౌంటింగ్ కేంద్రాలు పోలింగ్ కేంద్రాల వద్ద సాధ్యమైన మేర డ్రోన్ వినియోగించాలని సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి మాస్టర్ ట్రైయినర్లు జిల్లాకు చేరుకుంటారని, సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో 3 మున్సిపాలిటీలు, 1 మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎన్నికలకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పూర్తి పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్న వసతుల వివరాలు టి- పోల్ లో నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అవసరమైన మేర పోలింగ్ బ్యాలెట్ బాక్సులు, అవసరమైన పోలింగ్ సిబ్బంది సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, ఇతర సిబ్బంది సిద్ధం చేసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలి కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్, బయట సీసీ కెమెరా ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను గుర్తించామన్నారు.

# ఆడబిడ్డల ఆత్మగౌరవమే ప్రభుత్వ ధ్యేయం: కలెక్టర్

## దుబ్బాకలో వైభవంగా ఇందిరమ్మ చీరల పంపిణీ.. 11,105 మందికి లబ్ధి

**సిద్దిపేట/దుబ్బాక, జనవరి 20 (వుదయం ప్రతినిధి)**



మహిళలు ఆర్థికంగా బలపడి, సమాజంలో తలెత్తుకు జీవించాలన్నదే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని, వారి గౌరవం పెరిగేలా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి స్పష్టం చేశారు. మంగళవారం దుబ్బాక ఐఓసీ ప్రాంగణంలో జరిగిన 'ఇందిరా మహిళా శక్తి' సంబరాల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, పట్టణ మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సంక్షేమ ఫలాలు అర్హుల ఇంటికి చేరుతున్నాయని తెలిపారు. ఇప్పటికే 26 వేల కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, పాత కార్డుల్లో 79 వేల పేర్లను అదనంగా చేర్చామని వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు కోట్లాది రూపాయల ఆదా జరిగిందన్నారు. సొంతిల్లు లేని నిరుపేదల కలను నిజం చేస్తూ, దుబ్బాక నియోజకవర్గంలో తొలి విడతలో 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, మరో 3500 ఇళ్లను ఏప్రిల్ నెలలో రెండో విడత కింద మంజూరు చేస్తామని కలెక్టర్ ప్రకటించారు. జిల్లాలో ఇప్పటికే 12,500 ఇళ్లు మంజూరవగా, 80 శాతం పనులు మొదలయ్యాయని, నిధులు కూడా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. గతంలో గ్రామీణ మహిళలకు చీరలు అందించగా, నేడు దుబ్బాక పట్టణంలోని 11,105 మంది మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. "కేవలం గ్రూపుల్లో ఉన్నవారికే చీరలు ఇస్తారని అపోహ వద్దు.. 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హులైన మహిళకు వార్డుల వారీగా ఇందిరమ్మ చీర అందుతుంది," అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, ఏఎంసీ చైర్మన్ కొంగర రవి, అడిషనల్ డీఆర్డీవో సుధీర్, మెప్మా పీడీ హనుమంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 31లోపు దివ్యాంగులు ఉపకరణాల కోసం ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలి

**పెద్దపల్లి, జనవరి 20 (వుదయం ప్రతినిధి)**

జనవరి 20 నుంచి జనవరి 31 వరకు దివ్యాంగులు ఉపకరణాల కోసం ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి పి.వేణు గోపాల్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి జిల్లాలోని దివ్యాంగుల సౌకర్యార్థం సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునీకరించిన ఉపకరణాలతో పాటు సాంప్రదాయకమైన ఉపకరణాలను రాష్ట్ర ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో అర్హులైన దివ్యాంగులకు బ్యాటరీ వీల్ చైర్స్ ,లాప్ టాప్స్,ట్యాబ్ మొబైల్ బిజినెస్ బ్యాటరీ, ట్రై సైకిల్స్ ఉచితంగా పంపిణీ చేయుటకు తెలంగాణా వికలాంగుల సహకార సంస్థ, హైదరాబాదు వారి ద్వారా అందించుటకు ఆదేశాలు జారీ చేయబడ్డాయని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. పెద్దపల్లి జిల్లా లోని దివ్యాంగులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు https://tsobmms.cgg.gov.in/ / అను వెబ్ సైట్ నందు జనవరి 31 లోపు అన్ని ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన దివ్యాంగులకు ఉచితముగా ఉపకరణాలు పంపిణి చేయడం జరుగుతుందని జిల్లా సంక్షేమ అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# జాతీయ ఓటర్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్

**కరీంనగర్, జనవరి 20, (వుదయం ప్రతినిధి):**



ఈనెల 25న నిర్వహించనున్న జాతీయ ఓటర్ దినోత్సవం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకల నిర్వహణపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని బూత్ స్థాయి పోలింగ్ అధికారులు నూతన ఓటర్లకు ఓటర్ కార్డుల పంపిణీ, వృద్ధ ఓటర్లకు సన్మానం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామం, వార్డు స్థాయిలో ఓటరు ప్రతిజ్ఞ చేయాలన్నారు. 25న కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఓటు హక్కు, ఓటు ప్రాధాన్యత, ఆవశ్యకతపై తదితర అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన వంటి పోటీలను నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

# భోజనం బాగుందా.. చదువు ఎలా సాగుతోంది

## మధ్యాహ్న భోజనంపై ఆకస్మిక తనిఖీ

## ప్రజ్ఞాపూర్ స్కూల్ విద్యార్థులతో కలెక్టర్ హైమావతి ముచ్చట్లు

**సిద్దిపేట/గజ్వేల్, జనవరి 20 (వుదయం ప్రతినిధి)**



పాఠశాల విద్యార్థులకు అందించే చదువు, మధ్యాహ్న భోజనం విషయంలో అస్సలు రాజీ పడొద్దని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. కలెక్టర్ నేరుగా పాఠశాలలోని వంటగదికి వెళ్లి ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ఆ రోజు వండిన బీరకాయ పప్పు, సాంబారును పరిశీలించారు. "పిల్లలకు పెట్టే భోజనం రుచిగా ఉండాలి. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ (కామన్ డైట్) ప్రకారం రోజూ వంటలు చేయాలి," అని వంట సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. తరగతి గదిలోని విద్యార్థులతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. "ఉదయం ఏం తిన్నారు? మధ్యాహ్న భోజనం ఎలా ఉంటోంది? సిలబస్ ఎంత వరకు అయ్యింది?" అని ఆరా తీశారు. దీనికి విద్యార్థులు స్పందిస్తూ ఉదయం రాగి జావ తాగాం మేడమ్.. మీరు స్కూళ్లను పర్యవేక్షిస్తున్నప్పటి నుంచి మాకు భోజనం చాలా బాగుంటోంది. సిలబస్ కూడా సగం పూర్తయ్యింది," అని సంతోషంగా చెప్పారు. విద్యార్థులు సమయాన్ని వృధాచేయకూడదు. జీవితంలో ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని పెట్టుకుని బాగాచదువుకోవాలి.పాఠశాలలోని కిచెన్ గార్డెన్ బాగుంది, పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలి.చదువు, భోజనం నాణ్యత విషయంలో ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ బాధ్యతగా వ్యవహరించాలి.

# చేర్యాలలో వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ

**సిద్దిపేట/చేర్యాల, జనవరి 20 (వుదయం ప్రతినిధి)**



మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే కుటుంబాలు బాగుంటాయని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. మంగళవారం చేర్యాల పట్టణంలోని కళ్యాణి గార్డెన్‌లో జరిగిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కులను మరియు మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు.గతంలో ఇదే వేదికపై ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు ఇచ్చామని గుర్తు చేస్తూ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిని కలెక్టర్ వివరించారు. జిల్లావ్యాప్తంగా 12,500 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటికే 9,500 ఇళ్ల నిర్మాణం మొదలైందని దీనికోసం 137 కోట్లు ఖర్చు చేశామన్నారు. కొత్తగా 26,721 రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు పాత కార్డుల్లో 74 వేల మంది పేర్లు చేర్చామని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా గ్యాస్ సిలిండర్ల కోసం 45 కోట్లు, గృహజ్యోతి ఉచిత విద్యుత్ కోసం 196 కోట్లు, రైతు భరోసా కింద 355 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి 240 కోట్లు చెల్లించామన్నారు.
18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ చీర గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే చీరలు ఇచ్చామని నాణ్యత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే పట్టణాల్లో కాస్త ఆలస్యమైందని తెలిపారు. కేవలం సంఘాల్లో ఉన్నవారికే కాకుండా 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి మహిళకూ చీరలు అందుతాయని స్పష్టం చేశారు. డ్వాక్రా సంఘాలకు ఆర్థిక చేయూత పట్టణాల్లోని 1,058 సంఘాలకు 3 కోట్ల 74 లక్షల వడ్డీ లేని రుణాలు అందించామన్నారు. కార్యక్రమంలో భాగంగా చేర్యాల పట్టణంలోని 49 సంఘాలకు మెప్మా ద్వారా మంజూరైన రూ. 10,05,977 విలువైన చెక్కును మహిళలకు అందించారు.
ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, ఏఎంసీ చైర్మన్ నల్ల నాగుల శ్వేత, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

# విప్లవ రచయితల సంఘం (విరసం) 30వ మహాసభలను విజయవంతం చేయండి

## కరపత్రం ఆవిష్కరించిన ప్రజా సంఘాల నాయకులు

**పెద్దపల్లి జనవరి 20 (వుదయం ప్రతినిధి)**




ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే విప్లవ రచయితల సంఘం (విరసం) 30వ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమార స్వామి కోరారు.జిల్లా కేంద్రం లోని అమరవీరుల స్తూపం వద్ద ప్రజా సంఘాల నాయకులతో కలిసి మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విరసం, CLC నేతలు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా విప్లవోద్యమ దశలన్నింట్లో విరసం చురుగ్గా పని చేస్తోందన్నారు. నక్సల్బరీ, శ్రీకాకుళం రైతాంగ పోరాటాలు వసంత మేఘగర్జన వెలుగులో పుట్టిన విరసం భావజాల సాంస్కృతిక రంగాల్లో వర్గ పోరాట రాజకీయాలను కొనసాగిస్తోందని అన్నారు.సమాజంలో నెలకొన్న సామాజిక అసమానతలు, కులం, మత పీడనలకు వ్యతిరేకంగా వివిధ కళారూపాలు, కథలు, కవిత్వం, నవలలు, సాహిత్యం ద్వారా దీర్ఘకాల ప్రజాపంథా, వర్గ పోరాట ఆవశ్యకతను ప్రజలకు తెలియజేస్తున్నదని అన్నారు.సాంస్కృతిక, భావజాల దాడులు ప్రజలను మభ్యపెట్టడం కులం, మత ప్రతిపాదికనా విభజించడం.ఆర్థిక వ్యూహాలు ప్రజలకు డబ్బులిచ్చి ఉద్యమ నిర్మాణాలకు వ్యతిరేకంగా నిర్మాణాలను అభివృద్ధి చేయడం.రాజకీయ కుట్రలు దళారీ నాయకత్వాన్ని తీసుకురావడం.ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలు మేధావులపై నిర్బంధం, నిరసనకారులపై దాడులు వంటి చర్యలతో ప్రభుత్వం ప్రజలపై యుద్ధం చేస్తున్నదని ఆరోపించారు.ఈ సందర్భంలో విరసం తన 30 వ మహాసభలను నిర్వహిస్తున్నదని ప్రముఖ తమిళ రచయిత్రి సుకీర్త రాణి, కేరళ మార్క్సిస్ట్ నాయకులు అజిత్, ప్రొఫెసర్ కాశీం (OU) ప్రొఫెసర్ సరోజ్ గిరి (ఢిల్లీ యూనివర్సిటీ) నర్ల రవి, ప్రొఫెసర్ హరగోపాల్, కళ్యాణ్ రావు, సీమా ఆజాద్, పాణి వక్తలుగా పాల్గొంటున్నా ఈ మహాసభలకు పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధా వులు, కవులు, కళాకారులు, మహిళా, విద్యార్థి, యువత అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో1) పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమార్ స్వామి 2) విప్లవ రచయితల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య 3) దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడీ సుదర్శన్ 4) పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్ల కమిటీ సభ్యులు బండారి రాజలింగు, బండి శంకర్, శ్రీపతి రాజగోపాల్, నక్క సత్య నారాయణ 5) పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య కార్యవర్గ సభ్యులు కే రాజు కే అంజన్న 6) రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెల్తురు సదానందం 7) TASK రాష్ట్ర నాయకులు ఐత బాపు, ప్రజా సంఘాల నాయకులు మల్లేశం8) AIFTU జిల్లా నాయకులు కోరేపు మల్లేశంతదితరులు పాల్గొన్నారు

# మాజీ సర్పంచ్ ను పరామర్శించిన పలువురు నాయకులు

## ఆర్థిక సహాయం అందించిన చిట్టి దేవేందర్ రెడ్డి

**వుదయం న్యూస్ కొండపాక ప్రతినిధి జనవరి 20**



మండల పరిధిలోని వెలికట్ట గ్రామ మాజీ సర్పంచ్ అమ్ముల రమేష్ బాబు భార్య శిరీష గత మూడు సంవత్సరాలుగా అనారోగ్యానికి గురై సోమవారం సాయంత్రం సిద్దిపేటలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి వెలికట్ట గ్రామానికి చేరుకొని మాజీ సర్పంచ్ రమేష్ భార్య మృతదేహానికి పూలదండ వేసి సంతాపాన్ని తెలుపుతూ పదివేల రూపాయలు అందించారు. మృతదేహాన్ని సందర్శించిన వారిలో బీఆరెస్ పార్టీ నాయకులు నూనె కుమార్ యాదవ్, ర్యాగాళ్ల దుర్గయ్య, దేవి రవీందర్ ,వెలికట్ట మాజీ ఎంపిటిసి సాయిబాబా గౌడ్ఉన్నారు. ఈ కార్యక్రమంలో వెలికట్ట సర్పంచ్ బూరుగుల మానస సురేందర్ రావు, కొండ్ర రవి తదితరులు పాల్గొన్నారు.

# 27లోపు ఆలస్య రుసుము తో పదవ తరగతి పరీక్ష ఫీజులు చెల్లించాలి..

## జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద

**పెద్దపల్లి, జనవరి-20 (వుదయం ప్రతినిధి)**

జనవరి 27 లోపు ఆలస్య రుసుము తో పదవ తరగతి పరీక్ష ఫీజులు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2026 లో జరిగే పదవ తరగతి, ఓపెన్ పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, ఫెయిల్ అయిన అభ్యర్థుల కోసం పరీక్షా ఫీజ్ ఆలస్య రుసుము 1000 రూపాయలతో కలిపి చెల్లించేందుకు జనవరి 27 వరకు మాత్రమే అవకాశం ఉంటుందని అన్నారు .మార్చి 2026: హాలో జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు నమోదు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు హాజరు కావడానికి అర్హులని, అందువల్ల పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కావాలనుకునే ఫెయిల్ అయిన అభ్యర్థులు రెగ్యులర్ స్ట్రీమ్ అభ్యర్థులు చివరి అవకాశాన్ని ఉపయోగించుకొని నిబంధనలు ప్రకారం అవసరమైన రసమును చెల్లించి మార్చిలో జరిగే పరీక్షకు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పూజల హరికృష్ణను పరామర్శించిన మంత్రి వివేక్ వెంకట స్వామి

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి, జనవరి 20:**



సిద్దిపేట నియోజక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గౌ. పూజల హరికృష్ణ, నిన్న మధ్యాహ్నం స్వల్ప అస్వస్థతకు గురై సిద్దిపేట పట్టణంలోని లోహిత్ సాయి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంత్రి గౌ. వివేక్ వెంకట స్వామి, స్వయంగా హాస్పిటల్ కు చేరుకుని హరికృష్ణ, పరామర్శించారు. ఈ సందర్భంగా హరికృష్ణ, ఆరోగ్య పరిస్థితిపై అక్కడి వైద్యులను అడిగి మంత్రి, వివరాలు తెలుసుకున్నారు. ఆయనకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందించాలని అధికారులకు సూచించారు. హరికృష్ణ, త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని ఆరోగ్యంగా బయటకు రావాలని మంత్రి గారు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.ఈ పరా మర్శ కార్యక్రమంలో మంత్రి, తో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని హరికృష్ణ, ధైర్యం చెప్పి అండగా నిలిచారు. హరికృష్ణ, త్వరగా కోలుకొని మళ్లీ ప్రజాసేవలో చురుగ్గా పాల్గొనాలని వారు ఆకాంక్షించారు.

# స్కూల్ గోడలపై సామాజిక సందేశాలతో ఆకట్టుకుంటున్న గరిపల్లి విజయకుమార్




**వుదయం, సిద్దిపేట ప్రతినిధి, జనవరి 20:**

సిద్దిపేట పట్టణ పరిధిలోని రెండో వార్డు నర్సాపూర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గోడలు ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పనిగా భావిస్తే అది పొరపాటే. ఈ పాఠశాల గోడలపై ఉన్న అందమైన, ఆహ్లాదకరమైన పెయింటింగ్స్ అన్నీ నర్సాపూర్‌కు చెందిన గరిపల్లి విజయకుమార్ తన సొంత ఖర్చులతో వేసి, పాఠశాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారు.పిల్లలు, తల్లిదండ్రులు, ప్రజలకు అవగాహన కల్పించేలా "బాల్యవివాహాలు అరికడదాం", "చదువు మన జీవితానికి దారి చూపుతుంది", "ప్లాస్టిక్‌ను వదిలేద్దాం", "జలమే జగతి మూలాధారం", "ఏబీసీడీలు" వంటి సామాజిక, విద్యా సంబంధిత సందేశాలతో స్కూల్ గోడలపై వివిధ రకాల చిత్రాలు, పెయింటింగ్స్‌ను అందంగా రూపొందించారు. ఈ బొమ్మలు చూసిన వారిని ఆకట్టుకుంటూ, అవగాహన కల్పించేలా ఉన్నాయి.త్వరలో పాఠశాల మొత్తం ప్రహరీ గోడ చుట్టూ కూడా ఇదే విధంగా ఎవరూ దుర్వినియోగం చేయకుండా, విద్యా సందేశాలతో అలంకరించనున్నట్లు గరిపల్లి విజయకుమార్ తెలిపారు.ప్రస్తుతం ఈ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 116 మంది విద్యార్థులు చదువుతున్నారు. స్కూల్ గోడలకు అందమైన రూపం తీసుకురావడంతో పాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందించిన గరిపల్లి విజయకుమార్ సేవను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ప్రశంసించారు. ఈ సందర్భంగా రెండో వార్డు కౌన్సిలర్ నాయిని చంద్రం ఈ కార్యక్రమంపై ఆనందం వ్యక్తం చేస్తూ, ఇలాంటి సేవలు మరింత మందికి ఆదర్శంగా నిలవాలని అన్నారు.

# జనవరి 23న ఇన్నోవేషన్ పంచాయత్ కార్యక్రమ నిర్వహణ... జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, జనవరి-20(వుదయం ప్రతినిధి)**

జనవరి 23న ఇన్నోవేషన్ పంచాయత్ కార్యక్రమాన్ని కరీంనగర్ లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలు, అంకురాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్న తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ (టిజిఐసి), 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమాన్ని కరీంనగర్ ప్రాంతానికి విస్తరిస్తోందని అన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, ఆవిష్కర్తలు, వ్యవస్థాపకుల కోసం జనవరి 23, 2026 న ఉదయం 10 గంటలకు కరీంనగర్ ఐటీ టవర్ లో జరగనుందని తెలిపారు. పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల, భూపాలపల్లి, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల నుండి ఆవిష్కర్తలను, వ్యవస్థాపకులను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమం ఆవిష్కర్తలకు, వారికి అవసరమైన తోడ్పాటుకు మధ్య ఉన్న భౌగోళిక దూరాన్ని తగ్గించడానికి రూపొందించిన ఒక ప్రత్యేకమైన వేదిక. తమ ఆలోచన, ఆవిష్కరణ లేదా పారిశ్రామిక ప్రయాణం గురించి సందేహాలు ఉన్న ఏ వ్యక్తికైనా, రాష్ట్రంలోని వ్యవస్థాపక నిపుణుల నుండి వ్యక్తిగత, మార్గదర్శకత్వం మరియు సలహాలు పొందేందుకు ఇది ఒక గొప్ప అవకాశమని అన్నారు.రాష్ట్ర రాజధాని వెలుపల ఉన్న వ్యవస్థాపకులు, ఆవిష్కర్తలకు వనరులు సమానంగా అందుబాటులో ఉండేలా, తక్షణ మరియు స్పష్టమైన సహాయాన్ని అందించడానికి ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దాము. జనవరి 23న జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు, నిపుణులతో నేరుగా చర్చించవచ్చు. వ్యాపారం లేదా సాంకేతిక సవాళ్లను అక్కడికక్కడే (on-the-spot) పరిష్కరించడానికి మార్గదర్శకత్వం, ఆలోచన ధ్రువీకరణ, నమూనా అభివృద్ధి (prototype development), వ్యాపారాన్ని విస్తరించే (scaling) ప్రక్రియపై సలహాలు, మరియు ప్రభుత్వ కార్యక్రమాలు, ఇంక్యుబేషన్ సహాయా న్ని నేరుగా పొందడానికి కనెక్షన్‌లను సులభతరం చేసే అవకాశం ఉంటుం దని అన్నారు.

# మంథని గోదావరినది తీరంలోని హనుమాన్ దేవాలయంలో కొండచిలువ ప్రత్యక్షం

**మంథని:**



మంథని పట్టణంలోని గోదావరి నది తీరంలో గల హనుమాన్ దేవాలయంలో మంగళవారం కొండచిలువ ప్రత్యక్షమైంది. దేవాలయ పూజారి భీమ్ రావు రోజువారి నిత్య కార్యక్రమాల్లో భాగంగా గర్భగుడిలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా కొండచిలువ కనబడడంతో పూజారితో పాటు భక్తులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఆటో డ్రైవర్లు, కొంతమంది యువకులు ఎంతో చాకచక్యంతో ఆ కొండచిలువను బంధించి గోదావరినది ఒడ్డుకు కొంత దూరంలో వదిలిపెట్టారు.ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పిలుచుకున్నారు. గోదావరి నది పరిసర ప్రాంతంలోనే పెద్ద కొండచిలువలు సంచరిస్తూ పిల్లలు పెట్టినట్లు అక్కడి ప్రజలు భావిస్తున్నారు.

# చక్కని ఆరోగ్యం

# ప్రోటీన్ లోపం షుగర్ వస్తుందంట..

మనం ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి సరైన పోషకాలు అవసరం. సమతుల్య ఆహారం తీసుకుంటేనే సరైన పోషకాలు లభిస్తాయి. శరీరంలో ఏ ఒక్క పోషకం



తగ్గినా అనేక సమస్యలు వస్తాయి. అలాంటి పోషకాల్లో ఒకటి ప్రోటీన్. ఇది తీసుకోవడం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. ప్రోటీన్ మన శరీర నిర్మాణానికి అవసరమైన పదార్థం. కండరాల్ని నిర్మించడానికి, మరమ్మత్తు చేయడానికి.. హార్మోన్లు, ఎంజైమ్‌లను ఉత్పత్తి చేయడానికి, రోగనిరోధక శక్తిని బలంగా ఉంచడానికి ప్రోటీన్ చాలా అవసరం. అందుకే నిపుణులు ఎల్లప్పుడూ ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని తినాలని సిఫార్సు చేస్తారు. అయితే ప్రోటీన్ లోపం వల్ల శరీరంలో ఎన్నో సమస్యలు తలెత్తుతాయి.

శరీరంలోని కొన్ని సమస్యలు ప్రోటీన్ లోపాన్ని సూచిస్తాయని వివరిస్తూ డాక్టర్ సాకేత్ గోయల్ ఇన్స్టాగ్రామ్ వీడియోను పోస్ట్ చేశారు.ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నివేదిక ప్రకారం.. భారతదేశంలోని ప్రతి వ్యక్తికి వారి ఆహారంలో 30 నుంచి 50 శాతం ప్రోటీన్ లోపం ఉంది. ఇది పరిష్కరించడం చాలా ముఖ్యం. ప్రతి వ్యక్తి శరీర బరువులో కిలోగ్రాముకు ఒక గ్రాము ప్రోటీన్ అవసరం. దీని అర్థం ఎవరైనా 70 కిలో గ్రాముల బరువు ఉంటే, వారికి రోజుకు సుమారు 70 గ్రాముల ప్రోటీన్ అవసరం.అథ్లెట్లు, బాడీబిల్డర్లు లేదా బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్న వారికి, ఈ మొత్తం ఇంకా ఎక్కువగా ఉండవచ్చు. తగినంత ప్రోటీన్ తీసుకోకపోవడం వల్ల బలహీనత, కండరాల నష్టం, రోగనిరోధక శక్తి తగ్గుతుంది. జిమ్‌కి వెళ్లి వ్యాయామం చేసేవారికి ఎక్కువ ప్రోటీన్ అవసరం. ఇంకా, 50 ఏళ్లు పైబడిన వారు కూడా ప్రతిరోజూ శరీర బరువులో ప్రతి పౌండ్‌కి 1.2 నుంచి 1.5 గ్రాముల ప్రోటీన్ తీసుకోవాలని డాక్టర్ సాకేత్ గోయల్ వివరించారు. దీని అర్థం వారికి 90-100 గ్రాముల ప్రోటీన్ అవసరం. ఈ అవసరం తీర్చడం కష్టం. ఇది శరీరంలో ప్రోటీన్ లోపానికి దారితీస్తుంది. శరీరంలో ప్రోటీన్ లేకపోవడం వల్ల కండరాల బలహీనత ఏర్పడుతుంది. ఇది సార్కోపెనియాకు దారితీస్తుంది. ఇక్కడే వయస్సు పెరిగే కొద్దీ కండర ద్రవ్యరాశి తగ్గుతుంది. నిలబడే సామర్థ్యం తగ్గుతుంది. శరీర బలం తగ్గుతుంది. గాయాల ప్రమాదాన్ని పెంచుతుంది.ప్రోటీన్ లేకపోవడం వల్ల కండరాలు మాత్రమే కాకుండా ఎముకలు కూడా బలహీన పడతాయి. గాయాల సమయంలో ఎముకలు విరిగిపోయే ప్రమాదం పెరుగుతుంది. ప్రోటీన్ లోపం వల్ల తరచుగా అనారోగ్యాలు, ఇన్ఫెక్షన్లు వస్తాయి. శరీరం యొక్క రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. అందుకే ఈ సమస్యలు వస్తాయి.శరీరం యొక్క రక్షణ విధానాలు మందగిస్తాయని డాక్టర్ చెబుతున్నారు. దీని వల్ల గాయాలు, ఆపరేషన్ చేసిన తర్వాత కోలుకోవడం కష్టమవుతుంది. ఈ కారణాలన్నింటికీ ప్రోటీన్ లోపం కారణం.ప్రోటీన్ లోపం వల్ల శరీరంలో వాపు వస్తుంది. శరీర నొప్పులు అలాగే ఉంటాయి. అంతేకాకుండా శరీరం బలహీనంగా ఉంటుంది. ఈ లక్షణాల్ని నిర్లక్ష్యం చేయకూడదని డాక్టర్ అంటున్నారు.

# బరువు తగ్గాలా.. రాత్రి ఒక్క డ్రింక్ తాగి చూడండి

అధిక బరువు ఉంటే ఎన్నో సమస్యలొస్తాయి. కొలెస్ట్రాల్ పెరగడం దగ్గర్నుంచీ ఫ్యాటీ లివర్, గుండె సమస్యలు ఇలా ఎన్నో సమస్యలు వస్తాయి. అందుకే, అధిక బరువుని తగ్గించుకోవాలి. దీనికోసం సరైన లైఫ్‌స్టైల్ ఫాలో అవ్వడంతో పాటు నేచురల్ చిట్కాలని ఫాలో అవ్వాలి. వీటితో మంచి రిజల్ట్ ఉంటుంది. అలాంటి ఓ టిప్ గురించి డాక్టర్ ఎరిక్ బర్గ్ యూట్యూబ్‌లో ఓ టిప్‌ని షేర్ చేశారు. దీంతో బెల్లీ ఫ్యాట్‌తో పాటు బరువు కూడా తగ్గుతారు. అయితే, డాక్టర్ చెప్పిన ఈ డ్రింక్ ఉదయం కంటే రాత్రుళ్ళు తాగడం మంచిది. దీంతో బాడీలోని కొలెస్ట్రాల్ చాలా



వరకూ తగ్గుతుంది. కొన్నిసార్లు బరువు తగ్గడమంటే తక్కువ తినడం, వర్కౌట్ చేయడం మాత్రమే కాదు. బాడీలోని కొన్ని హార్మోన్స్ కూడా సరైన తీరుగా పనిచేయాలని డాక్టర్ ఎరిక్ బర్గ్ చెబుతున్నారు. ముఖ్యంగా, కార్టిసాల్ మరియు ఇన్సులిన్ వంటి హార్మోన్స్ పెరిగితే బాడీలో కొలెస్ట్రాల్ కరగదు. దీని వల్ల బరువు తగ్గరు. డాక్టర్ బెర్గ్ ప్రకారం, రాత్రుళ్ళు అధిక కార్టిసాల్ లెవల్స్‌ని కరగకుండా చేస్తాయి. కాబట్టి, బరువు తగ్గడానికి మంచి నిద్ర చాలా ముఖ్యం. దీనికోసం నిమ్మకాయ బామ్ టీ కూడా హెల్ప్ చేస్తుంది. నిద్రపోవడానికి కనీసం గంట ముందు ఓ కప్పు నిమ్మ బామ్ టీ తాగితే బాడీ రిలాక్స్ అవుతుంది. ఒత్తిడి తగ్గుతుంది. నిద్ర మెరుగవుతుంది. మంచి నిద్ర ఉంటే చాలు. సహజంగా కొవ్వు కరుగుతుంది. ఈ టిప్ చక్కగా పనిచేయాలంటే కొద్దిగా మెగ్నీషియం గ్లైసినేట్ పౌడర్ వేయాలి. ఇది కండరాలని సడలించడానికి, శరీరాన్ని ప్రశాంతపరచడానికి, ఇన్సులిన్, కార్టిసాల్‌ని కంట్రోల్ చేయడానికి హెల్ప్ చేస్తుంది. దీని వల్ల బరువు తగ్గడానికి హెల్ప్ అవుతుంది. నేచురల్‌గానే బరువు తగ్గేందుకు ఈ టిప్ హెల్ప్ అవుతుంది. ఒత్తిడి, హార్మోన్లు నియంత్రణలో ఉన్నప్పుడు బరువు తగ్గడం ఈజీ. ముఖ్యంగా బెల్లీ ఫ్యాట్ తగ్గడం ఈజీ. ప్రతీ వ్యక్తి బాడీవ్ వేర్వేరుగా ఉంటుంది. కాబట్టి, ఏదైనా డ్రింక్స్, టిప్స్ ఫాలో అయ్యేముందు డాక్టర్‌ని కన్సల్ట్ అవ్వడం మంచిది.

# ఎముకలకు పుష్టినిచ్చే ఆహారాలు

చలి కాలంలో ఎముకలు, కీళ్ళు నొప్పులు తీవ్రంగా ఉంటాయి. ముఖ్యంగా అరవై ఏళ్లు పైబడిన వారిలో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. అయితే ప్రస్తుత కాలంలో యువత కూడా కీళ్ల నొప్పులతో ఇబ్బంది పడుతున్నారు. దీనికి అతిపెద్ద కారణం కాల్షియం లోపం. అందుకు కారణం ప్రోటీన్ కు ఇచ్చిన ప్రాముఖ్యత కాల్షియంకు ఇవ్వకపోవడమే. నేటి జీవన శైలి కారణంగా ఉదయం ఎండలో నడిచే వారే కరువయ్యారు. దీంతో శరీరంలో విటమిన్ డి లోపం తలెత్తుతుంది. దీని కారణంగా చిన్న వయస్సులోనే ఎముకలు



పెళుసుగా మారుతాయి. పాలు, పాల ఉత్పత్తులకు దూరంగా ఉండేవారికి కూరగాయల ద్వారా పుష్కలంగా కాల్షియం అందుతుంది. అవేంటో తెలుసుకుందాం. నువ్వులలో ఆరు రెట్లు ఎక్కువ కాల్షియం ఉంటుంది. కాబట్టి శీతాకాలంలో వీటిని సూపర్ ఫుడ్ గా పరిగణిస్తారు. 100 గ్రాముల నువ్వులలో దాదాపు 975 మిల్లీ గ్రాముల కాల్షియం లభిస్తుంది. నువ్వుల లడ్డులు, చట్నీలు, సలాడ్లలో కలిపి తినవచ్చు. శీతాకాలంలో క్రమం తప్పకుండా వీటిని తీసుకోవడం వల్ల ఎముకలు బలపడతాయి. అలాగే శీతాకాలంలో లభించే ఆకుకూరల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. పాలకూరలో కాల్షియం, విటమిన్ కె అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను బలపరుస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులు కూడా తగ్గుతాయి. కిడ్నీ బీన్స్, చిక్‌పీస్‌లో కూడా కాల్షియం అధికంగా ఉంటుందని చాలా మందికి తెలియదు. ఒక కప్పు ఉడికించిన శనగల్లో 80 నుండి 100 మిల్లీ గ్రాముల కాల్షియం ఉంటుంది. ఇది ప్రోటీన్, ఫైబర్, ఐరన్‌ను కూడా అందిస్తుంది. చల్లని చిక్‌పీస్, కిడ్నీ బీన్స్‌తో తయారు చేసిన వంటకాలు ఎముకలకు బలాన్నిస్తాయి. ఎండిన అంజీర్ పండ్లలో కాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఎముకలు బలంగా ఉంటాయి. రోజుకు 4 నుండి 5 ఎండిన అంజీర్ పండ్లను తినడం వల్ల అవి శరీరానికి కాల్షియం అవసరాన్ని సులభంగా తీరుస్తాయి. బాదం.. శరీరంలో కాల్షియం పనితీరును మెరుగుపరుస్తుంది. బాదం మెదడుతో పాటు ఎముకలకు కూడా మంచిది. 100 గ్రాముల బాదంలో సుమారు 260 మిల్లీ గ్రాముల కాల్షియం ఉంటుంది. చల్లని వాతావరణంలో రోజూ 5 నుంచి 7 బాదం పలుకులు నానబెట్టి తినడం వల్ల చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. రాగుల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. 100 గ్రాముల రాగులు.. మూడు గ్లాసుల పాలలో ఉన్నంత శక్తిని కలిగి ఉంటాయి. ఎందుకంటే కేవలం 100 గ్రాముల రాగులతో శరీరానికి సుమారు 350 మిల్లీ గ్రాముల కాల్షియం అందుతుంది. పిల్లలు నుంచి మహిళలు, సీనియర్ సిటిజన్లు.. ఇలా అందరికీ రాగులతో ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో రాగులు ముందు వరుసలో ఉంటాయి. రాగుల్లో క్యాల్షియం, ఐరన్‌తో పాటు అమైనో అమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి మేలు చేసేవే. రాగి పిండితో రోటీల దగ్గర్నుంచీ లడ్డూల వరకు పలు వంటకాలు చేసుకోవచ్చు. అంతేకాదు.. మైదా పిండి లాగా సాగే గుణం కూడా దీనికి ఉండదు. ఇందులోని క్యాల్షియం ఎముకల దృఢత్వానికి ఉపయోగపడుతుంది. పిల్లల దగ్గర్నుంచీ పెద్దల వరకు ప్రతి ఒక్కరూ నిస్సంకోచంగా రాగి పిండిని తీసుకోవచ్చంటున్నారు నిపుణులు.

# అల్లం, వెల్లుల్లిని ఫ్రిజ్‌లో పెడితే ఏమవుతుంది?

కూర ఏదైనా సరే.. దానికి మంచి రుచి రావాలంటే.. ఉప్పు, కారాలతో పాటుగా తాజా అల్లం, వెల్లుల్లి, మసాలా ఉండాల్సిందే.. ఇక్కడ తాజా అల్లం వెల్లుల్లి పాత్ర అతి ముఖ్యమైనది. కూరలకు ఇది అదిరిపోయే రుచిని ఇస్తుంది. అందుకే ప్రతి ఒక్కరి వంటింట్లో తప్పనిసరిగా అల్లం, వెల్లుల్లి పేస్ట్ ఎప్పుడూ నిల్వ ఉంటుంది. అయితే, దీన్ని నిల్వ చేసేందుకు చాలా మంది ఫ్రిజ్‌లో పెడుతుంటారు. అల్లం, వెల్లుల్లి, ఉల్లిపాయలను ఫ్రిజ్‌లో పెట్టొచ్చా..? లేదా అనే దానిపై జనాల్లో అనేక సందేహాలు ఉన్నాయి. ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల అవి విషపూరితంగా మారతాయనే



పుకార్లు కూడా ఉన్నాయి. అయితే, నిపుణుల ప్రకారం, వీటిని ఫ్రిజ్‌లో ఉంచడం తప్పనిసరి కాదని అంటున్నారు. రిఫ్రిజిరేటర్ లేని రోజుల్లో కూడా అల్లం, వెల్లుల్లి నెలల తరబడి తాజాగా ఉండేవని చెప్పారు. అల్లం, వెల్లుల్లి, ఉల్లి పాయలలో నీటి శాతం తక్కువగా ఉంటుంది. వైద్యపరంగా, వాటిని నీరు లేని కూరగాయలు అని పిలుస్తారు. ఫ్రిజ్‌లోని చలి, తేమ వాటిలోని తేమను ఆకర్షిస్తాయి. దీనివల్ల అవి త్వరగా కుళ్ళిపోతాయి. తేమతో కూడిన వాతావరణంలో బాక్టీరియా, శిలీంధ్రాలు త్వరగా పెరుగుతాయి. అందుకే ఫ్రిజ్‌లో నిల్వ చేసిన వస్తువులు కొన్నిసార్లు త్వరగా చెడిపోతాయి. అల్లం, వెల్లుల్లి, ఉల్లిపాయలను బుట్టలో, మెష్ బాక్స్‌లో లేదా బహిరంగ ప్రదేశంలో నిల్వ చేయడం మంచిదని చెబుతున్నారు.. ఇది రుచి, నాణ్యతను కాపాడుతుంది. రు దానిని ఫ్రిజ్‌లో ఉంచితే అది విషపూరితం కాదు. కానీ రు దానిని తప్పుగా నిల్వ చేస్తే, అది త్వరగా చెడిపోతుంది. కాబట్టి, పొడి ప్రదేశం ఉత్తమం. పైగా ఫ్రిజ్‌లోని ఇతర పదార్థాలు కూడా పాడయ్యే అవకాశం ఉంటుంది. మొత్తం ద ఎప్పటికప్పుడు అల్లం వెల్లుల్లి పేస్ట్ ని తయారు చేసుకోవడం మంచిది. ఇలా చేస్తే వంట రుచి కూడా సూపర్‌గా ఉంటుంది.


# ఫ్యాట్‌ని పెంచని ఫుడ్స్

కడుపు నిండా తిన్నా సన్నగానే ఉంటారు ఆహారం తినకుండా బరువు తగ్గడం సరైంది కాదు. సగం కడుపు మాడ్చుకుని తినడం కూడా మంచిది కాదు. ఎందుకంటే, అలాంటి డైట్‌పై ఓసారి కాకపోయినా మరోసారి విరక్తి వచ్చేసి ఆ డైట్‌నే మార్చేస్తారు. మళ్ళీ మొదటికొస్తారు. అందుకే, మంచి డైట్‌ని ముందుగా సెలక్ట్ చేసుకోవాలి. ఆ డైట్ ప్రకారమే తింటే కడుపు నిండుగా ఉంటుంది. దీంతో ఫ్యాట్ లాస్ అవుతారు. వెయిట్‌లాస్ కూడా అవుతారు. కోడిగుడ్లు అందరికీ అందుబాటులో ఉండే బెస్ట్ ప్రోటీన్ సోర్స్. రోజూ వీటిని డైట్‌లో యాడ్ చేయడం వల్ల త్వరగా కడుపు నిండుతుంది. ఇందులో ప్రోటీన్‌తో పాటు ఫ్యాట్, ఇతర పోషకాలు కూడా ఉంటాయి. ఇవన్నీ కూడా ఆరోగ్యానికి ఎంతో మంచివి. ఉడకబెట్టుకుని తింటే వెయిట్‌మేనేజ్‌మెంట్‌లో చక్కగా హెల్ప్ చేస్తాయి. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌కి పర్ఫెక్ట్ ఛాయిస్. అలానే పాప్‌కార్న్. ఇది కూడా మంచి ఫైబర్ ఫుడ్. వీటిని చాలా మంది ంపాస్‌కి తింటుంటారు. కానీ, అలా కాకుండా, చక్కగా వీటిని కడుపుని నింపే ఫుడ్స్ అని చెప్పొచ్చు. చాలా టేస్టీగా ఉంటాయి. ఎక్కువ ఖర్చుతో కూడుకున్న ఫుడ్ కూడా కాదు. కాబట్టి, చక్కగా తినొచ్చు. రుచికి రుచి. బరువు కూడా తగ్గుతారు. పెసరపప్పు కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. దీనిని తినడం వల్ల ఒంటికి చలువ. పైగా పప్పులో ఎన్నో పోషకాలు ఉంటాయి. ప్రోటీన్, లిపిడ్స్, కార్బోహైడ్రేట్స్, ఫైబర్, కాల్షియం, ఐరన్, సోడియంలు ఎక్కువగా ఉంటాయి. వీటిని రు ఎలా అయినా తీసుకోవచ్చు. అదే విధంగా మొక్కజొన్న. మొక్కజొన్నలో కూడా ప్రోటీన్, లిపిడ్ ఫ్యాట్, కార్బోహైడ్రేట్స్, ఎనర్జీ, పంచదార శాతం ఎక్కువగా ఉంటాయి. వీటిని చక్కగా ఉడికించి, వేయించి ఎలా అయినా తీసుకోవచ్చు. దోసకాయ, సోరకాయల్లో కూడా నీటిశాతం ఎక్కువగా ఉంటుంది. కేలరీలు తక్కువగా, నీటిశాతం ఎక్కువగా ఉండే కూరగాయల్లో ఇవి ఒకటి. దోసకాయల్ని మనం సలాడ్స్, నేరుగానైనా తీసుకోవచ్చు. అదే విధంగా, సోరకాయని రు పప్పు, కూరలు, ఎలా అయినా వండుకుని తినొచ్చు. వీటి వల్ల పోషకాలు అందుతాయి. కడుపు నిండుతుంది. ఫ్యాట్‌లాస్ అవ్వడానికి ఎక్కువగా హెల్ప్ అవుతుంది. క్యాబేజీ, క్యారెట్స్‌లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల త్వరగా కడుపు నిండుతుంది. క్యాబేజీలో విటమిన్ కె, సి,ఫైబర్, ఫోలేట్, బి విటమిన్స్, మినరల్స్, పొటాషియం, మాంగనీస్‌లు ఉంటాయి. ఇవన్నీ కూడా మన జీర్ణశక్తి, ఇమ్యూనిటీని పెంచుతాయి. అంతేకాకుండా ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ శరీర కణాలను డ్యామేజ్ కాకుండా చేస్తాయి. ఫ్యాట్ పెరగకుండా చేస్తాయి. ఇక క్యారెట్స్‌లో బీటా కెరోటిన్, మినరల్స్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవన్నీ కంటి ఆరోగ్యాన్ని, జీర్ణ ఆరోగ్యాన్ని, గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా చేస్తాయి. వీటిలోని నీటిశాతం కడుపు నిండేలా చేస్తుంది. వీటిని హెల్దీ స్నాక్స్‌గా మనం కన్సిడర్ చేయొచ్చు. బొప్పాయి పండు కూడా ఎంతో టేస్టీగా ఉండే పండు. ఇందులో కేలరీలు తక్కువగా ఉంటాయి. పైగా నీటిశాతం ఎక్కువగా ఉండి విటమిన్స్, ఫైబర్, పొటాషియం, ఫోలేట్, యాంటీ ఆక్సిడెంట్స్, లైకోపీన్‌లు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఇమ్యూనిటీ, జీర్ణ శక్తి పెరుగుతుంది. చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది. శనగలు కూడా మంచి గ్రెయిన్. ఇందులో ప్రోటీన్, ఫైబర్, కాంప్లెక్స్ కార్బస్, విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా ఉన్నాయి. వీటిని మనం తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ చక్కగా పనిచేయడమే కాకుండా, కండరాలకి కూడా మంచిది.



# గాఢ నిద్రలో అకస్మాత్తుగా మేల్కొంటున్నారా?

రాత్రిపూట తరచుగా మేల్కొంటుంటే, దానిని తేలికగా తీసుకోకండి. పడుకున్న తర్వాత 7 నుండి 8 గంటలు బాగా నిద్రపోవడం చాలా ముఖ్యం. అలా చేయకపోవడం ఆరోగ్యానికి ప్రమాదకరం.. అయితే.. నిద్రలో అకస్మాత్తుగా లేవడం.. నిద్రలేమి.. గుండె ఆరోగ్యానికి హానికరమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. మంచి ఆరోగ్యానికి తగినంత నిద్ర చాలా ముఖ్యం. కానీ రాత్రిపూట కు తరచుగా అంతరాయం కలిగిస్తుంటే, దానిని సాధారణ సమస్యగా తోసిపుచ్చకండి. నిద్రలో తరచూ మేల్కొనడం.. అంతరాయం ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు.. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన కొత్త పరిశోధన ప్రకారం.. తరచుగా అంతరాయాలు గుండె ఆరోగ్యానికి తీవ్రమైన పరిణామాలను కలిగిస్తాయి. ఈ సమస్య చాలా కాలం పాటు కొనసాగితే, అది అనేక ప్రమాదకరమైన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. పరిశోధన ప్రకారం, ప్రతి ఒక్కరూ రాత్రికి కనీసం 7 నుండి 8 గంటలు నిద్రపోవడం చాలా ముఖ్యం. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, తరచుగా నిద్రకు అంతరాయాన్ని ఎదుర్కొనే వ్యక్తులు అధిక రక్తపోటుకు గురయ్యే ప్రమాదం ఉంది. నిద్రకు అంతరాయం కలిగించేవి శరీరం పూర్తిగా మరమ్మత్తు చేయకుండా నిరోధిస్తాయి.. ఇది గుండె పనితీరును ప్రభావితం చేస్తుంది. తరచుగా నిద్రకు అంతరాయం కలిగించేవి మెదడుపై కూడా ప్రభావం చూపుతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. రాత్రిపూట గాఢ నిద్రలో అనేక అవయవాలు విశ్రాంతి పొందడంతోపాటు.. రిపేర్ అవుతుంటాయి. గుండె విశ్రాంతి తీసుకుంటుంది.. రక్తపోటు సాధారణంగా ఉంటుంది. కానీ నిద్రకు పదేపదే అంతరాయం కలిగితే, గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. ఇది వాపునకు కారణమవుతుంది. ఇంకా ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. రోజుకు 23 అంతరాయాలను నివేదించే వ్యక్తులకు గుండె జబ్బుల ప్రమాదం 30 శాతం పెరుగుతుంది. మానసిక ఒత్తిడి స్పష్టంగా గుండెను ప్రభావితం చేస్తుంది. అందువల్ల, రు తరచుగా రాత్రిపూట మేల్కొలుపులు ఎదుర్కొంటుంటే ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం.. వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. ముఖ్యంగా కొంతమంది చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇంకా తక్కువ నిద్రపోవడం వల్ల శరీరంలోని రక్త పోటు, గ్లూకోజ్ మెటబాలిజం, వాపు వంటి జీవ ప్రక్రియలకు భంగం కలుగుతుంది.



# మైదాకు బదులుగా ఇవి..!

మైదా పిండి.. మనం తీసుకునే ఆహారంలో ఎక్కువగా కనిపించే పదార్థం. బ్రెడ్, సమోసాలు, కేకులు, బిస్కట్లు, బోండాలు.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఆహార పదార్థాల్లో మైదా కనిపిస్తుంటుంది. అయితే ఈ పిండిలో శరీరానికి కావాల్సిన పోషకాలు తక్కువ మోతాదులో ఉంటాయి. అలాగే రక్తంలోని చక్కెర స్థాయిలను అమాంతం పెంచేస్తుంది. అయితే రుచిగా ఉంటుందనో, తేలిగ్గా వంట పూర్తవుతుందనో చాలామంది ఈ పిండిని వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో మైదాకు బదులుగా కొన్ని పిండి పదార్థాలను ఆహారంలో చేర్చుకోవచ్చంటున్నారు నిపుణులు. ఫలితంగా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చంటున్నారు. ఇటీవలి కాలంలో ఆరోగ్యానికి సంబంధించి జాగ్రత్తలు తీసుకునేవారి సంఖ్య పెరుగుతోంది. ఇందులో భాగంగా చిరుధాన్యాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు.

బరువు తగ్గాలనుకునే వారు చాలా మంది ఓట్స్‌ని ఆహారంలో భాగం చేసుకుంటారు. ఇందులో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. మాంసకృత్తులు, పీచు అధిక మొత్తంలో ఉంటాయి. పీచు వల్ల తిన్న వెంటనే కడుపు నిండిన భావన కలుగుతుంది. అలాగే శరీరానికి కావాల్సిన ఇతర పోషకాలు కూడా ఇందులో మెండుగా ఉంటాయి. ఈ క్రమంలోనే మైదాకు బదులుగా ఓట్స్ పిండిని కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఓట్స్ పిండితో ప్యాన్ కేక్స్, రోటీలు, కుకీస్, మఫిన్స్‌తో పాటు మసాలా వడలు.. మొదలైనవి కూడా చేసుకోవచ్చు.



జొన్నల్లో శరీరానికి కావాల్సిన పోషకాలు అధికంగా ఉంటాయి. ఒకప్పుడు వీటిని ప్రధాన ఆహారంగా తీసుకునేవారు. బియ్యం వినియోగం పెరగడంతో వీటి ప్రాధాన్యం తగ్గింది. అయితే ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకునేవారు జొన్నలకు ఇటీవల కాలంలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది జీర్ణ శక్తిని మెరుగుపరచడంతో పాటు శరీర బరువుని అదుపులో పెట్టుకోవడానికి ఉపయోగపడుతుంది. జొన్న పిండితో రొట్టెలతో పాటు దోశలు, ఉప్మా, లడ్డూలు, మఫిన్లు, మురుకులు.. మొదలైనవి కూడా చేసుకోవచ్చు. మైదా పిండికి బదులుగా ఆహారంలో జొన్న పిండిని భాగం చేసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు పొందచ్చంటున్నారు నిపుణులు. రిఫైన్డ్ గోధుమల నుంచి మైదా పిండిని తయారు చేస్తారు. ఈ క్రమంలో పలు రసాయనాలనూ కలుపుతారు. అందువల్లే ఇది తెలుపు రంగులో ఉంటుంది. అయితే మైదా కంటే గోధుమ పిండితో చేసిన వంటకాలు మంచివంటున్నారు నిపుణులు. భారతీయ వంటకాల్లో ఎప్పట్నుంచో గోధుమ పిండికి ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో ఫైబర్, బి విటమిన్లు.. మొదలైన పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వీటితో పాటు మైదా పిండికి బదులుగా శెనగ పిండి, బాదం పిండి వంటివి ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల.. రుచిని ఆస్వాదించడంతో పాటు, ఆరోగ్యాన్నీ కాపాడుకోవచ్చంటున్నారు నిపుణులు.

బిజినెస్


# భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు.. రూ.9 లక్షల కోట్లు ఢమాల్



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ప్రపంచ వాణిజ్యంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, విదేశీ మదుపర్ల అమ్మకాలు మన సూచీలపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఓ దశలో 1200 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ కూడా 25,200 దిగువకు చేరింది. తర్వాత కాస్త కోలుకున్నాయి. ఈ క్రమంలోనే సూచీలు రెండు నెలల కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. మదుపర్ల సంపద దాదాపు ఒక్కరోజులోనే రూ.9 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.9.46 లక్షల కోట్లు క్షీణించి రూ.455.7 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 83,207.38 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,246.18) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,010.58 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1065.71 పాయింట్ల నష్టంతో 82,180.47 వద్ద ముగిసింది. నిఫ్టీ 353 పాయింట్ల నష్టంతో 25,232.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.97గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఒక్క హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మినహా మిగిలిన స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. ఎటెర్నల్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, ఇండిగో, ట్రెంట్ ప్రధానంగా నష్టపోయాయి. ఐటీ షేర్లలో అమ్మకాలు సూచీలపై తీవ్ర ప్రభావం చూపాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2.1 శాతం మేర పతనమైంది. విప్రో 3 శాతం, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ షేర్లు 7 శాతం మేర క్షీణించాయి. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల కారణంగా ఆయా కంపెనీలు బలహీన త్రైమాసిక ఫలితాలను ప్రకటించాయి. దీంతో ఐటీ కంపెనీల లాభాలపై ఆందోళన వ్యక్తమవుతున్న వేళ ఐటీ స్టాక్స్ భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. గ్రీన్‌లాండ్ విషయంలో తనకు సహకరించకుంటే టారిఫ్‌లు విధిస్తానని యూరోపియన్ యూనియన్ దేశాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో మళ్లీ టారిఫ్ వార్ భయాలు మార్కెట్లలో మొదలయ్యాయి. ఈ ప్రభావం మన మార్కెట్లపైనా పడింది. విదేశీ మదుపర్ల వరుస అమ్మకాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఎఫ్ఐఐలు సోమవారం కూడా రూ.3263 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు.

# పీఎన్‌బీ లాభం రూ.5,100 కోట్లు


ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) 2025-26 అక్టోబరు-డిసెంబరులో రూ.5,100 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఒక త్రైమాసికంలో ఈ స్థాయి లాభాన్ని ఆర్జించడం ఇదే తొలిసారి. 2024-25 ఇదే కాల లాభం రూ.4,508 కోట్లతో పోలిస్తే ఇది 13% అధికం. ఇదే సమయంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.34,752 కోట్ల నుంచి రూ.37,253 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.31,340 కోట్ల నుంచి రూ.32,231 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) మాత్రం రూ.11,032 కోట్ల నుంచి 4.5% తగ్గి రూ.10,533 కోట్లకు పరిమితమైంది. నిర్వహణ లాభం రూ.6,621 కోట్ల నుంచి రూ.7,481 కోట్లకు పెరిగింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 4.09% నుంచి 3.19 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.41% నుంచి 0.32 శాతానికి మెరుగయ్యాయి. అయినా కేటాయింపులు రూ.318 కోట్ల నుంచి రూ.1,341 కోట్లకు పెరిగాయి. 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈసీఎల్ (ఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్) నిబంధనలను చేరుకోవడానికి రూ.955 కోట్ల అదనపు కేటాయింపులు చేసినట్లు బ్యాంక్ ఎండీ, సీఈఓ అశోక్ చంద్ర వెల్లడించారు. ఇకపై ప్రతి త్రైమాసికంలో రూ.5,000 కోట్ల నికర లాభం లక్ష్యాన్ని చేరుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు. సాంకేతికంగా రద్దు (రైటాఫ్) చేసిన ఒక పెద్ద ఖాతా నుంచి భారీ మొత్తం వసూలు కావడంతో రికవరీ రూ.823 కోట్ల నుంచి రూ.1,956 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. వొడాఫోన్ ఐడియాకు గతంలో మంజూరు చేసిన రూ.300 కోట్ల రుణం బకాయిలుగా ఉందని, ప్రస్తుతం ఆ సంస్థకు కొత్తగా రుణాలు మంజూరు చేయలేదని వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.8-2.9 శాతంగా ఉంటుందని అంచనా వేశారు.




# మధ్యతరగతికి బడ్జెట్ ధమాకా..

## రూ.15 లక్షల వరకు నో ట్యాక్స్!

దేశంలోని కోట్ల మంది మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు, ముఖ్యంగా వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించేందుకు సిద్ధమవుతోంది. రాబోయే బడ్జెట్ 2026-27లో కొత్త పన్ను విధానం కింద ఆదాయపు పన్ను రాయితీలను భారీగా పెంచే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 87ఏ కింద ఇచ్చే పన్ను రిబేటు పరిమితిని ప్రస్తుతం ఉన్న దానికంటే గణనీయంగా పెంచి దాదాపు రూ. 1.5 లక్షల వరకు చేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత నిబంధ



నల ప్రకారం కొత్త పన్ను విధానంలో రూ. 12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి రిబేటు లభిస్తోంది (గతంలో ఇది రూ. 7 లక్షలుగా ఉండేది). అయితే, రాబోయే బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ పరిమితిని మరింత విస్తరించాలని భావిస్తోంది. సెక్షన్ 87ఏ రిబేట్ కారణంగా రూ.12 లక్షల ఆదాయం వరకు ఎలాంటి ట్యాక్స్ పడడం లేదు. అయితే సెక్షన్ 87ఏ రిబేటును పెంచడం ద్వారా, రూ. 15 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్న ఉద్యోగులు కూడా ఎటువంటి ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేని పరిస్థితి కల్పించనున్నట్లు వాదనలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులకు కేవలం 87ఏ రిబేటు మాత్రమే కాకుండా, స్టాండర్డ్ డిడక్షన్ కూడా తోడవుతుంది. ఇప్పటికే ఈ పరిమితిని రూ. 75,000కు పెంచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 87ఏ రిబేటు కూడా పెరిగితే రూ. 15 లక్షల ప్యాకేజీ ఉన్న సామాన్య ఉద్యోగి చేతికి పూర్తి జీతం అందే అవకాశం ఉంటుంది. దీనివల్ల ప్రజల వద్ద ఖర్చు చేయడానికి ఎక్కువ నగదు మిగులుతుందని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని ప్రభుత్వం భావిస్తోందట. పన్ను నిపుణులు, ఆర్థిక వేత్తల అభిప్రాయం ప్రకారం.. ప్రభుత్వం పాత పన్ను విధానం కంటే కొత్త పన్ను విధానాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. సెక్షన్ 87ఏ రిబేటు పెంపునకు బదులుగా పన్ను లెక్కలు చాలా సరళంగా మార్చవచ్చని అంచనా వేస్తున్నారు. గత ఏడాది బడ్జెట్‌లోనే సెక్షన్ 87ఏ రిబేట్ భారీగా పెంచారు. దీంతో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి రూ.12 లక్షలకు చేరింది. దీంతో ఈసారి ఈ పరిమితిని పెంచకపోవచ్చంటున్నారు. అయితే, కొత్త పన్ను విధానాన్ని ప్రజలకు మరింత చేరువ చేసి, ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇచ్చేందుకు రిబేట్ పెంచే అవకాశం లేకపోలేదంటున్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో పన్ను మినహాయింపు ఇవ్వడం వల్ల మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఊరట లభిస్తుంది. ప్రజల చేతుల్లో డబ్బు ఎక్కువగా ఉంటే, మార్కెట్‌లో వస్తువుల కొనుగోలు పెరిగి డిమాండ్ పెరుగుతుంది. వచ్చే ఫిబ్రవరిలో ప్రవేశపెట్టబోయే ఈ బడ్జెట్ పై సామాన్యుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఒకవేళ ప్రభుత్వం ఈ సెక్షన్ 87ఏ రిబేటును రూ. 1.5 లక్షలకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపితే, భారత పన్ను చరిత్రలో ఇది ఒక విప్లవాత్మక మార్పుగా నిలుస్తుంది. పన్నుల భారం తగ్గుతుందన్న వార్తతో దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు, ప్రైవేటు రంగ కార్మికులు హర్షం వ్యక్తం చేయనున్నారు.

# ఆకాశాన్నంటిన పసిడి, వెండి ధరలు

హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా గరిష్ట స్థాయికి చేరుకోవడంతో కొనుగోలుదారులు విస్మయానికి గురవుతున్నారు. అంతర్జాతీయ పరిణామాలు మరియు దేశీయ డిమాండ్ పెరగడం వల్ల ఈ భారీ పెరుగుదల నమోదైనట్లు మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు.ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలకు ఈ ధరల పెంపు పెద్ద షాక్‌గా మారింది, పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న తరుణంలో ఈ మార్పులు ఇన్వెస్టర్లలో కూడా చర్చనీయాంశమయ్యాయి.వెండి ధరలు మునుపెన్నడూ లేని విధంగా భారీ జంప్‌ను నమోదు చేశాయి. ఒక్క రోజులోనే కేజీ వెండి ధరపై ఏకంగా రూ.12,000 అదనంగా పెరగడంతో, ప్రస్తుతం మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.3,30,000 మార్కును తాకింది. సాధారణంగా వెండి ధరల్లో స్వల్ప మార్పులే కనిపిస్తుంటాయి, కానీ ఈ స్థాయి భారీ పెరుగుదల పరిశ్రమ వర్గాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పారిశ్రామిక అవసరాలు మరియు వెండిపై పెట్టుబడులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది.బంగారం ధరల విషయానికి వస్తే, 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం 10 గ్రాములకు రూ.1,040 పెరగడంతో



ఇప్పుడు దీని ధర రూ.1,47,280 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా, ఆభరణాల తయారీలో ఎక్కువగా వాడే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.950 ఎగబాకి, రూ.1,35,000 మార్కుకు చేరుకుంది. పసిడి ప్రేమికులకు ఇది మింగుడుపడని వార్తే అయినప్పటికీ, మార్కెట్ ఒడిదుడుకుల వల్ల ధరలు ఎక్కడా తగ్గే సూచనలు కనిపించడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో బంగారం, వెండి ధరల్లో స్వల్ప తేడాలు కనిపిస్తున్నాయి. రవాణా ఖర్చులు మరియు స్థానిక పన్నుల కారణంగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో ధరలు కొద్దిపాటి వ్యత్యాసంతో కొనసాగుతున్నాయి. రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల ఆధారంగా ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.


# బిలీయనీర్ల సంపద రూ. 1,660 లక్షల కోట్లు

ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన లీడర్లు, ఆర్థికవేత్తలు, బిలియనీర్లు ఈ ఏడాది వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సమావేశం కోసం దావోస్‌కు చేరుకున్నారు.ఈ నేపథ్యంలో ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ తన కొత్త నివేదికలో పలు కీలక విషయాలను వెల్లడించింది. దాని ప్రకారం, ప్రపంచ సంపద అసమానత అత్యంత ప్రమాదకరమైన కొత్త దశలోకి ప్రవేశించిందని, సంపద మునుపెన్నడూ లేనంత వేగంగా పెరగడమే కాకుండా, అది రాజకీయ శక్తిగా కూడా వేగంగా మారుతోందని తెలిపింది. సాధారణ ప్రజలతో పోలిస్తే బిలియనీర్లు రాజకీయ పదవులు చేపట్టే అవకాశాలు ఇప్పుడు 4,000 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిస్థితి ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యలకు తీవ్ర అస్థిరతను కలిగిస్తాయని ఆక్స్‌ఫామ్ అభిప్రాయపడింది. అదే సమయంలో, ప్రపంచ బిలియనీర్ల మొత్తం సంపద 2025లో రికార్డు స్థాయిలో 18.3 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది, ఇది గత ఐదేళ్ల సగటు వేగం కంటే మూడు రెట్లు వేగంగా పెరిగింది. మన కరెన్సీలో చెప్పాలంటే, ఈ మొత్తం రూ. 1,660 లక్షల కోట్లకు పైగా ఉంటుంది. ఈ మొత్తం చాలా దేశాల స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) కంటే చాలా ఎక్కువ. ఈ సందర్భంగా ధనవంతులు చాలా శక్తివంతులుగా మారుతున్నారని ఆక్స్‌ఫామ్ హెచ్చరిస్తోంది. బిలియనీర్లు చాలా వేగంగా ధనవంతులుగా, మరింత శక్తివంతులుగా మారుతున్నారు. వారి సంపద ఒక సంవత్సరంలో 16 శాతం, 2020 నుంచి 81 శాతం పెరిగింది. స్టాక్ మార్కెట్లు, ఏఐ కంపెనీలు, వారికి అనుకూలంగా ఉండే పాలసీలు ధనవంతులకు కలిసొచ్చింది. కేవలం ఒక ఏడాది వ్యవధిలో బిలియనీర్లు 2.5 ట్రిలియన్ డాలర్లు(మన కరెన్సీలో రూ. 227.19 లక్షల కోట్లు) సంపాదించారు, ఇది ప్రపంచ జనాభాలో సగం మంది సంపదకు సమానం. ఈ సంపదను ఉపయోగించి తీవ్ర పేదరికాన్ని అనేక రెట్లు అంతం చేయవచ్చని ఆక్స్‌ఫామ్ పేర్కొంది.



# భారత ఈవీ పథకాలపై చైనా అక్కసు

మరోసారి భారత్‌తో చైనా తగువుకు దిగింది. ముఖ్యంగా మన దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ, వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో తీసుకొచ్చిన పథకాలపై చైనా అక్కసు వెళ్లగక్కుతోంది. ద్వైపాక్షిక సంప్రదింపులు విఫలమైన తర్వాత, ఆటోమొబైల్స్, బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాల కోసం భారత ప్రభుత్వం అందించే ప్రోత్సాహక పథకాలకు వ్యతిరేకంగా వివాద పరిష్కార ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ)ను కోరడం ద్వారా చైనా భారత్‌తో తన వాణిజ్య వివాదాన్ని మరింత పెంచుకునే దిశగా అడుగులు వేసింది.



క్రీడలు

## సైనా నెహ్వాల్ రిటైర్మెంట్ ప్రకటన



భారత బ్యాడ్మింటన్‌కు దిక్సూచిగా నిలిచిన సైనా నెహ్వాల్ రిటైర్మెంట్ ప్రకటించారు. తాను అంతర్జాతీయ పోటీల నుంచి రిటైర్ అయినట్లు సైనా ధృవీకరించారు.అయితే గత రెండేళ్లుగా క్రానిక్ మోకాలి నొప్పితో తీవ్రంగా బాధపడుతున్న సైనా.. తన శరీరం ఎలైట్ స్పోర్ట్స్ అవసరాలను తట్టుకోలేకపోతుందని పేర్కొంది. సోమవారం సుభోజిత్ ఘోష్‌తో చేసిన ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించారు. 2023 జూన్ తర్వాత నుంచి సైనా ఎలాంటి అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొనలేదు.అయితే రిటైర్మెంట్ పై ఎలాంటి ఫార్మల్ అనౌన్స్‌మెంట్ అవసరం లేదని ఆమె భావించారు. "నేను నా ఇష్టంతోనే ఆటలోకి వచ్చాను, అలాగే నా ఇష్టంతోనే బయటకు వచ్చాను" అని చెప్పింది. సైనా కెరీర్‌లో 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచి భారత మహిళల బ్యాడ్మింటన్‌లో తొలి ఒలింపిక్ మెడల్ సాధించిన ఘనత దక్కించుకుంది. ఆమె మాజీ వరల్డ్ నెంబర్ వన్‌గా నిలిచిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించింది. అలాగే రెండు కామన్వెల్త్ గేమ్స్ గోల్డ్ మెడల్స్, ఆసియా గేమ్స్ బ్రాంజ్ మెడల్స్, అనేక ఃచిఈ సూపర్ సిరీస్ టిల్స్ ఆమె ఖాతాలో ఉన్నాయి. భారత మహిళల బ్యాడ్మింటన్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ట్రయల్‌బ్లేజర్‌గా సైనా నిలిచారు.

# ఐపీఎల్‌ను కాపీ కొట్టిన పాకిస్తాన్..

## ఇకపై ఐపీఎల్ తరహాలో ఆటగాళ్ల కొనుగోలు

భారత్‌లో జరిగే ఐపీఎల్ వరల్డ్ క్రికెట్‌లో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్‌ను సృష్టించుకుంది. ఐపీఎల్‌కు వచ్చిన క్రేజ్



చూసి ఇతర దేశాల క్రికెట్ బోర్డులు కూడా ఫ్రాంచైజీ లీగ్‌లను మొదలుపెట్టాయి.అందులో పాకిస్తాన్ కూడా ఉంది. 2016లో పాకిస్తాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్)ను ప్రారంభించింది. ఇప్పుడు ఐపీఎల్‌లోని వేలం పక్రియను కూడా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) కాపీ కొడుతోంది. వచ్చే పీఎస్ఎల్ సీజన్‌లో ఐపీఎల్ తరహాలో ప్లేయర్ల ఆక్షన్‌ను నిర్వహించనుంది. గత సీజన్ వరకు డ్రాఫ్ట్ సిస్టమ్ ద్వారా ఫ్రాంచైజీలు ఆటగాళ్లను కొనుగోలు చేసేవి. వచ్చే సీజన్ నుంచి పీసీబీ డ్రాఫ్ట్ సిస్టమ్ విధానానికి స్వస్థ పలికి వేలం పక్రియను ప్రవేశపెట్టనుంది. తాజాగా పీఎస్ఎల్ ఫ్రాంచైజీలు, పీసీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సల్మాన్ నసీర్ టింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నారు. వేలం పక్రియను అమలు చేయాలని చైర్మన్ మొహ్సిన్ నక్వీ ఒత్తిడి తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. లీగ్ దీర్ఘకాలిక వృద్ధి కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సల్మాన్ నసీర్ తెలిపారు. కొత్త స్ట్రక్చర్ ప్రకారం.. ప్రతి ఫ్రాంచైజీ గరిష్టంగా నలుగురు ప్లేయర్లను రిన చేసుకోవచ్చు. గతంలో 8 మంది ప్లేయర్లను అంటిపెట్టుకునే వీలు ఉండేది. మెంటార్, బ్రాండ్ అంబాసిడర్, రైట్ టూ మ్యాచ్ ఆప్షన్లను తొలగించారు. మార్చి 26 నుంచి పీఎస్ఎల్ 11వ సీజన్ ప్రారంభంకానుంది.

# 2026 టీ20 వరల్డ్‌కప్ ముందు హైడ్రామా


ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026 చుట్టూ ప్రస్తుతం ఓ పెద్ద హై డ్రామా కొనసాగుతోంది. బంగ్లాదేశ్‌తో తలనొప్పిగా మారిన ఇలాంటి సమయంలో పాకిస్తాన్ కూడా మరో మెలిక పెట్టిందనే వార్తలు బయటకు వస్తున్నాయి.బంగ్లాదేశ్ జట్టుకు సంబంధించిన భద్రతా సమస్యలు పరిష్కారం కాకపోతే, తాము కూడా టోర్నీలో పాల్గొనాలా వద్దా అన్న అంశాన్ని పునఃసక్షిస్తామని పాకిస్తాన్ స్పష్టం చేసినట్లు జియో న్యూస్ నివేదించింది. భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంతో ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీపై ఇప్పటికే తీవ్ర గందరగోళం నెలకొంది. బంగ్లాదేశ్ ప్రభుత్వం భద్రతా అంశాలపై పాకిస్తాన్‌ను సంప్రదించి మద్దతు కోరిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కథనం వెల్లడించింది. ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు నుంచి బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను తొలగించాలంటూ బీసీసీఐ సూచించిన నేపథ్యంలో ఈ వివాదం మొదలైంది. ఆ నిర్ణయానికి ఎలాంటి అధికారిక కారణం వెల్లడించలేదు. దీనికి ప్రతిస్పందనగా బంగ్లాదేశ్ ప్రభుత్వం దేశంలో ఐపీఎల్ ప్రసారాలపై నిషేధం విధించింది. అలాగే టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లను భారత్‌లో ఆడలేమంటూ, భద్రతా కారణాలు చూపుతూ ఐసీసీకి అధికారికంగా లేఖ రాసింది. అప్పటి నుంచి తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని బంగ్లాదేశ్ స్పష్టంగా చెబుతోంది.ఈ పరిణామాల మధ్య పాకిస్తాన్, ఏ దేశంపైనా ఆతిథ్య బాధ్యతల విషయంలో ఒత్తిడి లేదా బెదిరింపులు ఉండకూడదని వ్యాఖ్యానించింది. బంగ్లాదేశ్‌కు పూర్తి మద్దతు ఉంటుందని కూడా తెలిపింది. అంతేకాదు, బంగ్లాదేశ్ కోరితే వారి టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లన్నింటినీ పాకిస్తాన్‌లో నిర్వహించేందుకు సిద్ధమని ఇప్పటికే ఐసీసీకి తెలియజేసినట్లు పీసీబీ వర్గాలు వెల్లడించాయి. ముంబై, కోల్‌కతాలో జరగాల్సిన మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలంటూ బంగ్లాదేశ్ ఐసీసీని కోరిన నేపథ్యంలో ఈ ప్రతిపాదన వచ్చిందని సమాచారం. ఛాంపియన్స్ ట్రోఫీ, ఐసీసీ మహిళల క్వాలిఫయర్‌లను విజయవంతంగా నిర్వహించిన అనుభవం తమకు ఉందని, అవసరమైతే మైదానాలు సిద్ధంగా ఉన్నాయని పాకిస్థాన్ పేర్కొంది. ఇదే సమయంలో బంగ్లాదేశ్ గ్రూప్ మార్పు అంశంపై కూడా చర్చ జరిగింది. శ్రీలంకలోనే తమ గ్రూప్ మ్యాచ్‌లన్నీ ఆడాల్సిన ఐర్లాండ్‌తో గ్రూప్ మార్పు ప్రతిపాదనను బంగ్లాదేశ్ ముందుకు తెచ్చింది. అయితే షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు ఉండదని ఐసీసీ తమకు స్పష్టమైన హా ఇచ్చిందని క్రికెట్ ఐర్లాండ్ ఇప్పటికే వెల్లడించింది. ఈ పరిణామాలన్నింటితో టీ20 వరల్డ్‌కప్ 2026పై ఉత్కంఠ మరింత పెరిగింది. బంగ్లాదేశ్ నిర్ణయం మాత్రమే కాకుండా, ఇప్పుడు పాకిస్తాన్ వైఖరి కూడా ఐసీసీకి పెద్ద సవాలుగా మారింది. అయితే, జనవరి 21 వరకు బంగ్లాదేశ్‌కు ఐసీసీ డెడ్‌లైన్ విధించింది.



# క్రికెట్ ఫ్యాన్స్‌కు డబుల్ ధమాకా..

## ఒకే రోజు రెండు భారత్, పాక్ మ్యాచ్‌లు

భారత్, పాకిస్తాన్ పోరు ఎప్పుడెప్పుడా? అని ఎదురుచూస్తున్న క్రికెట్ ఫ్యాన్స్‌కు డబుల్ ధమాకా. ఎదురు చూస్తుంటారు. ఫిబ్రవరి 15న రెండు భారత్, పాక్ మ్యాచ్‌లను చూడొచ్చు. టీ20 ప్రపంచకప్‌లో ఫిబ్రవరి 15న దాయాదుల పోరు జరగనున్న విషయం తెలిసిందే. మరో మ్యాచ్ అదే రోజు మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో జరగనుంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) ఈ టోర్నీ షెడ్యూల్‌ను సోమవారం ప్రకటించింది. థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో ఫిబ్రవరి 13 నుంచి 22 వరకు టోర్నమెంట్ జరగనుంది. ఇందులో భారత్ 'ఏ', పాకిస్తాన్ 'ఏ', యూఏఈ, నేపాల్, బంగ్లాదేశ్ 'ఏ', శ్రీలంక 'ఏ', మలేసియా, థాయిలాండ్ జట్లు పాల్గొంటాయి. 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించగా.. గ్రూపు ఏలో ఇండియా 'ఏ', పాక్ 'ఏ', నేపాల్, యూఏఈ జట్లను చేర్చారు. భారత జట్టు ఫిబ్రవరి 13న తమ తొలి మ్యాచ్‌లో యూఏఈతో ఆడుతుంది.తర్వాత



15న పాక్‌తో, 17న నేపాల్‌తో తలపడనుంది. టీ20 వరల్డ్ కప్‌లో కొలంబో వేదికగా భారత్, పాక్ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభంకానుండగా.. ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో 'ఏ' జట్ల మ్యాచ్ ఉదయం 9:30 గంటలకు జరుగుతుంది. దీంతో అభిమానులు ఒకే రోజు రెండు భారత్, పాక్ మ్యాచ్‌లను వీక్షించొచ్చు.


# ముందు కష్టపడితేనే..

వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై భారత క్రికెటర్ రిషభ్ పంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వర్క్ లైఫ్ బ్యాలెన్స్ అనేది ప్రతిఒక్కరికీ అవసరమేనని అభిప్రాయపడిన పంత్.. జీవితంలో చాలా ముందుగానే దాని గురించి ఆలోచించొద్దన్నాడు. ముందు చాలా కష్టపడి, ఆ తర్వాత రిలాక్స్ అవ్వాలంటూ యువతరానికి సూచించాడు. "ముందు మనం బాగా కష్టపడాలి. మన పనిని పిచ్చిగా ప్రేమించాలి. ఆ తర్వాత మనం జీవితంలో ప్రశాంతంగా ఉండడానికి, విశ్రాంతి తీసుకోవడానికి సమయం ఉంటుందని అర్థం చేసుకోవాలి. యువత తమ పరిధులను దాటి ప్రయత్నించాలి. ఏదైనా జరిగినా.. దాన్నుంచి కోలుకోవడానికి చాలా సమయం ఉంటుంది. ముందు నేర్చుకోవడానికి ప్రయత్నించాలి. దాన్నుంచి అద్భుతమైన విషయం బయటకు వస్తుంది. నా మనసులో నేను భారతదేశం కోసం ఆడాలని మాత్రమే కోరుకున్నాను. దేశం కోసం మ్యాచ్‌లు ఆడి గెలవాలనేదే నా డ్రీమ్. మిగతావన్నీ తర్వాత. నా చిన్నతనంలో నాన్నను కోల్పోయాను. ఈ ఘటన బాధాకరమైనదే అయినా, నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. సానుకూల దృక్పథంతో ఆలోచించి ముందుకుసాగా. కుర్రాడిగా ఉన్నప్పుడు నా ఆర్థిక పరిస్థితిపై దృష్టిపెట్టలేదు. కేవలం ఆట పైనే ఫోకస్ పెట్టా. కానీ, కొవిడ్ సమయంలో జీవితం, క్రికెట్‌పై నా విధానంలో గణనీయమైన మార్పు వచ్చింది" అని పంత్ అన్నాడు.



# భారత గడ్డపై ఇతర జట్లు ప్రేక్షకులను కూడా ఎదుర్కోవాలి

భారత గడ్డ పై అశేష అభిమానుల మధ్య క్రికెట్ ఆడటమంటే ఒకప్పుడు విదేశీ ఆటగాళ్లకు పెద్ద సవాల్‌గా ఉండేదని కానీ ఇప్పుడు ఇండియన్ ప్రీమియర్ లీగ్ పుణ్యమా అని ఆ పరిస్థితి మారిపోయిందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాసర్ హుస్సేన్ అభిప్రాయపడ్డాడు.భారత్ శ్రీలంక వేదికలుగా వచ్చే నెలలో ప్రారంభం కానున్న 2026 టీ20 ప్రపంచకప్‌ను ఉద్దేశించి అతడు ఈ వ్యాఖ్యలు చేశాడు.జియోస్టార్ కార్యక్రమంలో హుస్సేన్ మాట్లాడుతూ భారత్‌లో ఆడుతున్నప్పుడు ప్రత్యర్థి జట్టు కేవలం ఆటగాళ్లతోనే కాదు అభిమానులను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. సొంతగడ్డపై ప్రేక్షకుల మద్దతుతో టీమిండియా జోరందుకుంటే, ఇతర జట్లు ఆ ఒత్తిడిని తట్టుకోవడం చాలా కష్టం. అయితే ఐపీఎల్ కారణంగా చాలా మంది విదేశీ ఆటగాళ్లకు ఇక్కడి స్టేడియాలు వాతావరణం ఒత్తిడిపై పూర్తి అవగాహన వచ్చింది. మా రోజుల్లో సచిన్ టెండూల్కర్ బ్యాటింగ్‌కు వస్తుంటే అభిమానుల స్పందనకు బౌలర్ల కళ్లలో భయం కనిపించేది. కానీ ఇప్పుడు ఫ్రాంచైజీ క్రికెట్ వల్ల ఆ భయం పోయింది అని వివరించాడు.ఇదే చర్చలో పాల్గొన్న భారత మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ కూడా స్పందించాడు. అభిమానుల ఒత్తిడిని తట్టుకునే విషయంలో భారత జట్టులో కూడా మార్పు వచ్చిందని అన్నాడు. 1996 ప్రపంచకప్ సెమీఫైనల్‌లో మన జట్టు ఒత్తిడిని తట్టుకోలేకపోయింది. కానీ 2011 ప్రపంచకప్‌లో గ్యారీ కిర్‌స్టన్, ప్యాడీ అప్టన్ ఆధ్వర్యంలో ఈ ఒత్తిడిని ఒక అదనపు బలంగా మార్చుకోవడంపై దృష్టి పెట్టారు.



# వుదయం సినిమా




## విజయంపై చిరంజీవి ఎమోషనల్ మెసేజ్

ప్రపంచవ్యాప్తంగా 300 కోట్ల గ్రాస్ సాధించిన 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్రం ఘన విజయం నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి గారు ఎమోషనల్ మెసేజ్ షేర్ చేశారు. అత్యంత వేగంగా 300 కోట్ల మార్క్‌ను చేరిన తెలుగు చిత్రంగా మన శంకర వర ప్రసాద్ గారు ఘనత సాధించింది. ఈ చిత్రం ఉత్తర అమెరికాలో 3 మిలియన్ డాలర్ల మార్కును కూడా అధిగమించి, చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి ఇద్దరికీ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. 8వ రోజు అద్భుతమైన వసూళ్లు నమోదు చేసి, భారీ బుకింగ్‌లతో 9వ రోజున మరింత జోరుని కొనసాగుస్తోంది. ఇప్పటికే అనేక రికార్డులను బద్దలు కొట్టిన ఈ చిత్రం, ఇప్పుడు మరిన్ని మైలురాళ్ల దిశగా అడుగులు వేస్తోంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తూ, పండుగ వాతావరణానికి మరింత ఉత్సాహాన్ని నింపుతున్న తరుణంలో మెగాస్టార్ చిరంజీవి ఈ విజయం వెనుక నిలిచిన ప్రేక్షకులు, డిస్ట్రిబ్యూటర్లు, సినిమా టీమ్ కు కృతజ్ఞతలు తెలిపారు. తన కెరీర్‌లోని ప్రతి మైలురాయి తరతరాల సినీ ప్రేమికుల అభిమానంతోనే రూపుదిద్దుకుందని తెలియజేశారు. "మన శంకర వర ప్రసాద్ గారు సాధించిన ఈ అద్భుతమైన విజయాన్ని చూసి నా మనసు కృతజ్ఞతతో నిండిపోయింది. నేను ఎప్పుడూ మీ ప్రేమకు ప్రతిరూపమని చెబుతూనే ఉంటాను, ఈ రోజు మీరు దానిని మరోసారి నిరూపించారు. ఈ రికార్డు తెలుగు ప్రేక్షకులది, డిస్ట్రిబ్యూటర్లది, దశాబ్దాలుగా నా వెంట నిలిచిన మెగా అభిమానులది. థియేటర్లలో మీ విజిల్స్‌నే నాకు ప్రాణం. రికార్డులు వస్తాయి, పోతాయి.. కానీ మీ ప్రేమ మాత్రం శాశ్వతం. ఈ బ్లాక్‌బస్టర్ విజయం దర్శకుడు అనిల్ రావిపుడి, నిర్మాతలు సాహు & సుష్మితతో పాటు మొత్తం టీమ్ చేసిన కృషికి నిదర్శనం. నాపై మీరు చూపించిన నమ్మకానికి ఇది అంకితం. వేడుకలు కొనసాగిద్దాం. లవ్ యూ ఆల్!

## గద్దర్ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

- గతేడాది జనవరి నుంచి డిసెంబర్ 31 వరకు ప్రదర్శిత సినిమాలకు ఎంట్రీ
- వచ్చే నెల 3లోగా దరఖాస్తుల స్వీకరణ
- ప్రకటించిన మంత్రి కోమటిరెడ్డి

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2025 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతేడాది జనవరి నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటివరకు ఉన్న అవార్డు విభాగాలకు తోడు ఈసారి కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సామాజిక స్పృహను ప్రతిబింబించే చిత్రాలకు 'ఉత్తమ సామాజిక సందేశ చిత్రం' అవార్డు, ప్రత్యేక విభాగంలో డా. సి. నారాయణరెడ్డి అవార్డులు అందజేయనున్నట్లు వివరించారు. తమ ప్రభుత్వం సినిమా రంగానికి పెద్దపేట వేస్తోందన్నారు. అర్హులైన నిర్మాతలు, ఇతర దరఖాస్తుదారులు అవార్డులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు, మార్గదర్శకాలు ఈ నెల 31 వరకు పొందవచ్చన్నారు. వచ్చే నెల 3 వరకు ఎంట్రీల సమర్పణకు చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపే దరఖాస్తులను సమర్పించాలని అర్హులైన నిర్మాతలను మంత్రి కోరారు.



## బండ్ల గణేశ్ 'సంకల్ప యాత్ర'



సంకల్ప యాత్ర.. ఇది రాజకీయ యాత్ర కాదు. దైవ సంకల్పం. దేవుడికి మొక్కుకున్న మొక్కు. దేవుడు నా కోరిక తీర్చినందుకు రుణం తీర్చుకోవడానికి చేస్తున్న యాత్ర'అన్నారు ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేశ్. షాద్‌నగర్ నుంచి తిరుమలకు 'సంకల్ప యాత్ర' ప్రారంభించారు బండ్ల గణేశ్.

ఈ నేపథ్యంలో మీడియా సమావేశంలో నిర్మాత బండ్ల గణేశ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సంకల్ప యాత్ర.. ఇది రాజకీయ యాత్ర కాదు. దైవ సంకల్పం. దేవుడికి మొక్కుకున్న మొక్కు. దేవుడు నా కోరిక తీర్చినందుకు ఆయన రుణం తీర్చుకోవడానికి చేస్తున్న యాత్ర. ఇది రాజకీయ యాత్ర కాదు. ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేదు. నా షాద్ నగర్ ప్రజలు, నాకు ఈ స్థాయి ఇచ్చి, నా జీవితానికి అర్థం చెప్పి, నేనున్నానని ముందుకు నడిపించిన దైవ సమానులు పవన్ కళ్యాణ్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ నేను అడుగు ముందుకు వేస్తున్నాను. చిరంజీవి గారిని చూడాలని హైదరాబాద్ కు వెళ్లాను. ఈరోజు ఆయన నటించిన సినిమా నా థియేటర్లో ఆడుతుంది. నేను పాదయాత్ర మొదలు పెడుతున్నాను ఇది భగవంతుని ఆశీస్సులుగా భావిస్తున్నాను.

నాకు ఉదయం 4 గంటలకే నిద్ర లేచే అలవాటుంది. ఆ రోజు టీవీలో చంద్రబాబు అరెస్ట్ వార్త చూడగానే షాక్‌కి గురయ్యాను. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర, ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన వ్యక్తి చంద్రబాబు గారు. అలాంటి వ్యక్తిని అరెస్ట్ చేయడమేంటని ఆశ్చర్యపోయాను. గుంటూరుకు తీసుకొచ్చి బెయిల్ ఇస్తారనుకున్నాను. రాజమండ్రి జైలుకు పంపించారు. రోజులు గడిచేకొద్దీ నాకు టెన్షన్ మొదలైంది. జైల్లో చంద్రబాబు గారికి ఏమన్నా అవుతుందా అనే భయమేసింది. ప్రతిక్షణం ఆయన ఎప్పుడు బయటకు వస్తారా అని ఎదురుచూశాను. కోర్టు వాయిదా ఉన్నప్పుడల్లా నేను సుప్రీంకోర్టుకు వెళ్లాను. చంద్రబాబుకు బెయిల్ వచ్చిందనే వార్త మొదట వినడానికే ఢిల్లీ వెళ్లి కూర్చునేవాడిని. జైలు నుంచి ఆయన తిరిగివస్తే నా గడప నుంచి వెంకన్న గడపకు పాదయాత్రగా వస్తానని ఏడుకొండలవాడిని మొక్కుకున్నా. దేవుడి ఆశీస్సులతో 52 రోజుల తర్వాత మహానేత చంద్రబాబు నాయుడు గారు తెలుగు వాడి గర్వం లాగా తెలుగు వాడి తేజస్సు లాగా బయటకు వస్తుంటే ఆయన్ని చూసిన ఉత్సాహం ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది. ఆయన లాంటి వ్యక్తి తెలుగు జాతికి కావాలని మొక్కుకుని ఆ మొక్కు తీర్చుకోడానికి ఈరోజు పాదయాత్ర చేస్తున్నాను. ఈ యాత్రను రాజకీయంగా చూడొద్దు. విమర్శలు చేయొద్దు. నేను వేసే ప్రతి అడుగు చంద్రబాబు ప్రతి అభిమాని అడుగు. జై చంద్రబాబు.. ఈ అవకాశం ఇచ్చిన ఏడుకొండల స్వామికి, నా షాద్ నగర్ ప్రజలందరికీ ధన్యవాదాలు. మీ సహాయ సహకారాలు అభిమానం ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను.

విజయనగరం ఎంపీ అప్పలనాయుడు మాట్లాడుతూ.. బండ్ల గణేష్ గారు చేస్తున్న ఈ సంకల్ప యాత్ర చాలా గొప్పది. ఆ రోజుల్లో చంద్రబాబు నాయుడు గారికి కోట్ల మంది సంఘీభావాన్ని ప్రకటించారు. ఈరోజు బండ్ల గణేష్ గారు చేస్తున్న సంకల్ప యాత్రకి ఎంతోమంది తెలుగు ప్రజలకు సంఘీభావం తెలుపుతున్నారు. స్వామి ఆశీస్సులతో ముందుకు నడుస్తుంది. చివరి రోజు వారితో పాటు స్వామివారి దర్శనం మేమందరం చేయాలనుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో నేను పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది.

ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. బండ్ల గణేష్ గారు తలపెట్టిన ఈ సంకల్ప యాత్ర విజయం సాధించాలని విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. గణేష్ అందరి మేలుకోరేవాడు. వెంకన్న ఆశీస్సులు ఆయనపై ఉండాలని ఆయన సంకల్పం దిగ్విజంగా పూర్తి కావాలని, అందరిని మంచిగా చూసుకోవాలని వారిని విజ్ఞప్తి చేస్తున్నాను. అందరూ కూడా ఈ సంకల్ప యాత్రకు సహకరించాలని కోరుతున్నాను.

## 'క్రేజీ కల్యాణం' పోస్టర్ రిలీజ్




నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "క్రేజీ కల్యాణం". ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు.

ఈ రోజు వెర్సటైల్ యాక్టర్ వీకే నరేష్ బర్త్ డే సందర్భంగా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పోస్టర్ లో పర్వతాలు అనే పాత్రలో ట్రెడిషనల్ గా వీకే నరేష్ ఆకట్టుకుంటున్నారు. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్ తో సాగే చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో "క్రేజీ కల్యాణం" సినిమా చిత్రీకరణ జరిపారు. సురేష్ బొబ్బిలి "క్రేజీ కల్యాణం" సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు.

## 'దండోరా' యూనిట్‌ను అభినందించిన ఎన్టీఆర్




మంచి సినిమాలకు ఎప్పుడూ మద్ధతుగా నిలిచే స్టార్ హీరో, మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ రీసెంట్‌గా 'దండోరా' సినిమాను చూశారు. కథ, కథనం, పాత్రల తీరు తెన్నులు, సాంకేతిక నిపుణుల పనితీరు అన్ని ఆయనకు చాలా బాగా నచ్చాయి. దీంతో ఆయన తన ఎక్స్ (ట్విట్టర్)లో ''నేను ఇప్పుడే 'దండోరా' సినిమా చూశాను. చాలా లోతుగా, బలమైన ఆలోచనలకు దారి తీసేలా రూపొందించిన సినిమా ఇది. శివాజీ గారు, నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవి.... ఇలా అందరూ అద్భుతంగా నటించారు. దీన్నొక రూటెడ్ కథగా, అద్భుతంగా రాసి తెరకెక్కించిన డైరెక్టర్ మురళీ కాంత్ గారికి నా అభినందనలు. అలాగే ఈ ప్రయత్నానికి మద్ధతుగా నిలిచిన నిర్మాత రవీంద్ర బెనర్జీ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఇలాంటి గొప్ప సినిమాలో భాగమైన నటీనటులు, సాంకేతిక బృందానికి హృదయపూర్వక అభినందనలు'' అని 'దండోరా' చిత్ర యూనిట్‌ను అభినందించారు ఎన్టీఆర్.

## కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'ఓం శాంతి శాంతి శాంతి'



మల్టీ ట్యాలెంటెడ్ తరుణ్ భాస్కర్ లీడ్ రోల్ లో నటిస్తున్న హిలేరియస్ విలేజ్ కామెడీ ఎంటర్ టైనర్ 'ఓం శాంతి శాంతి శాంతిః. ఈషా రెబ్బా హీరోయిన్ గా నటిస్తున్నారు. ఏఆర్ సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్ పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్ , నవీన్ సనివరపు ఈ వెంచర్‌ను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలై ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఓం శాంతి శాంతి శాంతిః జనవరి 23న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు ఎఆర్ సజీవ్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మీ నేపథ్యం గురించి?**

మాది వెస్ట్ గోదావరి, నిడదవోలు. డైరెక్టర్ సంకల్ప్, నందకిషోర్ దగ్గర పని చేశాను. అలాగే స్టాండ్ ఆఫ్ రాహుల్ సినిమాకి అసోసియేట్ గా వర్క్ చేశాను. చాలామంది దర్శకులతో రైటింగ్ టీం లో వర్క్ చేశాను.

నాకు డైరెక్టర్ కావాలనే స్ఫూర్తినిచ్చింది వి వి వినాయక్ గారు. ఆయనది మా ఊరు పక్కనే. ఫస్ట్ టైం ఆయన్ని థియేటర్ విజిట్ లో చూసినప్పుడు అక్కడ ఆడియన్స్ ఆయనకు ఇచ్చిన రెస్పాన్స్ ని చూసి డైరెక్టర్ అవ్వాలనిపించింది.

**ఇది ఒక రిమేక్ స్టోరీ కదా.. మీ మొదటి కథగా ఈ సినిమా చేయడానికి కారణం?**

అది ప్రొడక్షన్ వైపు నుంచి వచ్చిన అవకాశం. 35 చిన్న కథ సినిమాకి డైరెక్టర్ నందకిశోర్ గారితో కలిసి పని చేశాను. ఇదే ప్రొడక్షన్ హౌస్ లో నా సొంత కథ అడిగారు. అయితే ఒక రెండు నెలల తర్వాత ఈ ప్రాజెక్టు గురించి చెప్పారు. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా లాంటి ఒక పెద్ద టీం తో నా ఫస్ట్ సినిమా చేయడమైనది అదృష్టంగా భావిస్తున్నాను.

**తెలుగు విషయానికొచ్చేసరికి ఎలాంటి మార్పులు చేర్పులు చేశారు?**

ఆ కథలోని కోర్ పాయింట్ ని తీసుకున్నాను. ఇది యూనివర్సల్ గా అందరికీ కనెక్ట్ అయ్యే కథ. అక్కడికి ఇక్కడికి కల్చర్ విషయంలో చాలా డిఫరెన్స్ ఉంటుంది. బ్యాక్ డ్రాప్ ని గోదారి ప్రాంతానికి మార్చాము. దాదాపుగా 60% కథని మార్చాము. చివరి 30 నిమిషాలు కొత్త కథలాగే అనిపిస్తుంది. ఫైట్ ఒకటే కామన్ గా ఉంటుంది కానీ మిగతాదంతా కొత్తగా ఉంటుంది.

తరుణ్ గారు ఆల్రెడీ పాపులర్ డైరెక్టర్ ఆయన్ని డైరెక్ట్ చేసినప్పుడు ఆయన ఇచ్చిన సపోర్ట్ ఏమిటి?

ఆయన చాలా మోరల్ సపోర్ట్ చేశారు. ఆయన దగ్గరే అసిస్టెంట్ గా జాయిన్ అవ్వాలి అనుకున్నాను. అలాంటిది ఆయన్ని డైరెక్ట్ చేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది. ఫస్ట్ డే షూట్ కాస్త టెన్షన్ పడ్డాను. కానీ తర్వాత ఆయన నన్ను చాలా కంఫర్ట్ గా చూసుకున్నారు. పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఆయనకి ఫైనల్ కాపీ మాత్రమే చూపించాను. మధ్యలో రఫ్ కట్టు కూడా చూపించలేదు. మూవీ చూసి చాలా మెచ్చుకున్నారు.

తరుణ్ గారు ఈ సినిమాలో గోదారి యాస మాట్లాడడానికి చాలా ప్రిపేర్ అయ్యారు. చాలా హోంవర్క్ చేశారు నిజంగా ఆయన ఆయాసలో పలికే డైలాగులు చాలా సర్ప్రైజ్ గా ఉంటాయి. తరుణ్ అన్న అనగానే మనకి తెలంగాణ స్లాంగే గుర్తొస్తుంది. ఇందులో కంప్లీట్ గోదావరి యాసని ఆడియన్స్ చూస్తారు.

సినిమా చూసి తరుణ్ గారు చాలా సర్ప్రైజ్ అయ్యారు. నాకంటే ఎక్కువగా ఆనందపడ్డారు.

**మ్యూజిక్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు ?**

ఒరిజినల్ నుంచి ఒక్క ట్రాక్ కూడా వాడుకోలేదు. కంప్లీట్ గా కొత్త మ్యూజిక్ చేయడం జరిగింది. ఒరిజినల్ కంటే తెలుగులో ఎక్కువ సాంగ్స్ ఉన్నాయి. మొత్తం ఏడు పాటలు. అన్ని పాటలు కూడా అద్భుతంగా వచ్చాయి.

ఇది కంప్లీట్ గా కమర్షియల్ సినిమా. ఇవివి సత్య నారాయణ గారి సినిమాల్లో భార్యాభర్తల మధ్య ఉండే ఎంటర్టైన్మెంట్ ఎమోషన్ ఏ విధంగా రన్ అవుతుందో ఈ సినిమాలో కూడా అంత చక్కని వినోదం కుదిరింది.

**ఇందులో క్యారెక్టర్స్ ఎలా ఉండబోతున్నాయి?**

తరుణ్ గారి క్యారెక్టర్ చేపల వ్యాపారం చేసే వ్యక్తి. ఒక చేప జీవితాన్ని మెటఫర్ గా తీసుకుని ఆ క్యారెక్టర్ ని డిజైన్ చేయడం జరిగింది. చేపకి మనం ఫుడ్ వేసినప్పుడు అది పొడుచుకునే తింటుంది. తరుణ్ క్యారెక్టర్ ఆ ఊర్లో తన తండ్రి మామయ్యను చూస్తూ పెరిగిన క్యారెక్టర్. ఆ ఊరు తప్పితే అక్కడ మరో ప్రపంచం తెలియదు. అలాగే శాంతి పాత్రని క్యాషియో (జీడి)ని మెటాఫర్ గా తీసుకోవడం జరిగింది. మనం క్యాషియో నట్ ని తీసుకొని ఆ పండుని బయట పారేస్తాం. నిజానికి అది హెల్త్ కు చాలా మంచిది. అమ్మాయి ప్రాముఖ్యత ని తెలిజేసేలా ఆ క్యారెక్టర్ ని చాలా అద్భుతంగా డిజైన్ చేయడం జరిగింది. ఒరిజినల్ లో దర్శన గారికి కంటెన్ ఈషా గారి పాత్ర చాలా ఇంపాక్ట్ ఫుల్ గా ఉంటుంది.

ఈ సినిమాలో దాదాపు అన్ని కొత్త సీన్లే ఉంటాయి. ఒరిజినల్ నుంచి జస్ట్ కోర్ ఐడియా ఒక్కటే తీసుకున్నాము మిగతా ట్రీట్మెంట్ అంతా చాలా కొత్తగా ఉంటుంది. ఇందులో బ్రహ్మాజీ గారితో పాటు మిగతా క్యారెక్టర్ ఆర్టిస్టులు పాత్రలన్నీటిలో మంచి ఫన్ వుంటుంది.

39 రోజుల్లో షూటింగ్ పూర్తి చేశాను. అనుకున్న బడ్జెట్లో సినిమాని తీయడం జరిగింది. సినిమా నిడివి రెండు గంటల 11 నిమిషాలుగా వచ్చింది డ్రామా ఎమోషన్స్ విషయంలో ఒక దర్శకుడిగా నాకు మంచి పేరు వస్తుందని నమ్ముతున్నాను.

**ఇండస్ట్రీలో ఈ సినిమా ఎవరు చూశారు?**

సురేష్‌బాబు గారు చూశారు. అలాగే తరుణ్ అన్న ఫ్రెండ్స్ అందరు చూశారు. అన్ని వైపుల నుంచి చాలా మంచి పాజిటివ్ రిపోర్ట్స్ వచ్చాయి.

**నెక్స్ట్ చేయబోయే కథల గురించి?**

కొన్ని కథలు సిద్ధంగా ఉన్నాయి. ఈ సినిమా రిలీజ్ అయిన తర్వాత వాటి గురించి ప్రయత్నించాలి. నాకు మంచి డ్రామా ఉన్న కథలు చేయడం ఇష్టం.

**ఆల్ ది బెస్ట్**

**థాంక్ యూ**

## రూ.400 కోట్లతో 'మా వందే'



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్‌ను "మా వందే" టైటిల్ తో సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు ప్రొడ్యూసర్ వీర్ రెడ్డి.ఎం. ఈ చిత్రంలో నరేంద్ర మోదీ పాత్రలో మలయాళ స్టార్ హీరో ఉన్ని ముకుందన్ నటిస్తున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశాన్నిస్తూ ప్రధాని మోదీ జీవితాన్ని యదార్థ ఘటనల ఆధారంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు క్రాంతికుమార్.సీహెచ్. ప్రధాని మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని విశేషాలన్నీ ఎంతో సహజంగా "మా వందే" సినిమాలో చూపించబోతున్నారు. ఈ సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యున్నత సాంకేతిక విలువలు, వీఎఫ్ఎక్స్ తో రూపొందుతోంది. "మా వందే" చిత్రాన్ని పాన్ ఇండియా భాషలతో పాటు ఇంగ్లీష్‌లోనూ రిలీజ్ చేయనున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశం "మా వందే" చిత్రంలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. "మా వందే" సినిమాను సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ సంస్థ 400 కోట్ల రూపాయలకు పైగా హ్యూజ్ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఈ స్టోరీ డ్రివెన్ మూవీని ప్రపంచంలో తొలిసారిగా తొలిసారి ఆరి అలెక్సా 265 జెంట్రీ, కుకీ లెన్స్ తో తెరకెక్కిస్తుండటం విశేషం. హాలీవుడ్ బ్లాక్ బస్టర్ మూవీ ఆక్వామ్యాన్ లో హీరోగా నటించిన జేసన్ మమొవాను "మా వందే" చిత్రంలో ఓ కీలక పాత్రకు సంప్రదిస్తున్నారు. రవీనా టాండన్, జగపతి బాబు, శరత్ కుమార్ వంటి పేరున్న యాక్టర్స్ ఫస్ట్ సిట్టింగ్ లోనే కథ నచ్చి మూవీ చేసేందుకు అంగీకరించారు. స్టంట్ కొరియోగ్రాఫర్ కింగ్ సోలొమన్ , ప్రొడక్షన్ డిజైనర్ సాబు సిరిల్, ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్, డీవోపీ కె.కె. సెంథిల్ కుమార్, మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ వంటి టాప్ మోస్ట్ టెక్నీషియన్స్ వర్క్ చేస్తున్నారు. ఓ మామూలు బయోపిక్ లా కాకుండా చలనచిత్ర చరిత్రలో చిరకాలం నిలిచిపోయే అత్యంత భారీ ప్రాజెక్ట్ గా "మా వందే" నిర్మాణవుతోంది. ప్రీ ప్రొడక్షన్ కే మూడేళ్ల సమయం తీసుకోవడం చూస్తే ఈ సినిమా కోసం మేకర్స్ ఎంత ఎఫర్ట్స్ పెడుతున్నారో అర్థమవుతోంది. ఈ నెల 22వ తేదీ నుంచి కాశ్మీర్ లో ప్రారంభం కానుంది.

## నిరాకరించడానికి కారణం అదే



**మలయాళ ముద్దుగుమ్మ, భావన సుదీర్ఘ విరామం తర్వాత మళ్ళీ వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'అనోమి' జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న భావన..తాను మలయాళ సినిమాలకు ఎందుకు దూరమవ్వాల్సి వచ్చిందో క్లారిటీ ఇచ్చింది. "నా జీవితంలో ఏదీ ప్లాన్ ప్రకారం జరగలేదు. ఒకానొక సమయంలో మలయాళ ఇండస్ట్రీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఆ నిర్ణయం కేవలం ఒక క్షణంలో తీసుకున్నదే అయినా, ఆ తర్వాత నాకు అదే సౌకర్యంగా అనిపించింది. పెళ్లి తర్వాత నా కుటుంబంతో ప్రశాంతంగా గడిపాను. ఆ సమయంలో మలయాళ సినిమా ప్రపంచంతో సంబంధం లేకపోవడమే నాకు నచ్చింది" అంటూ తన మనసులోని మాటను బయటపెట్టారు.**

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.